RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers



హైదరాబాద్ | 03 ఫిబ్రవరి 2026 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:205


## జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి కి రావి నారాయణరెడ్డి జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన సమరయోధుడు రావి నారాయణ రెడ్డి కి తెలంగాణ సమాజంలో ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

రావి నారాయణ రెడ్డి చరిత్రను పాఠ్యాంశంగా చేర్చడం, వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అందరితో చర్చించి, వారి గౌరవాన్ని పెంచేందుకు మంత్రిమండలిలో నిర్ణయం తీసుకుని సముచితమైన స్థానం కల్పిస్తామని వెల్లడించారు.

'తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు' ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మవిభూషణ్ 'రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ పురస్కారం -- 2025'ను ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి కి అందజేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "అరాచక శక్తులకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు రావి నారాయణ రెడ్డి. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా, పేద ప్రజల కోసం తన 500 ఎకరాల భూమిని దానం చేసిన గొప్ప వ్యక్తి. 'బండెనక బండి కట్టి, పదహారు బండ్లు కట్టి' అని తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసిన బండి యాదగిరి లాంటి నిరక్షరాస్యులను కూడా ప్రభావితం చేసిన గొప్ప నాయకుడు. దేశంలో మొట్టమొదటి ప్రధాని నెహ్రూ కంటే ఎక్కువ




మెజారిటీతో పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ప్రజా తీర్పును ప్రతిబింబించేలా ఆనాడు మొట్టమొదటి పార్లమెంట్ భవనాన్ని రావి నారాయణ రెడ్డి తో నెహ్రూ ప్రారంభింపజేశారు. 60 ఏళ్ల వయసులో ప్రజలకు స్ఫూర్తినిస్తూ పార్టీ, రాజకీయ పదవుల నుంచి తప్పుకున్న గొప్ప నేత రావి నారాయణ రెడ్డి. మున్సిపల్ ఎన్నికల అనంతరం రావి నారాయణ రెడ్డి గారికి సముచిత గౌరవం ఇచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలు తీసుకుంటాం" అని చెప్పారు.

రావి నారాయణ రెడ్డి జాతీయ పురస్కారం జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి కి దక్కడం సముచితమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

"నిర్వాహకులు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారు. తొలితరంలో బూర్గుల రామకృష్ణారావు , రావి నారాయణ రెడ్డి స్ఫూర్తినిస్తే, మలితరంలో ఎస్. జైపాల్ రెడ్డి , సుదర్శన్ రెడ్డి వంటి వారు తెలంగాణ సమాజానికి స్ఫూర్తినిచ్చారు.

జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలంగాణ సమాజానికి ఒక స్ఫూర్తిగా నిలిచారు. రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో వారు పోషించిన పాత్ర మనందరికీ గుర్తుంది. వారి అనుభవాలు పరిపాలనలో ఉపయోగపడుతున్నాయి" అని వివరించారు.

హైదరాబాద్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు చాడ వెంకట్ రెడ్డి , కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్ రెడ్డి తో పాటు హాజరైన సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, సీపీఐ నాయకులు నారాయణ, చాడ వెంకట్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఇతర నేతలు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



## మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవాణే తన పుస్తకంలోని వ్యాఖ్యలపై సభలో ఘాటు చర్చ



న్యూఢిల్లీ ఫిబ్రవరి 2 ;: మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవాణే తన పుస్తకంలో రాసుకున్న వ్యాఖ్యలను ఇవాళ రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ప్రస్తావించారు. దీంతో లోక్‌సభలో రగడ నెలకొన్నది. ప్రచురణ కాని పుస్తకం నుంచి రాహుల్ వ్యాఖ్యలు చేస్తున్నారని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. రాహుల్ గాంధీ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. కేంద్ర బడ్జెట్‌పై జరుగుతున్న చర్చలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మాట్లాడారు. అయితే చైనా అంశంపై మాజీ ఆర్మీ చీఫ్ నరవాణే తన పుస్తకంలో రాసుకున్న వ్యాఖ్యలను రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఓ మ్యాగజైన్‌లో ప్రచురించిన పేజీలను ఆయన సభలో చూపించారు. తన వాదనను నిజం చేసే రీతిలో ఆ ప్రస్తావన ఉన్నట్లు రాహుల్ పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను అధికార పక్షం వ్యతిరేకించింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంశాఖ మంత్రి అమిత్ షా జోక్యం చేసుకుని.. ఇంతకీ రాహుల్ చెప్పున్న ఆ బుక్ పబ్లిష్ అయ్యిందా లేదా అని ప్రశ్నించారు.హౌజ్ రూల్స్‌ను రాహుల్ గాంధీ ఉల్లంఘించినట్లు రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. ప్రచరణ జరగని పుస్తకాన్ని ఉద్దేశిస్తూ ఎలా వ్యాఖ్యానిస్తారని ఆయన ప్రశ్నించారు. ఆ పుస్తకంలో ఎంత వాస్తవం ఉందో ఎలా తెలుస్తుందని ఆయన అన్నారు. ఆ సమయంలో రాహుల్, రాజ్‌నాథ్ మధ్య వాగ్వాదం జరిగింది. చాలా విశ్వసనీయ సమాచారాన్ని తాను ప్రస్తావిస్తున్నట్లు రాహుల్ తెలిపారు. అయితే ఏ పుస్తకం నుంచి ఆ వ్యాఖ్యలను తీసుకున్నారో.. ఆ పుస్తకాన్ని సభలో ప్రవేశపెట్టాలని రాజ్‌నాథ్ డిమాండ చేశారు. ప్రతిపక్ష పక్ష నేత రాహుల్ ఆ బుక్‌ను సభలో ప్రవేశపెట్టాలని ఆయన అన్నారు.రాహుల్ గాంధీకి అండగా అఖిలేశ్ యాదవ్ మాట్లాడారు. చైనా అంశంపై చర్చించేందుకు రాహుల్‌కు అవకాశం ఇవ్వాలని అఖిలేశ్ కోరారు. చైనా అంశం చాలా సున్నితమైందని, సభలో ఆ అంశంపై సీరియస్‌గా చర్చ జరగాలన్నారు. జాతీయ భద్రత, విదేశీ విధానంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న సమయంలో లోక్‌సభ ప్రతిపక్ష నేతను అడ్డుకోరాదన్నారు. సభా వ్యవహారాలు సాగుతున్న సమయంలో మ్యాగిజైన్ లేదా వార్తాపత్రికల ఆర్టికల్స్‌ను సభ్యులు ప్రస్తావించరాదు అని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అయితే ఇండో-చైనా సంబంధాలపై మాట్లాడే హక్కు తనకు ఉందని, ఏ నిబంధనలు తనను అడ్డుకోలేవని రాహుల్ గాంధీ అన్నారు. చైనాతో సంబంధాలపై మాట్లాడేందుకు ఏం రూల్స్ అడ్డు ఉన్నాయో చెప్పాలని రాహుల్ స్పీకర్‌ను కోరారు.

## రెండేళ్లలోనే మార్పుచూపించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాం

**సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన**

**సంక్షోభంలో రాష్ట్రాన్ని రెండేళ్లలో సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దాం**

**అభివృద్ధి సంక్షేమ కార్యాక్రమాలను వేగవంతంగా ప్రజల్లోకి చేర్చండి**

**ఆధునీకరించిన ఐఏపిఆర్ వెబ్‌సైట్ ను ప్రారంభించిన**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ :- ఏ మార్పు కావాలని తెలంగాణ ప్రజలు ప్రజాప్రభుత్వంపై విశ్వాసం ఉంచారో రెండేళ్లలోనే ఆ మార్పు స్పష్టంగా చూపించి ప్రజల విశ్వాసాన్ని నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.


తమ ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి అన్ని రంగాలలోనూ మరీ ముఖ్యంగా ఆర్థికరంగంలో పెను సంక్షోభమని ఈ పరిస్థితుల్లో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఒక్కోమెట్టు పేర్చుకుంటూ సంక్షోభం నుంచి గట్టెక్కుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు.

ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం ప్రజల జీవితాలలో స్పష్టమైన మార్పునకు నాంది పలుకుతున్నాయని అన్నారు.

వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన వరకు అన్ని రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలుపుతున్నాయన్నారు.

ఈ మార్పులను ప్రజలకు సమర్ధవంతంగా చేరవేయడంలో ప్రజా సంబంధాల శాఖ పాత్ర అత్యంత కీలకం. ప్రస్తుత పరిస్థితులకు



అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకొని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు వేగవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సమాచార శాఖ అధికారులకు సూచించారు.

సోమవారం నాడు సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆధునీకరించిన సమాచార పౌరసంబంధాల శాఖ వెబ్‌సైట్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

ప్రభుత్వ పాలనను రెండేళ్లు పూర్తి చేసుకుని మూడో వసంతంలోకి అడుగుపెట్టాం. రెండేళ్ల కాలం మరీ తక్కువే కానీ ప్రభుత్వం సాధించిన విజయాలు మాత్రం అత్యద్భుతం.

రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టాం. ఎన్నికల్లో హామీలు ఇవ్వకపోయినా ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశాం.

వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధిస్తున్నాం. ఆర్థికవృద్ధిలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ -- 2047 విజన్ తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

ఒకవైపు ప్రపంచ నగరాలతో పోటీ పడే లక్ష్యాలను నిర్ధేశించుకొని మరోవైపు పేదల ఆకాంక్షలు తీర్చే సంక్షేమ ఫలాలు అందిస్తూ, ద్విముఖ వ్యూహంతో మా ప్రభుత్వం పాలన సాగిస్తోంది. పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ తెలంగాణను రెండేళ్లలో దేశానికి రోల్‌మోడల్‌గా నిలబెట్టామని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఐడపిఆర్ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సీపీఆర్‌వో జి. మల్సూర్, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డిఎస్ జగన్ , జాయింట్ డైరెక్టర్ రమణ తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రజాబలం

03 ఫిబ్రవరి 2026 మంగళవారం

# విమాన ప్రమాదాలకు అంతం ఎప్పుడు

ఆది అంతమూ లేని ఆకాశాన్ని.. అసలైన స్వేచ్ఛకు ప్రతీకగా మనం భావిస్తూ ఉంటాం. అయితే.. సమున్నతంగా, అనంతంగా వ్యాపించిన ఆ నీలి ఆకాశమే.. జాతిని ముందుకు నడపాల్సిన విలువైన వ్యక్తులను నిర్దాక్షిణ్యంగా చిదిమేసినప్పుడు కలిగే దుఃఖం మాటల్లో చెప్పలేనిది. తనను నమ్ముకున్న అనుచరులు పోటీ చేస్తున్న చోట ప్రచారానికో, దగాపడిన ప్రజలకు ధైర్యం చెబుదామనో, దేశప్రగతిని పట్టాలెక్కించే మరో కార్యక్రమం కోసమో.. విమానంలోనో, హెలీకాప్టర్‌లోనో బయలుదేరిన నేతలు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోయినప్పుడు.. అది చెప్పలేని విషాదంగా పరిణమిస్తుంది. దేశ గమనాన్ని మార్చి, కోట్లాది జాతిజనుల కలలకు ప్రతీకలుగా నిలిచిన ఆ వ్యక్తులు ఈ ప్రపంచం నుంచి మాయమైన తీరు.. ఒక తరానికి పీడకలగానే నిలిచిపోతుంది. భారతప్రజాస్వామ్య చరిత్రలో అలాంటి అత్యంత విషాదకరమైన పీడకలలు ఎన్నో ఉన్నాయి. అశేష ప్రజానీకానికి ఆరాధ్య దైవాలుగా నిలిచిన ఆ నేతల చివరి ప్రయాణాలను తలచుకుంటే.. నేటికీ గుండె బరువెక్కక మానదు. ఈ జాబితాలో ప్రజల మనసులు గెలిచిన నాయకుల నుంచి అన్ని రంగాల ప్రముఖులూ ఉన్నారు. విమాన ప్రమాదాలు అనగానే తెలుగువారికి ముందుగా కొన్ని పేర్లు గుర్తుకు వస్తాయి. వారిలో యలవర్తి నాయుడమ్మ ఒకరు. చిన్న రైతు కుటుంబంలో పుట్టిన నాయుడమ్మ అంతర్జాతీయ స్థాయి రసాయన శాస్త్రవేత్తగా ఎదిగారు.అప్పట్లో ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరాగాంధీకి సలహాదారుగా పనిచేసిన ఆయన, ఐక్యరాజ్యసమితితోపాటు పలు అంతర్జాతీయ సంస్థలకు, విదేశీ సంస్థలకు కూడా సలహాదారుగా పనిచేశారు. కెనడాలోని ఐడిఆర్‌సి సమావేశానికి హాజరై 1985 జూన్ 23న తిరిగి వస్తున్న క్రమంలో ఆ ఎయిర్ ఇండియా పేలిపోవటంతో కన్నుమూశారు. ఈ వార్త వినగానే.. ఆయన భార్య డాక్టర్ పవన ఆత్మహత్య చేసుకుని మరణించటం మరో విషాదం. ఇలాంటి విషాద వార్తలు వినగానే తెలుగువారికి ఎపి మాజీ సిఎం రాజశేఖరరెడ్డి, నాటి లోక్‌సభ స్పీకర్ జిఎంసి బాలయోగి, సినీ నటి సౌందర్య మరణాలు గుర్తుకు రాకుండా ఉండవు. లోక్‌సభ మాజీ స్పీకర్, టిడిపి నేత జిఎంసి బాలయోగి 2002 మార్చి 3న హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. భీమవరం నుంచి బయలుదేరిన ఆయన ప్రయాణిస్తున్న ప్రైవేట్ హెలికాప్టర్, కృష్ణా జిల్లా కైకలూరు సమీపంలోని ఓ చెరువులో కూలిపోయింది. సరిగ్గా రెండేళ్ల తర్వాత తెలుగువారికి ఎంతో సుపరిచితురాలైన ప్రముఖ సినీ నటి సౌందర్య 2004 ఏప్రిల్ 17న జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందారు. ఇక.. తెలుగు రాష్ట్రాల ప్రజల జనహృదయ నేతగా పేరు తెచ్చుకున్న నేత దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 14 వ సిఎంగా పనిచేసిన వైఎస్ఆర్.. 2009, సెప్టెంబర్ 2న నల్లమల అడవుల్లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాల ప్రజలను తీవ్రంగా కలచివేసింది. విమాన ప్రమాదంలో దేశం కోల్పోయిన మరో మేధావి హోమీ జహంగీర్ బాబా. 1966 జనవరి 24న జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంలో ఈ ప్రపంచ ప్రఖ్యాత అణుశాస్త్రవేత్త అకాల మరణం చెందారు. 1980 జూన్ 23న మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ కుమారుడు సంజయ్ గాంధీ విమాన ప్రమాదంలో మృతి చెందారు. ఢిల్లీ ఫ్లయింగ్ క్లబ్‌కు చెందిన విమానాన్ని నడుపుతూ, ప్రమాదకర విన్యాసాలు చేయడానికి ప్రయత్నించగా, విమానం కూలిపోయింది. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి మాధవరావు సింధియా 2001 సెప్టెంబర్ 30న విమాన ప్రమాదంలో మృతి చెందారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా, ఆయన ప్రయాణిస్తున్న విమానం ఉత్తరప్రదేశ్ మైన్‌పురి సమీపంలో కూలిపోయింది. అలాగే, ప్రముఖ పారిశ్రామికవేత్త, హర్యానా మంత్రి ఓంప్రకాశ్ జిందాల్ 2005 మార్చి 31న జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. 2011 ఏప్రిల్ 30న తవాంగ్, ఇటానగర్ మధ్య జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో అప్పటి అరుణాచల్‌ప్రదేశ్ సిఎం డోర్జి ఖండు దుర్మరణం చెందారు.భారతదేశ తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ 2021 డిసెంబర్ 8న జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందారు. ఈ ప్రమాదంలో బిపిన్ రావత్ భార్యతోపాటు మరో 11మంది మరణించారు. నిరుడు జూన్ నెలలో దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపిన అహ్మదాబాద్ ఎయిరిండియా ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మరణించారు. ఇలా వరుసగా జరుగుతున్న విమాన, హెలికాప్టర్ ప్రమాదాలు చరిత్రలో చెరగని విషాద ఘట్టాలుగా నిలిచిపోయాయి. తాజాగా, బుధవారం ఉదయం మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆయన ప్రయాణిస్తున్న విమానం బారామతిలో ల్యాండింగ్ అవుతుండగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు మృతి చెందారు. ఈ వార్త విని యావత్ దేశంగ్ర్భాంతికి గురైంది. ముంబై నుంచి తన సొంత నియోజకవర్గం బారామతిలో జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. విమానం బయల్దేరినప్పటి నుంచి రెండుసార్లు సిగ్నల్స్ కట్ అయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటాలో తేలింది. ఉదయం 8:10 గంటలకు ముంబై ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరిన విమానం, ప్రారంభంలో 6 కిలోమీటర్ల ఎత్తులో ప్రయాణించింది. 8:34 నిమిషాలకు మొదటిసారి సిగ్నల్స్ ఆగిపోయి, కొద్దిసేపటి తర్వాత మళ్లీ కనెక్ట్ అయ్యాయి. అయితే, 8:43 నిమిషాలకు బారామతి ఎయిర్‌పోర్ట్‌కు కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పుడు సిగ్నల్స్ పూర్తిగా నిలిచిపోయాయి. ప్రమాదానికి కొన్ని నిమిషాల ముందు విమానం వేగం గంటకు 237 కిలోమీటర్లకు పడిపోయి, ఆకస్మికంగా సంబంధాలు తెగిపోవడంతో కూలిపోయినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. విమాన ప్రమాదాలకు చాలా సార్లు పైలట్ తప్పిదం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌లో నిర్లక్ష్యం కారణంగా కూలిపోయిన ఘటనలు గతంలో ూచూశాం. అంతేకాకుండా చాలాసార్లు విమానాలు నడిపే పైలట్లకు అనుభవం లేకపోవడం వల్ల.. వారు తీసుకునే తప్పుడు నిర్ణయాలతోనూ విమానాలు కూలిపోయే అవకాశాలుంటాయి. ఇక సాంకేతిక సిబ్బంది చేసిన తప్పుల కారణంగా సైతం విమానాలు కూలిపోతుంటాయి. పైలట్ –కంట్రోల్ రూమ్ మధ్య కమ్యూనికేషన్ కోల్పోవడం కూడా విమాన ప్రమాదానికి దారితీస్తుంది. వాతావరణం కూడా విమాన ప్రమాదాలకు కారణం అవుతుంది. బలమైన తుఫానులు, మెరుపులు, భారీ వర్షం, వాతావరణంలో అల్లకల్లోలం కారణంగా, విమానం నియంత్రణ కోల్పోయి ప్రమాదం బారినపడే అవకాశాలుంటాయని నిపుణులు అంటున్నారు.

# పదో తరగతి విద్యార్థులపై25 శాతం అకడమిక్ భారాన్నితగ్గించిన కేరళ ప్రభుత్వం



కేరళ ఫిబ్రవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );విద్యారంగంలో ముందుండే రాష్ట్రంగా గుర్తింపు తెచ్చుకున్న కేరళ.. మరో కీలక మార్పు దిశగా అడుగులేయబోతుంది. పదో తరగతి విద్యార్థులపై అకడమిక్ భారాన్ని తగ్గించేందుకు 25 శాతం సిలబస్ తగ్గించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని కేరళలోని కొల్లాంలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి వి.శివకుట్టి ప్రకటించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఈ నిర్ణయం అమలవుతుందని ఆయన వెల్లడించారు.విద్యార్థులపై ప్రస్తుతం సిలబస్ ఎక్కువగా ఉండటంతో ఒత్తిడి పెరుగుతోంది. దీంతో సిలబస్ తగ్గించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు అక్కడి ప్రభుత్వాన్ని చాలాకాలంగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో నిపుణుల సూచన మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి సిలబస్‌ను 25 శాతం తగ్గించనున్నారు. ఇందుకు సంబంధిత కమిటీ ఆమోదం తెలిపిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఉన్న సిలబస్‌లో 25 శాతం తగ్గుతుందని, అయితే, కంటెంట్ మాత్రం మారకుండా చూసుకుంటున్నామన్నారు. విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించాలని, ఒత్తిడి తగ్గించాలనే లక్ష్యంతోనే, విశాల దృక్పథంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా, స్టూడెంట్ ఫ్రెండ్లీ ఎడ్యుకేషన్ అందిస్తామన్నారు.మరోవైపు సిలబస్ తగ్గించడం ద్వారా విద్యావ్యవస్థ బలహీనమవుతుందంటూ, ప్రమాణాలు దెబ్బతింటాయంటూ కొందరు నిపుణులు, పేరెంట్స్ చేస్తున్న వాదనను మంత్రి తప్పుబట్టారు. అలాంటి వాదనలో నిజం లేదని, ఏ సిలబస్ తొలగించినా జాగ్రత్తగా, బాధ్యతగా చేస్తామన్నారు. సిలబస్‌లోని కీలక, మూల అంశాల్ని తొలగించబోమన్నారు. అయితే, ప్రతి స్థాయిలో ఏ అంశం మరోసారి రాకుండా చేయడం ద్వారా సిలబస్ తొలగిస్తామని హామీ ఇచ్చారు. దీనివల్ల పిల్లలపై పరీక్షల ఒత్తిడి తగ్గుతుందని వ్యాఖ్యానించారు.

# సజ్జనార్ మీరు దర్యాప్తు బృందానికి చీఫ్ అనే సంగతి గుర్తుచేసుకోండి:కేటీఆర్



హైదరాబాద్ ఫిబ్రవరి 2 ;'చట్టవిరుద్ధమైన ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రశ్నించడం ముగిసింది' అని ఆదివారం రాత్రి సిట్ చీఫ్ సజ్జనార్ ప్రకటించడం వివాదాస్పదం అయ్యింది. సజ్జనార్ తీరును ఇప్పటికే మాజీ మంత్రి హరీష్‌రావు తప్పుపట్టారు. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా సజ్జనార్ ప్రకటనపై అభ్యంతరం వ్యక్తంచేశారు.'కమిషనర్‌గారూ (సజ్జనార్‌ను ఉద్దేశించి) మీరే న్యాయమూర్తిగా, జ్యూరీగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నట్లుగా కనబడుతున్నారు. దయచేసి మీరు దర్యాప్తు బృందానికి చైర్మన్‌గా ఉన్నారనే విషయాన్ని గుర్తుచేసుకోండి. ఫోన్ ట్యాపింగ్ కేసు చట్టవిరుద్ధమా, చట్టబద్ధమా..? అనేది చట్టపరంగా కోర్టు ద్వారా నిరూపణ కావాల్సి ఉంది' అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు.'ఇలాంటి తీవ్ర అభ్యంతరకరమైన ప్రకటనలను గౌరవ కోర్టులు పరిగణలోకి తీసుకుంటాయని, అందుకు తగిన చర్యలు తీసుకుంటాయని నేను ఆశిస్తున్నా' అంటూ ముగించారు. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు కేసీఆర్‌ను ఆదివారం నందినగర్‌లోని ఆయన నివాసంలో ఐదు గంటలపాటు విచారించారు. విచారణ ముగిసిన అనంతరం ప్రకటన చేస్తూ సజ్జనార్.. 'ఇల్లీగల్ ఫోన్ ట్యాపింగ్ కేసు' అని వ్యాఖ్యానించారు.

# గుంట నక్కలతో కలిసి కాంగ్రెస్ డ్రామాలాడుతోంది: కవిత

హైదరాబాద్ ఫిబ్రవరి 2 : ఫోన్ ట్యాపింగ్ విషయంలో సిట్ విచారణను తప్పు పడుతూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మాట్లాడటం సరికాదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తెలిపారు. చట్టాలను అందరూ గౌరవించడంతో పాటు సహకరించాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ను సిటి విచారించిన సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో రెండేళ్లు అవుతున్నా సిట్ విచారణ ఎందుకు ముగియడం లేదని ప్రశ్నించారు. దోషులకు శిక్షపడేలా చూడాలని, గుంట నక్కలతో కలిసి కాంగ్రెస్ డ్రామాలాడుతోందని మండిపడ్డారు. తనతో పాటు తన భర్త ఫోన్లు కూడా ట్యాప్ చేశారని, విచారణకు సిట్ అధికారులు పిలిస్తే వెళ్లతానని కవిత స్పష్టం చేశారు. సిట్ విచారణలో ఏం జరిగిందే మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు చెబుతారన్నారు.



# కోర్టు తీర్పు రాకముందే 'ఇల్లీగల్' అని ఎలా డిసైడ్ చేస్తారు ? సిట్ చీఫ్ సజ్జనార్ తీరుపై హరీష్ రావు ఆగ్రహం.



హైదరాబాద్ రాజ్యాంగం ప్రకారం పోలీసుల పని కేవలం ఎంక్వయిరీ చేయడం మాత్రమే.. తీర్పులు ఇవ్వడానికి మీరేమీ న్యాయమూర్తులా అని మాజీ మంత్రి హరీష్ రావు సిట్ కు సారథ్యం వహిస్తున్న హైదరాబాద్ సీపీ సజ్జనార్ ను నిలదీసారు.

విచారణ ఇంకా నడుస్తుండగానే ఇల్లీగల్ అని ఫిక్స్ అయ్యారంటే.. మీరు ముందే ఒక నిర్ణయానికి వచ్చారా? ప్రతిపక్ష నేతకు గౌరవం ఇవ్వకపోవడమేనా మీ సంస్కారం? ఖాకీ డ్రెస్ వేసుకొని రాజకీయ అజెండాలు అమలు చేయడం ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్కు విరుద్ధమని మీకు తెలియదా అని ప్రశ్నించారు.

తీర్పులు చెప్పాల్సింది కోర్టులు.. పోలీసులు కాదు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కోర్టు విచారణ జరిపి తుది తీర్పు ఇవ్వకముందే, సిట్ చీఫ్ సజ్జనార్ గారు అధికారికంగా 'ఇల్లీగల్' అని ప్రకటించడం బాధ్యతరాహిత్యం. మన ప్రజాస్వామ్యంలో కోర్టు నిర్ధారించే వరకు ఏ ఆరోపణను కూడా నేరంగా చూడకూడదనేది కనీస న్యాయ సూత్రం. ఈ న్యాయ సూత్రాన్ని పాటించకపోవడం శోచనీయం. దీనిని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, ప్రాథమిక హక్కుల్లో స్పష్టం చేస్తుంది.

పోలీసుల పని కేవలం దర్యాప్తు చేయడం మాత్రమే. విచారణ దశలోనే ఒక అంశాన్ని చట్టవిరుద్ధమని ప్రకటించడానికి మీరేమైనా న్యాయమూర్తులా.

అసలు ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమా కాదా అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం 5(2), ఐటీ చట్టం, సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం జరిగిందా లేదా అన్నదానిపై ఆధారపడి ఉంటుందని మీకు తెలియదా అని అన్నారు.ఇందులో ఏదైనా ఉల్లంఘన జరిగితే అది కోర్టు విచారణ ద్వారానే తేలాలి తప్ప, పోలీసుల అధికారిక ప్రకటనల ద్వారా కాదు. సజ్జనార్ గారు విడుదల చేసిన అధికారిక ప్రకటన (ట్విట్టర్లో) లో ఇల్లీగల్ ఫోన్ ట్యాపింగ్ అనే పదాన్ని వాడటం చూస్తుంటే, దర్యాప్తు ఫలితంపై మీరు ముందే ఒక నిర్ణయానికి వచ్చారని అర్థమవుతోంది. సీనియర్ అధికారుల నుండి ఆశించే నిష్పాక్షికతకు, ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్ 1968 ప్రకారము ఇది తప్పు అని మీకు తెలియదా. మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడికి సంబంధించిన అంశంలో.. ఇలాంటి తొందరపాటు ప్రకటనలు చూస్తుంటే ఇది పక్షపాతంతో కూడిన రాజకీయ ప్రేరేపిత దర్యాప్తు అని స్పష్టం అవుతున్నదని అన్నారు.

దర్యాప్తు అనేది నిష్పాక్షికంగా ఉండటమే కాదు, ఉన్నట్లు కనిపించాలని కూడా సుప్రీంకోర్టు అనేకసార్లు చెప్పింది. సిట్ చీఫ్ విచారణకు ముందే దోషులు ఎవరో నిర్ణయిస్తే చట్టాలు ఎందుకు, కోర్టులో ఎందుకు. సిట్ చీఫ్ మీరు విడుదల చేసిన అధికారిక ట్విట్టర్ ప్రకటనలో కనీసం కేసీఆర్ ని గౌరవ ప్రతిపక్ష నాయకులు అని సంబోధించడానికి కూడా ఇష్టపడకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి? ఒక మాజీ ముఖ్యమంత్రికి, ప్రస్తుత ప్రతిపక్ష నేతకు ఇవ్వాల్సిన కనీస గౌరవం ఇవ్వకపోవడం ద్వారా మీరు ఏం చెప్పదలుచుకున్నారని అన్నారు.

## యూ పి ప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్కు ఘనంగా వీడ్కోలు పలికిన తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసిన ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ సతీష్ మహానా రేణిగుంట విమానాశ్రయం నుండి యూపీ తిరుగు పయనమయ్యారు. యూపీ స్పీకర్కు తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు.

తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి యూపీ స్పీకర్ సతీశ్ మహానా కి తుడా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి మరియు తుడా ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం లో ఘనంగా డా ఉమర్ ఆలీషా జన్మదిన వేడుకలు



హైదరాబాద్ ఫిబ్రవరి 2 శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి వారి 60వ జన్మదిన వేడుకలు హైదరాబాద్ పీఠం సభ్యులు కొంపల్లిలోని కండ్లకొయ్య గ్రామంలోని హనుమాన్ ఆలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి వారికి పీఠం సభ్యులు ఘన స్వాగతం పలికారు. తొలుత స్వామి వారికి కోలాటంతో స్వాగతం పలికి, ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతించి, పూలతో ఏర్పాటు చేసిన మార్గంలో స్వామిని సభ వద్దకు ఆహ్వానించారు. అనంతరం హనుమాన్ ఆలయ అర్చకులు సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈశ్వర లింగానికి పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి వారితో ప్రత్యేక అభిషేకం చేయించి, పూజలు నిర్వహించి వేద ఆశీర్వాదాలు అందించారు. వేదికనలంకరించిన ఉమర్ ఆలీషా స్వామి పూర్వ పీఠాధిపతుల చిత్రపటాలకు పూల మాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. తదుపరి ఏర్పాటు చేసిన జన్మదిన కేకును స్వామి కట్ చేసి సభ్యులకు పంపిణీ చేశారు. కొంపల్లి పీఠం సభ్యులు పీఠంతో ఉన్న తమ తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ జ్ఞాన చైతన్య సభకు సూర్యలత వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సప్తమ పీఠాధిపతి రచించిన గీతం పీఠం సభ్యురాలు సన్నిబోయిన వరలక్ష్మి ఆలపించి సభికులను అలరింపజేసింది. పీఠం సభ్యుడు ఎస్.చిన్నబ్బాయి మాట్లాడుతూ గురుశిష్యుల అనుబంధం గురించి సభకు తెలియజేశారు. పీఠం సభ్యుడు గుర్రాల వెంకటేష్ మాట్లాడుతూ స్వామి వారికి సేవ చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని, ప్రతి గురువారం ఆరాధన చేస్తూ ఉంటామని తెలిపారు. తాత్విక బాలవికాస్ చిన్నారి ప్రణీత్ గురుశిష్యుల ప్రేమతత్వం గురించి ముద్దు ముద్దుగా మాట్లాడిన మాటలు అందరినీ మంత్రముగ్ధులను చేశాయి. చిన్నారి వర్షిణి పాడిన పాట అద్భుతంగా ఉందని అందరూ ప్రశంసించారు. తాత్విక బాలవికాస్ చిన్నారి భక్తుడు ఎలా ఉండాలి అని చెప్పిన విషయం పెద్దలను ఆలోచింపచేసింది. చిన్నారి మోక్ష చేసిన నృత్యం ఆహుతులను ఆకట్టుకుంది. తాత్విక బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన దృశ్యరూప నాటకం చూపరులను ఆకర్షించింది. పీఠం ఆస్థాన అవధాని యర్రంశెట్టి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ జ్ఞాన తత్వం ద్వారా స్వామి ఆశీస్సులు పొందవచ్చని తెలిపారు. పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి వారి 60వ జన్మదినోత్సవం సందర్భంగా స్వామి వారి గురించి ప్రసంగించారు. పీఠం సభ్యులు ఏర్పాటు చేసిన భారీ కేక్ కట్ చేసి తాత్విక బాలవికాస్ చిన్నారులకు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం చిన్నారులకు ఎకో ఫ్రెండ్లీ పెన్నులను అందజేశారు. నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా జన్మదినం సందర్భంగా 60 సంవత్సరాల ఆయన జీవిత పయనంపై నిర్మించిన లఘుచిత్రాన్ని సభలో ప్రదర్శించారు. అనంతరం స్వామి వారికి భక్తులు పుష్ప గుచ్ఛాలను, పూల మొక్కలను, బహుమతులను అందజేశారు. భక్తులు ఉమర్ ఆలీషా స్వామి వారికి అందజేసిన సన్మాన పత్రాన్ని అవధాని యర్రంశెట్టి ఉమా మహేశ్వరరావు చదివి వినిపించారు. అనంతరం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి వారు మాట్లాడుతూ భక్తులకు స్వామి వారి యొక్క 60 సంవత్సరాల జీవిత కాలంలో జరిగిన పలు సంఘటనలు, విశేషాలు, అగాథాలను పంచుకున్నారు. స్వామి చేతుల మీదుగా హారతి ఇచ్చారు. భక్తులందరూ స్వామి వారి ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం, నాగులపల్లి, ఉప్పరగూడెం, ఇసుకపల్లి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సూర్యాపేట కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గపోరు..!

## టికెట్ రాలేదని పెట్రోల్ పోసుకొని కాంగ్రెస్ నాయకుడి ఆత్మహత్యాయత్నం



సూర్యాపేట ఫిబ్రవరి 2 ; : సూర్యాపేట జిల్లాలోని కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు భగ్గుమంటున్నది. మున్సిపల్ ఎన్నికలు సమీస్తున్న కొద్దీ ఆ పార్టీలో అసంతృప్త నేతలు తిరుగుబావుటాను ఎగరవేస్తున్నారు.తమకు టికెట్ కేటాయించకుంటే ఎలాంటి చర్యలకైనా సిద్ధమైని హెచ్చరిస్తున్నారు. తాజాగా ఓ నేత తనకు మున్సిపల్ ఎన్నిల్లో టికెట్ కేటాయించలేదనే ఆవేదనతో ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు.ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని 25వ వార్డులో కాంగ్రెస్ టికెట్ ఇవ్వలేదని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకుడు కోడి శివ యాదవ్ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడ్డాడు. గత మున్సిపల్ ఎన్నికల్లో తనకు టికెట్ ఇవ్వకుండా వేరే వాళ్లకు ఇస్తే సపోర్ట్ చేశామన్నారు. కానీ, ప్రస్తుతం తనకు ఇవ్వాల్సి ఉండగా అలా కాకుండా రమేష్ రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తికి ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

## జనగణలో కులగణన చేర్చకపోతే ఢిల్లీ గద్దె దించుతాం



హైదరాబాద్ ఫిబ్రవరి 2 ;దేశవ్యాప్తంగా కులగనన చేపడతామని హామీ ఇచ్చి మాట తప్పితే దేశ వ్యాప్తంగా అగ్గి రాజేస్థామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్ ను తక్షణమే సవరించి ఓబీసీ కాలమ్ చేర్చాలి దేశవ్యాప్తంగా సమగ్ర కులగనన పై ప్రస్తుత బడ్జెట్ పార్లమెంట్ సమావేశాల లో ప్రత్యేక చర్చ పెట్టాలి బీసీ కులగన చేయకపోతే 27 మంది ఓబీసీ కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ ప్రస్తావనలే కేంద్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను చించి నిరసన తెలిపారు.

## వనపర్తి పట్టణంలో 24 బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి అరుణను గెలిపించండి

### గట్టు యాదవ్ మున్సిపల్ మాజీ చైర్మన్

వనపర్తి జిల్లా వనపర్తి పట్టణంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గట్టు యాదవ్ ఆధ్వర్యంలో 24 వ వార్డు టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఏర్పుల అరుణ బాలయ్య గెలిపించాలని 24 వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది బాలయ్య బి.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తలు బాలరాజు వెంకటాచారి రాంబాబు



**అంబర్‌పేట్ ప్రజాబలంప్రతినిధి:**సోమవారంనాడు ఎమ్మెల్యే క్వార్టర్ లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, ఎంఎల్సీ కిప్రో.మురళి మనోహర్ , సామాజిక తెలంగాణ ఇంటలెక్చుల్ ఫోరం అధ్యక్షులు. జుతీ.దేవళ్ల సమ్మయ్య తెలంగాణ బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు మరియు డాక్టర్. కేతూరి వెంకటేష్ టిపిసిసి ఓబీసీ కన్వీనర్ తదితరులు కలిసి బీసీ సబ్ ప్లాన్ వచ్చే మార్చి బడ్జెట్ లో అమలు చేయాలి అని అదేవిధంగా బీసీ సబ్ ప్లాన్ డ్రాఫ్ట్ కాపీనీ పిసిసి చీఫ్ కు ఇవ్వడం జరిగింది.

## నవీన్ శర్మకు జ్యోతిష్ వాస్తు బ్రహ్మ అవార్డు



హైదరాబాద్ ఫిబ్రవరి 2 బండ్లగూడ నాగోల్ ఆనందనగర్ కు చెందిన శనగల నవీన్ శర్మ జ్యోతిష్ వాస్తు బ్రహ్మ అవార్డుకు ఎన్నికయ్యారు. ఈ అవార్డు ను ఆయనకు పొట్టి శ్రీ రాములు తెలుగు యూనివర్సిటీ లో ప్రదానం చేయడం జరుగుతుందని నిర్వాహకులు వెల్లడించారు మార్చ్ 15,నిర్వహించే అవార్డుల కార్యక్రమం లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

## ఉమెన్ సివిల్ రైట్స్ అనే పేరుతో మహిళల లైంగిక దోపిడి.. మహిళల అక్రమ రవాణ

### పౌర హక్కుల ప్రజా సంఘం(పీయూసీఎల్) ఆధ్యక్షురాలు జయవింధ్యాల



హైదరాబాద్ ఫిబ్రవరి 2 ;హైదరాబాద్ ఉమెన్ సివిల్ రైట్స్ అనే స్వచ్ఛంద సంస్థ ను నడిపిస్తూ మహిళల లైంగిక, దోపిడి. మహిళల అక్రమ రవాణ లాంటి అనైతిక కార్యాక్రమాలు పాల్పడుతూన్న పాతబస్తి బాబానగర్కు చెందిన నిలోఫరోగంతో తమకు ప్రాణాహాని ఉందని భాధితులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం హైదరూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పౌర హక్కుల ప్రజా సంఘం(పీయూసీఎల్) ఆధ్యక్షురాలు జయవింధ్యాల భాధితులు మహ్మద్ అమీర్ షరీఫ్, అబ్దులు వాసీమ్, ఆష్రఫ్ ఉన్నీసా, మహ్మద్ ఇబ్రహీంలతో కలిసి ఆమె మాట్లాడారు. ఉమెన్ సివిల్ రైట్స్ పేరిట సంఘం నడుపుతూ యువతులకు ఆశ చూపిస్తూ అరబ్ దేశాలతో పాటు ముంబాయ్, పూణే నగరాలకు తరలించి వ్యభాచార రాకెట్ నిర్వహిస్తున్నారని ఆమె ఆరోపించారు. ప్రస్తుతం సదరు సంస్థ బండ్లగూడ తదితర ప్రాంతాలలో మహిళ సేవా పేరిట అమాయక మహిళలను మోసం చేస్తూ రహస్యంగ చట్టవిరుద్ధ కార్యకాలపాలకు పాల్పడుతుందని తెలిపారు. అయితే ఈ విషయంపై పోలీసులతకు సమాచారం ఉన్న వారు చూసిచుడనట్లు వ్యవహరిస్తు నిలోఫర్ బేగంకు వత్తాస్తు పలుకుతున్నారని తెలిపారు. ఆమె రహస్యలు తెలిసిన భాదితులను హాత్య చేసేందుకు ఆమె కుమారులు, అనుచారులతో కుట్ర పన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమను హత్య చేసేందుకు రెక్కి చేస్తూ భాదితులను భయభ్రాంతులకు గురుచేస్తున్నరని తెలిపారు. ఈ విషయంపై స్థానిక కంచన్బాగ్ పోలీసులకు, ఇతర పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకునే పాపన పోవడంలేదని వాపోయ్యారు. మహిళ సేవ ముసుగులో పాతబస్తీలో విస్తరిస్తున్న ఉమెన్ ట్రాఫికింగ్పై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, అలగే ఉమెన్ ట్రాస్ఫోర్సు ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. నాలుగురు బాధితులకు ప్రాణాహాని ఉందని వారికి రక్షణ కల్పించాలని కోరారు. స్థానిక పోలీసు వ్యవస్థ దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణల నేపధ్యంలో ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ఇక్బాలాఖాన్, హైమాద్, బాలకిషన్రావు, మహ్మద్ కాజా తదితరులు పాల్గొన్నారు

## నెల్లూరు జిల్లా వ్యాప్తంగా డ్రోన్ నిఘా జిల్లా యస్.పి. డా. అజిత వేజెండ్ల

నెల్లూరు పట్టణ, సమీప ప్రాంతాలలో డ్రోన్ తో నిఘా పెడుతున్నారు పోలీసులు. పట్టణ సమీప ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి సారించి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అడ్డు కట్టు వేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు అదేవిధంగా సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు, ప్రత్యేకంగా టౌన్ పరిసర ప్రాంతాల్లో రాత్రి 7 గంటల నుండి 9 గంటల వరకు విస్తృతంగా డ్రోన్ నిఘా ఏర్పాటు చేసారు.

నెల్లూరు జిల్లాలోని శివారు ప్రాంతాలలో నేరాలకు చెక్ పెడుతూ, జల్లెడ పడుతున్నారు. ఓవర్ స్పీడ్, సెల్ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్లను గుర్తిస్తాం. నేర నియంత్రణే లక్ష్యంగా క్రైమ్ ప్రోన్ ఏరియాల పై డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా. క్రైమ్ ప్రోన్ ఏరియాలపై డ్రోన్ కెమెరాలను ఉపయోగించి నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఎస్పీ అనిత వేజేండ్ల వెల్లడించారు.

# ఉగాదికి జాబ్ క్యాలెండర్

విజయవాడ, ఫిబ్రవరి 2, ఈ ఏడాది మార్చి?ఏప్రిల్ మధ్య జరిగే తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేకంగా వినియోగించుకోనుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఉగాది రోజున ఒక కీలక ప్రకటన చేయడానికి సిద్ధమవుతున్నారన్న ప్రచారం ఆసక్తి రేపుతోంది. గతంలో కూడా పెద్ద నిర్ణయాలు, అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో ముందుగానే ప్రజలకు సంకేతాలు ఇచ్చిన లోకేశ్, ఈసారి కూడా అదే తరహా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరుద్యోగ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తోంది. ఈ క్రమంలోనే పెట్టుబడులను ఆకర్షించేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు దాదాపు 23 లక్షల కోట్ల రూపాయల విలువైన పెట్టుబడి ఒప్పందాలు కుదిరినట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఒప్పందాలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.ఇదే సమయంలో ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీ ఉద్యోగాలపై కూడా సమీక్ష జరిపినట్టు తెలుస్తోంది. పోలీస్, రెవెన్యూ సహా వివిధ విభాగాల్లో కలిపి 23 వేలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఏయే శాఖల్లో ఎంతమంది అవసరమో వివరాలతో కూడిన జాబితాను అధికారులు సిద్ధం చేసినట్టు సమాచారం. అంతేకాదు, ఈ ఏడాది రిటైర్ కానున్న ఉద్యోగుల వివరాలను కూడా ముందుగానే పరిశీలించి, ఆ స్థానాలు ఖాళీ కాకముందే భర్తీ చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉందని చెబుతున్నారు.ఈ మొత్తం ప్రక్రియకు సంబంధించి ఉగాది నాటికి ఒక సమగ్ర జాబ్ క్యాలెండర్ విడుదల చేసే యోచనలో మంత్రి నారా లోకేశ్ ఉన్నారని సమాచారం. ఒకేసారి పోలీస్, గ్రూప్ పరీక్షలు, ఇతర శాఖల ఉద్యోగాలకు సంబంధించిన స్పష్టమైన టైమ్‌లైన్‌ను ప్రకటించే అవకాశముందని అంటున్నారు. ఉగాది రోజున ఈ ప్రకటనను గ్రాండ్‌గా చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.గతంలో వైసీపీ ప్రభుత్వం కూడా జాబ్ క్యాలెండర్ పేరిట ప్రకటనలు చేసినా, అవి పూర్తిస్థాయిలో అమలుకాలేదన్న విమర్శలు ఉన్నాయి. 2023లో ఒకసారి మాత్రమే క్యాలెండర్ ప్రకటించి, ఆ తర్వాత ప్రక్రియ నిలిచిపోయిందని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. 2024లో అయితే ఆ అంశం పూర్తిగా తెరమరుగైన పరిస్థితి కనిపించింది.అయితే కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే డీఎస్సీ ద్వారా సుమారు 16 వేల మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చింది. తాజాగా గ్రూప్?1, గ్రూప్?2 నియామక ప్రక్రియను కూడా ముందుకు తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో ఉగాది రోజున రానున్న ప్రకటన నిరుద్యోగ యువతకు పెద్ద ఊరటనిస్తుందన్న అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పుడు అందరి దృష్టి ? ఉగాది రోజున మంత్రి నారా లోకేశ్ చేసే ఆ కీలక ప్రకటన ఏ రూపంలో ఉంటుందన్నదానిపైనే ఉంది.

# టీటీడీ ఈవో అనిల్ సింఘాల్ బదిలీ, నెక్స్ట్ ఏంటీ?

తిరుమల, ఫిబ్రవరి 2, తిరుమల లడ్డూ కల్తీ అంశంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏపీ ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్‌ను బదిలీ చేసింది. ఆయన స్థానంలో ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యాలయం ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ముద్దాడ రవిచంద్రకు టీటీడీ ఈవోగా అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అనిల్ కుమార్ సింఘాల్‌ను సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వులలో ఆదేశించారు.అనిల్ కుమార్ సింఘాల్ 1993 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. గతంలోనూ ఆయన టీటీడీ ఈవోగా సుదీర్ఘ కాలం పనిచేశారు. 2017 మే 6 నుండి 2020 అక్టోబర్ 4 వరకు మొదటి విడతలో టీడీపీ, వైసీపీ హయాంలో టీటీడీ ఈవోగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్ర సర్వీసులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఆయనను రెండోసారి టీటీడీ ఈవోగా నియమించడంతో గత ఏడాది సెప్టెంబర్‌లో అనిల్ సింఘాల్ మళ్లీ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో టీటీడీ పాలనలో కొత్త మార్పులు చోటుచేసుకోనున్నాయి. గతంలో ఆయన టీటీడీ ఈవోగా చేయడం, ఆ సమయంలో లడ్డూ కల్తీ ఆరోపణలతో అనిల్ సింఘాల్‌ను బదిలీ చేసి జీఏడీలో రిపోర్ట్ చేయాలని సూచించారు.తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడిన నెయ్యి కల్తీపై ప్రత్యేక విచారణ బృందం ఇటీవల తన తుది నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఈ నివేదికతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి నిప్పు రాజుకుంది.సిట్ తన ఛార్జ్ షీట్‌లో తిరుమలకు నెయ్యి సరఫరాలో భారీ అవకతవకలు జరిగినట్లు పేర్కొంది. సుమారు 68 లక్షల కిలోల కల్తీ నెయ్యిని సరఫరా చేయడం ద్వారా రూ. 250 కోట్ల కుంభకోణం జరిగిందని వెల్లడించింది. ఉత్తరాఖండ్‌కు చెందిన భోలే బాబా డెయిరీతో పాటు ఇతర కంపెనీలు నకిలీ సీల్స్, తప్పుడు ల్యాబ్ రిపోర్టులతో టీటీడీని మోసం చేసినట్లు గుర్తించింది. అయితే, తాజా నివేదికలో జంతువుల కొవ్వు ఆనవాళ్లు లేవని పేర్కొంది. కానీ పామాయిల్, కెమికల్ ఎస్టర్స్ వంటి ఇతర పదార్థాలతో నెయ్యిని కల్తీ చేసినట్లు పేర్కొన్నట్లు వార్తలు రావడంతో చర్చ మొదలైంది.గత వైసీపీ ప్రభుత్వం కావాలనే నిబంధనలు సడలించి, తమకు అనుకూలమైన డెయిరీలకు కాంట్రాక్టులు ఇచ్చిందని టీడీపీ విమర్శిస్తోంది. నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందన్న ఎన్డీడీబీ నివేదికను గుర్తు చేస్తూ, సిట్ నివేదిక కల్తీని ధృవీకరించిందని, ఇది ముమ్మాటికీ భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు.

సిట్ నివేదికలో జంతు కొవ్వు లేదని తేలడంతో వైసీపీ ఎదురుదాడి ప్రారంభించింది. సీఎం చంద్రబాబు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే దేవుడిని వాడుకున్నారని, అబద్ధపు ప్రచారంతో భక్తులను అయోమయానికి గురిచేశారని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మండిపడ్డారు. క్లీన్ చిట్ లభించిందని వైసీపీ నేతలు వాదిస్తుంటే, కల్తీ జరిగిందని సిట్ స్పష్టంగా చెప్పిందని టీడీపీ సహా కూటమి నేతలు కౌంటర్ ఇస్తున్నారు. ఈ పరస్పర ఆరోపణల నేపథ్యంలో, అసలు దోషులు ఎవరో తేల్చి కఠిన శిక్ష వేయాలని భక్తులు కోరుకుంటున్నారు.

# ముద్రగడ దారెటు..



కాకినాడ, ఫిబ్రవరి 2, కాపు నాయకుడు అనగానే ముందుగా గుర్తుకు వచ్చే పేరు ముద్రగడ పద్మనాభం. కాపు సామాజిక వర్గం నుంచి ఎంతోమంది రాజకీయంగా ఎదిగినా, రిజర్వేషన్ ఉద్యమం ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నేతగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. అయితే ఆయన రాజకీయ ప్రస్థానం ఎప్పుడూ ఒకే దిశలో సాగలేదనే విమర్శలు కూడా ఉన్నాయి. ఉద్యమ నాయకుడిగా ప్రజల్లో ఆదరణ పొందినప్పటికీ, కొన్ని సందర్భాల్లో అదే సామాజిక వర్గానికి వ్యతిరేకంగా ఆయన వైఖరి కనిపించిందని రాజకీయ విశ్లేషకులు అంటారు.ఇటీవల జరిగిన 2024 ఎన్నికల్లో ఆయన ఇచ్చిన పిలుపును కాపు వర్గం పెద్దగా పట్టించుకోలేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. ముఖ్యంగా జనసేన పార్టీ పై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పవన్ కళ్యాణ్ ఓటమి కోసం ప్రయత్నించినా, ఆ ప్రయత్నాలు ఫలితాన్ని ఇవ్వలేకపోయాయి. ఎన్నికల ఫలితాల అనంతరం జగన్మోహన్ రెడ్డిను ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పోరాడతానని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. అయితే ఆ సమయంలోనే ఆయన అనారోగ్యానికి గురికావడంతో రాజకీయంగా చురుగ్గా ముందుకు సాగలేకపోయారు.ముద్రగడ రాజకీయ జీవితం ప్రారంభ దశలో ఎంపీగా, మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కానీ ఆ తర్వాత ఎమ్మెల్యేగా ఓడిపోవడం ఆయనను తీవ్రంగా కలచివేసిందని చెబుతారు. ఆ ఓటమి తరువాత తీసుకున్న కొన్ని నిర్ణయాలు రాజకీయంగా సరైనవి కాదన్న అభిప్రాయం ఉంది. ప్రస్తుతం వయసు పెరిగిపోవడం, ఆరోగ్య సమస్యలు ఉండటంతో తన కుమారుడికి రాజకీయ భవిష్యత్తు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నారని సమాచారం.ఎన్నికలకు ముందు ఆయన జనసేనలో చేరతారని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. గౌరవం ఇస్తే పార్టీలో చేరేందుకు సిద్ధమని ఆయన సంకేతాలు పంపినట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. మొదట పవన్ సానుకూలంగా స్పందించినా, ఆ తర్వాత పరిస్థితులు మారడంతో ముద్రగడ మనస్తాపానికి గురయ్యారని అంటారు. అదే సమయంలో ఆయన తాడేపల్లి వెళ్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అక్కడ ఆయనకు గౌరవం లభించినప్పటికీ, పార్టీ భవిష్యత్తుపై అనేక అనుమానాలు నెలకొన్నాయి.ప్రస్తుతం గోదావరి జిల్లాల్లో పవన్ ప్రభావం కొనసాగుతుండటం, వైసీపీ బలహీనంగా కనిపించడంతో 2029 ఎన్నికల్లో ఆ పార్టీకి అవకాశాలు తక్కువేనన్న చర్చ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ముద్రగడ ఆలోచన మారుతున్నట్టు రాజకీయ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఇటీవల టీడీపీకి చెందిన సీనియర్ నేత నిమ్మకాయల చినరాజప్ప తో ఆయన భేటీ కావడం మరింత ఆసక్తిని రేపింది. ఈ భేటీ మర్యాదపూర్వకమేనని చెప్పినా, దీని వెనుక రాజకీయ వ్యూహం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కుమారుడి రాజకీయ భవిష్యత్తు దృష్ట్యా ముద్రగడ కూటమి పార్టీల వైపు చూస్తున్నారన్న ప్రచారం బలపడుతోంది. గతంలో తీసుకున్న నిర్ణయాల వల్ల ఎదురైన నష్టాన్ని సరిదిద్దుకునే ప్రయత్నంగా దీనిని కొందరు భావిస్తున్నారు. అయితే ఈ ప్రచారంలో నిజం ఎంతుందో, ఆయన తదుపరి అడుగు ఏమిటో కాలమే నిర్ణయించాల్సి ఉంది.

## కర్మాన్ఘాట్ ఆలయ భూముల్లో కలకలం

రంగారెడ్డి కర్మాన్ ఘాట్ ఆలయ భూముల్లో కూల్చివేతలు కలకలం రేపాయి. తెల్లవారు జామున 4 గంటలకు ఇండ్ల కూల్చివేతకు ఆలయ అధికారులు రంగం సిద్ధం చేసారు. హైకోర్టులో కేసు ఉండగానే కూల్చివేతలకు అధికార యంత్రాంగం సిద్ధమయింది. ఎండోమెంట్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై బాధితులు ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించారు. 20 ఏళ్లకు పైగా నివాసం ఉంటున్న 20 కుటుంబాలను ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని వారి ఆరోపణ. అ వీ ్ప ల ం చేసుకునేందుకు 90 రోజులున్నా అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కోర్టులో విచారణ పెండింగ్లో ఉండగానే ఇళ్లు కూల్చివేస్తామంటూ రావడంపై బాధితుల ఆవేదన. అధికారులు దౌర్జన్యానికి దిగుతున్నారని స్థానికులు ఆందోళనకు దిగారు.

# క్లీన్ చిట్టా... పాప పరిహారం

తిరుమల, ఫిబ్రవరి 2, తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మళ్లీ చిచ్చు రేపింది. సీబీఐ పర్యవేక్షణలోని సిట్ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను ఇరు పక్షాలు తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తుండటంతో, అసలు నిజం ఏంటనేది ఇప్పుడు సామాన్య భక్తులలో సరికొత్త చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా వైసీపీ చేస్తున్న క్లీన్ చిట్ ప్రచారానికి, సిట్ ఛార్జిషీట్‌లో ఉన్న కెమికల్ నెయ్యి వాస్తవాలకు మధ్య రాజకీయ ప్రచారం తెరలా మారిపోతోంది. సిట్ నివేదికలో నెయ్యిలో జంతువుల కొవ్వు లేదా చేప నూనె ఆనవాళ్లు ఉన్నట్లు నిర్ధారణ కాలేదని వైసీపీ గట్టిగా ప్రచారం చేస్తోంది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసమే ఈ అపవాదు వేసిందని, ఇప్పుడు సిట్ నివేదికతో తాము సుద్ధపూసలమని నిరూపితమైందని ఆ పార్టీ నేతలు వాదిస్తున్నారు. ప్రజల మనోభావాలతో ఆడుకున్నందుకు కూటమి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కేవలం జంతు కొవ్వు అంశాన్ని మాత్రమే హైలైట్ చేస్తూ, ఇతర అంశాలను పక్కదారి పట్టించే వ్యూహాన్ని వైసీపీ అనుసరిస్తోంది.అయితే, సిట్ ఛార్జిషీట్ లోని లోతైన అంశాలను గమనిస్తే భయంకరమైన వాస్తవాలు బయటపడుతున్నాయి. సిట్ నివేదిక ప్రకారం.. సరఫరా అయిన నెయ్యిలో జంతు కొవ్వు లేకపోవచ్చు కానీ, అది అసలు నెయ్యే కాదు. అది కేవలం ప్రమాదకరమైన కెమికల్స్ , వెజిటబుల్ ఆయిల్స్ తో తయారైన మిశ్రమమని సిట్ తేల్చింది. అంటే, ఐదేళ్ల పాటు లక్షల లీటర్ల కెమికల్ నెయ్యి ని భక్తులకు ప్రసాదం రూపంలో పంచారనేది సిట్ ప్రధాన అభియోగం. జంతు కొవ్వు లేదని సంబరపడుతున్న వైసీపీ, ఈ కెమికల్ కల్తీ పై ఎందుకు మాట్లాడటం లేదని టీడీపీ ప్రశ్నిస్తోంది.వైసీపీ ఇంతలా ఎదురుదాడి చేస్తున్నా, కూటమి ప్రభుత్వం నుండి ఇంకా గట్టి కౌంటర్ మొదలవ్వలేదు. దీనికి ప్రధాన కారణం, సిట్ నివేదికపై కోర్టుల స్పందన కోసం ప్రభుత్వం వేచి చూస్తుండటమే కావచ్చు. సీబీఐ నేతృత్వంలోని సిట్ ఇచ్చిన ఈ ఛార్జిషీట్ కోర్టులో విచారణకు వచ్చినప్పుడు, వైసీపీ చేసిన తప్పులు నిబంధనల ఉల్లంఘన, అనర్హులైన వారికి టెండర్లు ఎలా నిరూపితమవుతాయనే దానిపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాజకీయం కంటే న్యాయపరంగా వైసీపీని ఇరికించాలని కూటమి భావిస్తున్నట్లు కనిపిస్తోంది. త్వరలోనే ఈ సీబీఐ-సిట్ రిపోర్టుపై న్యాయస్థానాలు స్పందించనున్నాయి. కల్తీ నెయ్యి సరఫరా చేసిన బోలే బాబా డైరీ ,ఇతర సంస్థల వెనుక ఉన్న పెద్ద తలకాయల పాత్రపై కోర్టు ప్రశ్నలు కురిపించే అవకాశం ఉంది. జంతు కొవ్వు లేదన్న ఒక్క పాయింట్ మీద వైసీపీ గెలిచినట్లు కనిపిస్తున్నా, విషపూరితమైన కెమికల్ నెయ్యి సరఫరా జరిగిందని కోర్టు గనుక సీరియస్ అయితే, ఆ పార్టీకి అది కోలుకోలేని దెబ్బ అవుతుంది.సామాన్య భక్తుడికి కావలసింది జంతు కొవ్వు ఉందా లేక కెమికల్స్ ఉన్నాయా అన్నది కాదు.. తమ ఆరాధ్య దైవం ప్రసాదంలో కల్తీ జరిగిందా లేదా అన్నదే ముఖ్యం. సిట్ నివేదిక కల్తీ జరిగిందని స్పష్టంగా చెబుతోంది. ఒకవేళ కేవలం కెమికల్స్ మాత్రమే ఉన్నా, అది కూడా అపచారమే అన్నది భక్తుల విశ్వాసం. కాబట్టి వైసీపీ చేస్తున్న క్లీన్ చిట్ ప్రచారం కేవలం రాజకీయ రంగు పూయడమేనని, కోర్టుల తీర్పు తర్వాత అసలు దోషులు ఎవరో బహిర్గతమవుతాయని టీడీపీ నేతలు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

సిట్ రాడార్‌లో ముగ్గురు

కల్తీ నెయ్యి కేసులో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన అనంతరం ప్రభుత్వానికి సిట్ 14 పేజీల లేఖ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ లేఖలోని చివరి పేరాలో ఉన్న అంశాలు కీలకంగా మారాయి. తిరుమలలో నెయ్యి సరఫరాకు సంబంధించిన అప్పట్లో కీలక బాధ్యతల్లో ఉన్న ముగ్గురు ఉన్నతాధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిట్ స్పష్టంగా చెప్పినట్టు తెలుస్తోంది. ఇందులో అప్పటి , నేటి ఈవో అనిల్ సింఘాల్, అప్పటి అదనపు ఈవో ధర్మారెడ్డి, ఫైనాన్సియల్ అడ్వైజర్ అండ్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ బాలాజిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పింది. ఈ సిఫార్సుల మేరకు ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను బదిలీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు కొన్ని గంటల్లోనే వచ్చే అవకాశం ఉంది. సిట్ తన నివేదికలో అధికారుల తీరుపై తీవ్రమైన విమర్శలు గుప్పించిందని అంటున్నారు. శ్రీవారి ప్రసాదానికి వాడే నెయ్యి సరఫరాలో ఉండాల్సిన కఠినమైన నాణ్యతా ప్రమాణాలను బలహీన పరిచేలా ఈ అధికారులు వ్యవహరించారని సిట్ గుర్తించిందట. ముఖ్యంగా నెయ్యి సేకరణకు సంబంధించిన నిబంధనల తయారీలో కనీసం మనసు పెట్టలేదని ఆరోపించిందని సమాచారం. అత్యంత నిర్లక్ష్యంగా పని చేశారని నివేదికలో పేర్కొందని తెలుస్తోంది. ఈ పద్ధతుల వల్ల నెయ్యి నాణ్యతలో పెద్ద ఎత్తున రాజీ జరిగిందనే ఆరోపణ చేరిందంటున్నారు. ఒకప్పుడు తిరుమల నెయ్యి టెండర్లు అంటే అత్యంత కఠినమైన నిబంధనలకు మారుపేరుగా ఉండేదని, కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిబంధనల స్వరూపం మారిపోయిందని నివేదికలో వెల్లడించినట్టు సమాచారం. యథేచ్ఛగా నిబంధనలు సడలించడంతో కల్తీకి ఆస్కారం ఏర్పడిందని అంటున్నారు. టెండర్లలో పాల్గొనే డెయిరీలు స్వయంగా పాలు సేకరించాల్సిన అవసరం లేదని రూల్ తీసుకొచ్చారు. వెన్న సేకరణ, నెయ్యి ఉత్పత్తి సామర్థ్యంతో సంబంధం లేకుండా టెండర్లు అనుతిచ్చారు. కనీసం మూడేళ్ల పాటు కార్యకలాపాలు నిర్వహించాలనే రూల్ పక్కన పెట్టారు. టెండర్ దక్కించుకోవడానికి ఉండాల్సిన కనీస టర్నోవర్ మొత్తాన్ని 250 కోట్ల నుంచి 150 కోట్లకు తగ్గించేశారు. ఇలాంటి సడలింపుల ద్వారానే నెయ్యి కల్తీకి ఆస్కారం ఏర్పడిందని సిట్ వెల్లడించినట్టు వార్తలు వస్తున్నాయి. ఓవైపు దీనిపై రాజకీయ దుమారం రేగుతున్న టైంలోనే సిట్ సిఫార్సుల మేరకు చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. సిట్ నివేదిక అందుకున్న సుప్రీంకోర్టు ఇంకా ఎలాంటి ఆదేశాలు ఇస్తుందో అన్న సస్పెన్స్ కూడా కొనసాగుతోంది.

# అరవ శ్రీధర్ కు నిద్ర లేని రాత్రులు..

కడప, ఫిబ్రవరి 2, జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ విషయంలో బాధితులు ఎంత వరకైనా వెళ్లేందుకు సిద్ధమైనట్టు కనిపిస్తోంది. రోజుకొక వీడియోతో ఆయనకు నిద్ర లేకుండా చేస్తోంది. ఓవైపు అధికారికంగా విచారణ సాగుతున్న టైంలోనే ఇలా ఒక్కో వీడియోతో సంచలనం రేపుతోంది. ఆమె డీఫ్‌ఫేక్ వీడియోలతో అసత్య ఆరోపణలు చేస్తుందని ఎమ్మెల్యే వర్గం కవర్ చేస్తుంటే ఆమె మాత్రం తన వద్ద చాలా ఆధారాలు ఉన్నాయని చెబుతోంది. అందుకు తగ్గట్టుగానే వీడియోలు రిలీజ్ చేస్తోంది. తాజాగా అసెంబ్లీ నుంచి బాధితురాలికి వీడియో కాల్ చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీడియో వదిలారు బాధితురాలు. తాజాగా బయటపడిన వీడియో వివరాల ప్రకారం అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగానే అరవ శ్రీధర్ బాధితురాలితో వీడియో చాటింగ్ చేస్తున్నట్టు ఉంది. సభలో ప్రజా సమస్యలు లేవన్నట్టు అసెంబ్లీ ప్రాంగణం నుంచే మహిళకు వీడియో కాల్ చేసి అసభ్యకరమైన రీతిలో మాట్లాడటంపై వైసీపీతోపాటు నార్మల్ నెటిజన్లు ఆన్‌లైన్‌లో విమర్శలు చేస్తున్నారు. అసెంబ్లీ గౌరవ మర్యాదలు కాలరాస్తున్నారని మండిపడుతున్నారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యేగా ఉన్న అరవ శ్రీధర్ తనను రేప్ చేసి ఐదు సార్లు అబార్షన్ అయ్యేలా చేశారని బాధితురాలు నాలుగు రోజుల క్రితం మీడియా ముందుకు వచ్చారు. తన అధికారాన్ని అడ్డంపెట్టుకొని తనను వేధింపులకు దిగారని ఆరోపించారు. దీనిపై పార్టీ పెద్దలకు, ప్రభుత్వ పెద్దలకు చెప్పినా ప్రయోజనం లేకుండా పోయిందని అందుకే మీడియా ముందుకు రావాల్సి వచ్చిందన్నారు. మీడియాతో మాట్లాడిన ఆమె తన వద్ద చాలా ఆధారాలు ఉన్నాయని చెప్పారు. తాను డబ్బుల కోసమే, లేకుండా ఎమ్మెల్యేను పెళ్లి చేసుకోవాలని ఉద్దేశంతో ఇదంతా చేయలేదని, తనకు న్యాయం జరగాలని ఆయనకు శిక్ష పడాలని డిమాండ్ చేశారు. తాను పాతిక కోట్లు డిమాండ్ చేసిందని అబద్దమని చెప్పారు. తన వెనుక వైసీపీ ఉందనే ప్రచారాన్ని కూడా బాధితురాలు ఖండించారు. ఈ ఆరోపణలు వచ్చినప్పటి నుంచి శ్రీధర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. తన తప్పు లేదని తనను బ్లాక్ మెయిల్ చేయడానికి సదరు మహిళ డీప్‌ఫేక్ వీడియోలతో పరువు తీస్తున్నారని ఆరోపించారు. కచ్చితంగా మహిళ అసలు రూపం తెలుస్తుందని అన్నారు. ఇంతలో జనసేన పార్టీ కూడా ఈ వివాదంపై స్పందించి విచారణకు కమిటీ వేసింది. వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. విచారణ పూర్తి అయ్యే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యేకు సూచించారు. అయితే ఈ వివాదం మొదలైనప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటమే కాకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది

రంగంలోకి హ్యూమన్ రైట్స్ కమిషన్

వివాదం దుమారం రేపడంతో జనసేన పార్టీ అంతర్గత విచారణకు ఆదేశించింది. పార్టీ ఏర్పాటు చేసిన విచారణ కమిటీ ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించిందని సమాచారం. ఇప్పటివరకు బయటకు వచ్చిన వీడియోలు, అందులో కనిపిస్తున్న అంశాలు, వాటి నిజానిజాలపై కమిటీ సమగ్రంగా పరిశీలన జరుపుతోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రక్రియలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో పాటు ఆరోపణలు చేసిన వీణను కూడా కమిటీ ప్రత్యక్షంగా కలసి వివరాలు తెలుసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.ఈ దర్యాప్తులో భాగంగా ఫిబ్రవరి తొలి వారంలో జనసేన అంతర్గత విచారణ కమిటీ రైల్వే కోడూరు ప్రాంతంలో పర్యటించనుందని సమాచారం. అక్కడ స్థానిక స్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసి, సంబంధిత వ్యక్తులతో మాట్లాడి ఒక నివేదిక సిద్ధం చేయనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆ నివేదిక ఆధారంగా పార్టీ క్రమశిక్షణ చర్యలు ఏవైనా ఉంటే తీసుకుంటామని స్పష్టంగా తెలియజేశారు. ఈ అంశంపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే సమాచారం సేకరించారని, పూర్తి నివేదిక వచ్చిన తర్వాతే తదుపరి నిర్ణయాలు ఉంటాయని అంటున్నారు.ఇదిలా ఉండగా, ఈ వ్యవహారం మరో కీలక దశకు చేరింది. వీణ తాజాగా నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ను ఆశ్రయించారు. తనపై లైంగిక దాడి జరిగిందని, పెళ్లి హామీతో మోసం చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం.

ఈ ఫిర్యాదును ఆమె తరపున న్యాయవాది ఆజాద్ దాఖలు చేశారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఈ ఫిర్యాదును స్వీకరించి విచారణకు అంగీకరించడంతో ఈ కేసు జాతీయ స్థాయిలోనూ దృష్టిని ఆకర్షిస్తోంది.అదే సమయంలో రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ కూడా స్పందించారు. ఆమె వీణతో ఫోన్‌లో మాట్లాడి ప్రాథమిక సమాచారం సేకరించినట్లు తెలిపారు. ఈ ఘటనలో నిజాలు వెలికి తీసి బాధితురాలికి న్యాయం చేయడానికి కమిషన్ అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. ఈ పరిణామాలన్నింటితో ఈ వ్యవహారం కేవలం రాజకీయ అంశంగా కాకుండా, చట్టపరమైన,మానవ హక్కుల కోణంలోనూ కీలకంగా మారింది. అంతర్గత పార్టీ విచారణ, జాతీయ మానవ హక్కుల కమిషన్ చర్యలు, మహిళా కమిషన్ స్పందన నేపథ్యంలో ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్నది రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిగా మారింది.

## భారీగా తగ్గిన స్పామ్ కాల్స్

ముంబై, ఫిబ్రవరి 2, (న్యూస్ పల్స్) సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'సంచార్ సాథీ' పోర్టల్, యాప్ అద్భుత ఫలితాలను ఇస్తోంది. ఈ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న సుమారు 1.52 కోట్ల మొబైల్ నంబర్లను బ్లాక్ చేసినట్లు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు. వినియోగదారుల భద్రతే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంచార్ సాథీ యాప్ పనితీరును వివరిస్తూ.. గతంలో విదేశాల నుండి వచ్చే నకిలీ కాల్స్ సంఖ్య 1.35 కోట్లుగా ఉండేదని, ఇప్పుడు అవి 95 శాతం మేర తగ్గాయని మంత్రి తెలిపారు. అంతే కాకుండా మోసపూరిత సిమ్ కార్డులతో లింక్ అయిన దాదాపు 27 లక్షల వాట్సాప్ ఖాతాలను కూడా నిలిపివేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు 2 కోట్ల మందికి పైగా వినియోగదారులు సంచార్ సాథీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు.ఈ యాప్ ద్వారా ప్రభుత్వం ప్రజల వ్యక్తిగత వివరాలపై నిఘా పెడుతుందన్న ఆరోపణలను మంత్రి ఖండించారు. ఇందులో ఎలాంటి నిఘా ఉండదని, కేవలం సైబర్ మోసాలను అడ్డుకోవడానికే దీన్ని రూపొందించామని స్పష్టం చేశారు. డిజిటల్ భద్రతలో ఇది ఒక బలమైన ఆయుధంగా మారుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.

# విశాఖలో గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్టు

విశాఖపట్టణం, ఫిబ్రవరి 2, విశాఖపట్నం ఒకప్పుడు ప్రశాంతతకు చిరునామాగా నిలిచేది. సముద్రతీర గాలితో, పచ్చని కొండలతో ఆహ్లాదకరమైన వాతావరణం కలిగిన ఈ నగరం 'సిటీ ఆఫ్ డెస్టినీ'గా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అయితే కాలక్రమేణా అభివృద్ధి వేగం పెరిగిన కొద్దీ, దానికి అనుసంధానంగా కాలుష్యం కూడా విస్తరించింది. అభివృద్ధి అవసరమే అయినప్పటికీ, అదే ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతుండటంపై మేధావులు, పర్యావరణవేత్తలు, ప్రజా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పర్యావరణ శాఖ మంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ విశాఖ పర్యటన సందర్భంగా కాలుష్య సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కాలుష్య నియంత్రణ విషయంలో ఇక సీరియస్ చర్యలు తప్పవని అధికారులకు ఆయన స్పష్టంగా సూచించారు. చట్టాలు కాగితాలకే పరిమితం కాకుండా, కఠినంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ యంత్రాంగం, పరిశ్రమలు, ప్రజలు అందరూ కలిసి పనిచేస్తేనే కాలుష్యాన్ని నియంత్రించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో అభివృద్ధి పెరిగినంత వేగంగా కాలుష్యం కూడా పెరిగిపోయిందని పవన్ కళ్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రసాయన పరిశ్రమల వల్ల చుట్టుపక్కల గ్రామాల్లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు క్యాన్సర్ బారిన పడుతున్న పరిస్థితి ఉందని, పిల్లల్లో చర్మ వ్యాధులు, మహిళల్లో గర్భస్రావాలు, పెద్దల్లో ఊపిరితిత్తుల సంబంధిత రోగాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఇది అభివృద్ధి పేరుతో ప్రజల జీవితాలతో చెలగాటమాడటమేనని ఆయన వ్యాఖ్యానించారు. విశాఖ పోర్టు పరిసర ప్రాంతాల్లో బొగ్గు ధూళి వల్ల కాలుష్యం అధికమవుతోందని, దాని ప్రభావం ప్రజల ఆరోగ్యంపై తీవ్రంగా పడుతోందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. పరిశ్రమలు రావడాన్ని ప్రభుత్వం వ్యతిరేకించడం లేదని, కానీ అవి నిబంధనలు పాటిస్తూ, కాలుష్యాన్ని తగ్గించే బాధ్యత తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా పరిశ్రమల్లో తప్పనిసరిగా అమలు చేయాల్సిన 33 శాతం గ్రీన్ బెల్ట్ నిబంధనను కచ్చితంగా పాటించాలన్నారు. పర్యావరణ అధికారులు కూడా మొక్కుబడి చర్యలకే పరిమితం కాకుండా, జీవ వైవిధ్యాన్ని కాపాడే విధంగా పని చేయాలని పవన్ సూచించారు.

ఇదే సందర్భంలో ఆయన 'గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తొమ్మిది కోస్తా జిల్లాల పరిధిలో సుమారు 970 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని అయిదు కిలోమీటర్ల వెడల్పుతో, మూడు బఫర్ జోన్లుగా అభివృద్ధి చేసి, పచ్చని మొక్కల గోడ నిర్మించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని వివరించారు. ఈ ప్రణాళికలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ గ్రీన్ వాల్ తీర ప్రాంతాన్ని రక్షించడమే కాకుండా, కాలుష్యానికి దీర్ఘకాలిక పరిష్కారంగా నిలుస్తుందని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు.

# మళ్లీ బూతుల సంస్కృతి

గుంటూరు, ఫిబ్రవరి 2, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, ముఖ్యంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలు, తదనంతర పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. రాజకీయాల్లో విమర్శలు సహజం, కానీ ఆ విమర్శలు స్థాయి దాటినప్పుడు అవి పార్టీల మనుగడకే ప్రమాదకరంగా మారుతాయి. ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రం ప్రస్తుతం విమర్శలు, ప్రతివిమర్శలతో కాక, వ్యక్తిగత దూషణలు, అభ్యంతరకర భాషతో కలుషితమవుతోంది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబుపై అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు నాగరిక సమాజం తలదించుకునేలా ఉన్నాయి. ఒక సీనియర్ నేతగా, మాజీ మంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో పనిచేసిన వ్యక్తి, ఇలాంటి భాషను వాడటం కేవలం వ్యక్తిగతం కాదు, అది ఆ పార్టీ సంస్కృతినే ప్రతిబింబిస్తోంది. రాజకీయ పార్టీలకు అధికారం ముఖ్యం కావచ్చు, కానీ నైతికత అంతకంటే ముఖ్యం. గతంలో ఐటీడీపీకి చెందిన ఒక కార్యకర్త వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు, టీడీపీ వెంటనే స్పందించింది. అతడిని పార్టీ నుండి సస్పెండ్ చేయడమే కాకుండా, చట్టపరమైన చర్యలకు సహకరించింది. ఇది ఒక పార్టీకి ఉండాల్సిన బాధ్యతాయుతమైన వైఖరి. కానీ వైసీపీ విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంది. అంబటి రాంబాబు వ్యాఖ్యలను ఖండించాల్సింది పోయి, పార్టీ శ్రేణులు ఆయన్ను సమర్థిస్తున్నాయి. దీనికి తోడు కులం కార్డును తెరపైకి తెచ్చి, అంబటిపై దాడిని కాపు సామాజికవర్గంపై దాడిలా చిత్రీకరించే ప్రయత్నం చేయడం రాజకీయ దిగజారుడుతనానికి పరాకాష్టగానే చూడాలి. తప్పు చేసినప్పుడు వ్యక్తిని తప్పు పట్టాలి తప్ప, దానికి కులాన్ని అంటగట్టడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలని చూడటం పార్టీకి దీర్ఘకాలంలో నష్టమే చేకూరుస్తుంది. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నేత పట్టాభి చేసిన వ్యాఖ్యలను సాకుగా చూపి, టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడులు చేశారు. నాడు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ మోహన్ రెడ్డి ఆ దాడులను సమర్థిస్తూ, "అధినేతను తిడితే కేడర్‌కు బీపీ రావడం సహజం" అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు అదే సూత్రాన్ని టీడీపీ కేడర్‌కు వర్తింపజేస్తే వైసీపీ ఎందుకు గగ్గోలు పెడుతోంది? వైసీపీ కేడర్ దాడి చేస్తే అది 'ఆవేశం'. టీడీపీ కేడర్ నిరసన వ్యక్తం చేస్తే అది 'హత్యాయత్నమా?'. ఇలాంటి ద్వంద్వ ప్రమాణాలు ప్రజల్లో ఆ పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిని దూషించినప్పుడు వచ్చే స్పందన కూడా అంతే తీవ్రంగా ఉంటుందని వైసీపీ గ్రహించలేకపోతోంది. 2024 ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు కోలుకోలేని దెబ్బ తీశారు. 151 సీట్ల నుండి 11 సీట్లకు పడిపోవడానికి ప్రధాన కారణం ఆ పార్టీ నేతల అహంకారం, భాషా శైలేనని రాజకీయ విశ్లేషకులు భావించారు. అయితే, ఓటమి తర్వాత కూడా వైసీపీ తన ధోరణిని మార్చుకున్నట్లు కనిపించడం లేదు. నేటికీ ఎదురుదాడి, అసత్య ప్రచారాలు, వ్యక్తిగత దూషణలనే ఆయుధాలుగా వాడుతోంది. రాజకీయ పార్టీ అంటే కేవలం ఎన్నికల్లో గెలవడం మాత్రమే కాదు, సమాజానికి ఒక దిశానిర్దేశం చేయడం. బూతులు మాట్లాడే నేతలను వెనకేసుకురావడం ద్వారా వైసీపీ తన కేడర్‌కు తప్పుడు సంకేతాలు పంపుతోంది. అంబటి రాంబాబు వంటి నేతలపై కఠిన చర్యలు తీసుకోకపోతే, ఆ పార్టీపై ఉన్న బూతుల పార్టీ అనే ముద్ర మరింత బలపడే అవకాశం ఉంది. ఇప్పటికైనా వైసీపీ ఆత్మపరిశీలన చేసుకుని, విమర్శలను అర్థవంతంగా చేయడం నేర్చుకోకపోతే ప్రజల నుండి మరింత దూరమయ్యే ప్రమాదం ఉంది.

# ఏఐ సిటీగా అమరావతి

విజయవాడ, ఫిబ్రవరి 2, రాజధాని అమరావతిని కేవలం పరిపాలనా కేంద్రంగా మాత్రమే కాకుండా జ్ఞానం, సాంకేతికతకు కేంద్రబిందువుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని, దేశంలోనే తొలిసారిగా అమరావతిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ ఆలోచన వెనుక రాష్ట్ర యువతకు ఆధునిక నైపుణ్యాలు అందించి, అధిక వేతన ఉద్యోగాలు సృష్టించాలనే దృఢ సంకల్పం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిని భవిష్యత్ నగరంగా అభివృద్ధి చేయాలనే దృష్టితో ఇప్పటికే కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అందులో భాగంగా రాజధాని పరిధిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో క్వాంటం కంప్యూటింగ్ సౌకర్యాలు వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. దీనికి అనుబంధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విశ్వవిద్యాలయాన్ని వచ్చే నెల 19న ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అమరావతి పేరు వినగానే సాంకేతికత గుర్తుకొచ్చేలా నగరాన్ని తీర్చిదిద్దాలన్న ఆలోచనతో సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని అధికారులు చెబుతున్నారు. నగర నిర్మాణం నుంచి గుర్తింపు వరకు ప్రతీ అంశంలో టెక్నాలజీ కనిపించాలనే ఉద్దేశంతో అమరావతిని "ఏఐ సిటీ"గా నిలబెట్టాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నారు. ఈ దిశగా అమరావతి పేరుతోనే ఏఐ భావన ప్రతిబింబించేలా ప్రత్యేక లోగో రూపకల్పన చేయాలన్న ఆలోచన కూడా తీసుకొచ్చారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్విడియా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంతో వచ్చే రెండేళ్లలో రాష్ట్రానికి చెందిన దాదాపు పది వేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ రంగాల్లో శిక్షణ అందించనున్నారు. అంతేకాకుండా అమరావతిలో స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించేలా అవసరమైన మద్దతు కూడా ఈ విశ్వవిద్యాలయం ద్వారా లభించనుందని చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ విప్లవం వేగంగా విస్తరిస్తోంది. అమెరికా తర్వాత ఎక్కువ సంఖ్యలో ఏఐ నైపుణ్యం కలిగిన యువత భారత్‌లోనే ఉన్నారని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితిని అవకాశంగా మలుచుకుని, రాష్ట్రాన్ని కేవలం సేవలు అందించే స్థాయిలో కాకుండా, సాంకేతికతను సృష్టించే స్థాయికి తీసుకెళ్లాలన్నది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది. గతంలో హైదరాబాద్ ను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేసిన అనుభవం ఉన్న చంద్రబాబు, ఇప్పుడు అమరావతిని గ్లోబల్ డిజిటల్ రాజధానిగా మార్చాలనే లక్ష్యంతో ముందడుగు వేస్తున్నారని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. రాబోయే దశాబ్దాల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఏఐ చుట్టూనే తిరుగుతుందని భావిస్తున్న నేపథ్యంలో, ప్రతి కుటుంబం నుంచి ఒక ఏఐ నిపుణుడు తయారవ్వాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రచిస్తున్నారని చెబుతున్నారు. ఈ ప్రయత్నాల ద్వారా మధ్యతరగతి ఆదాయాలు పెరగడమే కాకుండా, రాష్ట్రం భవిష్యత్ తరాలకు బలమైన సాంకేతిక పునాది వేయనుందని ప్రభుత్వ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.

# కొబ్బరికాయ కొట్టే సంప్రదాయం వెనుక ఆంతర్యం ఏమిటి -ఎప్పుడు, ఎలా ప్రారంభమైంది



ఇంట్లో పూజ చేసినా, గుడికి వెళ్లినా కొబ్బరికాయ కొట్టడం ఆచారం. చాలామంది ఈ సంప్రదాయం పాటిస్తారు. అసలు కొబ్బరికాయ హిందువులకు మాత్రమే ఎందుకు ప్రత్యేకం..? కొబ్బరికాయను ఎందుకు పగులగొడతారు. కొబ్బరికాయ సంస్కృతంలో దేవుడికి ప్రతిరూపం. కొబ్బరికాయను శ్రీఫలం అని కూడా పిలుస్తారు. శ్రీఫలం అంటే.. దేవుడి ఫలం అని అర్థం..హిందూ సంప్రదాయంలో కొబ్బరికాయను మనిషి తలకు ప్రతీకగా భావిస్తారు. కొబ్బరికాయపైన ఉండే పీచు మనిషి జుట్టు, గుండ్రటి ఆకారం మనిషి ముఖం, కొబ్బరికాయలోపల ఉండే నీళ్లు రక్తం, గుజ్జు లేదా కొబ్బరి మనసుని సూచిస్తాయికొబ్బరికాయ వెనక భాగంలో ఉండే మూడు కన్నులకు చాలా మంచి అర్థం ఉంది. ముక్కంటిగా పిలువబడే.. శివుడి మూడు కన్నులను ఆ మూడు గుర్తులు సూచిస్తాయి పూర్వకాలంలో చాలా మంది, చాలా సందర్భాల్లో నరబలి ఇచ్చేవాళ్లు. అంటే దేవుడికి మనుషులను బలిగా ఇచ్చేవాళ్లు. ఈ సంప్రదాయానికి స్వస్తి చెప్పడానికే ఆధ్యాత్మిక గురు ఆది శంకర నరబలికి బదులుగా కొబ్బరికాయను దేవుడికి సమర్పించండని ఈ సంప్రదాయాన్ని ప్రారంభించారు. కొబ్బరికాయ పగలగొట్టడం వెనక అంతరార్థం ఉంది. ఇలా టెంకాయను పగులకొడితే.. మనుషుల అహం, తొలగిపోతుందని, అలాగే చాలా స్వచ్ఛంగా ఉండాలని సూచిస్తుంది. దాంతోపాటు తమ కోరికలు తీర్చిన దేవుడికి మొక్కుగా కొబ్బరికాయను సమర్పిస్తారు భక్తులు.

# పొరుగుదేశాలకు నిధులు...

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2, (న్యూస్ పల్స్) కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ 2026లో వివిధ దేశాలకు సహాయం చేసేందుకు నిధులు కేటాయించింది. ఆయా దేశాలకు మొత్తంగా నిధుల కేటాయింపు ఈసారి పెరిగినా.. ఆర్థిక ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని టైట్‌గా కేటాయింపులు చేసింది కేంద్రం. అధిక సాయం పొందిన దేశాల్లో ఈసారి కూడా భూటాన్ టాప్‌లో నిలిచింది. ఈ పొరుగు దేశానికి ఈసారి బడ్జెట్‌లో రూ. 2,289 కోట్లు దక్కాయి. ఆ తర్వాత నేపాల్ రూ.800 కోట్లు దక్కించుకుంది. ప్రతి ఏటా బడ్జెట్‌లో మిత్ర దేశాలు, పొరుగు దేశాలకు ఆర్థిక సహాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కొన్ని కేటాయింపులు చేస్తుంది. 'నైబర్‌హుడ్ ఫస్ట్' విధానంలో భాగంగా కేంద్రం ఈ నిధులను కేటాయిస్తోంది. ఈ క్రమంలోనే 2026 బడ్జెట్‌లో విదేశీ వ్యవహారాల శాఖకు మొత్తంగా రూ. 22,119 కోట్లు కేటాయించింది. అందులో వివిధ దేశాలకు సహాయం చేసేందుకు రూ. 5,686 కోట్లు కేటాయిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కాగా, గతేడాదితో (రూ. 5,483 కోట్లు) పోలిస్తే ఈసారి 4 శాతం నిధులు పెరిగాయి. అయితే ఈ బడ్జెట్‌లో ఆర్థిక సహాయం పొందిన లిస్టులో భారత్ పొరుగు దేశమైన భూటాన్ తొలి స్థానంలో నిలిచింది. ఇక బంగ్లాదేశ్‌తో సంబంధాలకు బీటలు వారుతున్నా.. ఆ దేశానికి కూడా కేటాయింపులు చేయడం విశేషం. భారత్‌కు అత్యంత సన్నిహిత మిత్రదేశం అయిన భూటాన్‌కు.. సాయంలో కేంద్రం అధిక నిధులు కేటాయించింది. 2026-2027 సంవత్సరానికిగానూ భూటాన్‌కు రూ. 2,289 కోట్లు కేటాయించింది. అయితే గతేడాది భూటాన్‌కు రూ. 2,150 కోట్లు ఇవ్వగా.. ఈసారి 6 శాతం నిధులు ఎక్కువగా కేటాయించారు. భూటాన్‌లో మౌలిక సదుపాయాలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, ఆర్థిక సహకారానికి భారత్ ఈ నిధులు కేటాయిస్తోంది. కాగా, నేపాల్, శ్రీలంకకు కూడా నిధులు కేటాయింపులు పెరిగాయి. నేపాల్‌కు గతేడాది కంటే 14 శాతం పెంపుతో రూ. 800 కోట్లు ఇచ్చింది. శ్రీలంకు రూ. 400 కోట్లు ఇచ్చింది. మారిషస్‌కు 10 శాతం పెంపుతో రూ. 550 కోట్లు కేటాయించింది. కాగా, మల్దీవులుకు గతేడాది కంటే 8 శాతం నిధులు తగ్గాయి. ఈ ద్వీప దేశానికి కేంద్రం రూ.550 కోట్లు కేటాయించింది. మరో పొరుగు దేశం అఫ్ఘనిస్తాన్‌కు నిధుల కేటాయింపుల్లో తేడాలేదు. గతేడాది లాగే ఈసారి కూడా రూ. 150 కోట్లు ఇచ్చింది భారత ప్రభుత్వం. మయన్మార్‌కు 10 శాతం పెంచి రూ. 300 కోట్ల నిధులు కేటాయించింది. ఇవే కాకుండా ఆఫ్రికా ఖండంలోని పలు దేశాలకు మొత్తంగా రూ.225 కోట్లు, లాటిన్ అమెరికా దేశాలకు రూ.120 కోట్లు, యూరేసియన్ దేశాలకు రూ.38 కోట్లు కేటాయింపులు చేసింది కేంద్ర ప్రభుత్వం.

వివిధ దేశాలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధుల వివరాలు :

భూటాన్ - రూ. 2288.55 కోట్లు

నేపాల్ - రూ. 800 (గతేడాది కంటే రూ. 100 కోట్లు అదనం)

మాల్దీవులు - రూ. 550 (రూ. 50 కోట్లు తగ్గుదల)

మారిషస్ - రూ. 550 (రూ. 50 అదనం)

శ్రీలంక - రూ. 400 (రూ. 100 కోట్లు అదనం)

మయన్మార్ - రూ. 300 కోట్లు (రూ. 50 కోట్లు తగ్గుదల)

ఆఫ్ఘనిస్తాన్ - రూ. 150 కోట్లు (రూ. 50 కోట్లు అదనం)

బంగ్లాదేశ్ - రూ. 60 కోట్లు ( రూ. 60 కోట్లు తగ్గుదల)

మంగోలియా - రూ. 25 (రూ. 20 కోట్లు అదనం)

సీషెల్స్ - రూ. 19 కోట్లు

# వెనిజులాతో ఆయిల్ ఒప్పందం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2, (న్యూస్ పల్స్) పంచంలో చమురు దిగుమతుల్లో భారత్ రెండో స్థానంలో ఉంది. చైనా తర్వాత ఎక్కువ మార్కెట్ ఉన్న దేశం భారతే. అందుకే పెట్రోలియం ఉత్పత్తి దేశాలు భారత్‌కు ఎగుమతి చేయడానికి చూస్తుంటాయి. భారత్ కూడా ఒకే దేశంపై ఆధారపడకుండా వివిధ దేశాలతో అగ్రిమెంట్ చేసుకుంది. ప్రస్తుతం రష్యా నుంచి ఎక్కువ మొత్తంలో చమురు దిగుమతి చేసుకుని యురోపియన్ యూనియన్, ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేస్తోంది. ఫలితంగా భారత్ లాభపడుతోంది. అయితే రష్యానుంచి భారత్ చమురు దిగుమతికి చెక్ పెట్టేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే చమురు దిగుమతిని సాకుగా చూపి 25 శాతం సుంకాలు విధించారు. తాజాగా వెనెజువెలా చమురు డీల్‌లో భారత్ పాత్రపై అనూహ్య వ్యాఖ్యలు చేశారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, భారత్ ఆ చమురు దిగుమతులు పెంచనుందని ప్రకటించారు. అయితే దీనిపై భారత్ స్పందించలేదు. వెనెజువెలాలోని భారీగా ఉన్న చమురు నిల్వల కోసమే ట్రంప్ సైలెంట్ ఆపరేషన్ నిర్వహించి అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను ఎత్తుకొచ్చారు. ప్రస్తుతం ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలు స్వీరించారు. ట్రంప్ మాత్రం 'ఆమె నా కోరికల ప్రకారం పాలిస్తోంది. చమురు మొత్తం మాకు చేరే వరకు కొనసాగుతారు' అని ట్రంప్ స్పష్టం చేశారు. 'మేము వెనెజువెలాతో ఒప్పందం కుదుర్చుకున్నాం. భారత్ కూడా చేరనుంది' అని ట్రంప్ తెలిపారు. చైనా కూడా చర్చల్లో ఉందని, దాన్ని స్వాగతిస్తామని చెప్పారు. వెనెజువెలా చమురు నిల్వలు పూర్తిగా అమెరికా నియంత్రణలో ఉన్నాయని స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే.. ఇటీవల భారత ప్రధాని మోదీ, రోడ్రిగ్జ్ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులపై ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలోనే ట్రంప్ తన ఆధిపత్యం చాటుకునేందుకు భారత్‌ను బద్నాం చేస్తున్నట్లు తెలుస్తోంది. వెనెజువెలా చమురు కొనుగోలుతో భారత్‌కు చమురు దిగుమతులు సులభమవుతాయి. కానీ అమెరికాకు తొలొగ్గాల్సి ఉంటుంది. చైనా పాల్గొంటే గ్లోబల్ ఎనర్జీ డైనమిక్స్ మారవచ్చు. ట్రంప్ వ్యాఖ్యలపై భారత్ అధికారికంగా స్పందించలేదు.

# సౌమ్య కుటుంబానికి అండగా ప్రభుత్వం ఎక్సైజ్ పోలీసులకు ఆయుధాలు

నిజామాబాద్, ఫిబ్రవరి 2, సమాజంలో శాంతి భద్రతలను కాపాడేందుకు, మాదక ద్రవ్యాల మహమ్మారిని అంతం చేసేందుకు కొందరు అధికారులు తమ ప్రాణాలు సైతం పణంగా పెడుతున్నారు. అటువంటి ఒక ధీరవనిత, నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య. గంజాయి స్మగ్లర్ల అరాచకానికి ఎదురొడ్డి నిలిచి, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఆమె త్యాగం నేడు యావత్ తెలంగాణను కన్నీటి పర్యంతం చేస్తోంది. జనవరి 23న నిజామాబాద్‌లో గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న పక్కా సమాచారంతో ఎక్సైజ్ బృందం తనిఖీలు చేపట్టింది. ఈ క్రమంలోనే స్మగ్లర్లు తప్పించుకునే ప్రయత్నంలో తమ వాహనంతో సౌమ్యను అత్యంత కిరాతకంగా ఢీ కొట్టారు. అంతటితో ఆగకుండా ఆమెపై నుంచి వాహనాన్ని పోనిచ్చారు. తీవ్రంగా గాయపడిన సౌమ్య చావుబతుకుల మధ్య పోరాడుతూ, ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ కన్నుమూశారు. సౌమ్య త్యాగాన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం ఆమె కుటుంబానికి అండగా నిలిచేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆదివారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేశారు. సౌమ్య కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సాయం ప్రభుత్వం ప్రకటించింది. ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించబోతున్నట్టు మంత్రి తెలిపారు. విధి నిర్వహణలో సౌమ్య ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని జూపల్లి కృష్ణారావు భరోసా ఇచ్చారు. ఈ ఘటన ఎక్సైజ్‌శాఖలో ఒక ప్రధాన చర్చకు దారి తీసింది. సాధారణ పోలీసులు మాదిరిగా కాకుండా ఎక్సైజ్ అధికారులు తరచూ ఆయుధాలు లేకుండానే ప్రమాదకరమైన స్మగ్లర్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే క్షేత్రస్థాయి అధికారులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై విధి నిర్వహణలో ఉన్న ఎక్సైజ్ పోలీసులకు ఆయుధాలు సమకూరుస్తామని మంత్రి జూపల్లి ప్రకటించారు. సౌమ్య మృతదేహం ఆమె స్వగ్రామం నిజామాబాద్ జిల్లా మోస్రా చేరుగానే ఆ ప్రాంతమంతా శోకసంద్రమైంది. తమ ఊరి బిడ్డ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన వీరనారిని ఆఖరిసారి చూసేందుకు ప్రజలు తరలి వచ్చారు. కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు ఊరంతా ఆమె పార్థి దేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సౌమ్య అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది భారీగా తరలి వచ్చి తమ సహచర ఉద్యోగికి ఘన నివాళి అర్పించారు. గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు.

# ఘోర రోడ్డు ప్రమాదం అధికారుల నిర్లక్ష్యం మరో ప్రాణం తీసింది

వికారాబాద్ పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బైక్‌ను లారీ ఢీకొనడంతో ఓ బాలుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన స్థానికులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. బుగ్గ రామేశ్వరం వద్ద ఉన్న ప్రమాదకర మలుపు వల్ల గతంలో కూడా ఎన్నో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయినప్పటికీ, ఆ ప్రమాదకర టర్నింగ్‌ను సరిచేయడంలో సంబంధిత అధికారులు ఇప్పటికీ నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాద స్థలాలను గుర్తిస్తామని అధికారులు మాటలకే పరిమితం అవుతున్నారని, గుర్తించినప్పటికీ తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడమే ఇలాంటి విషాద ఘటనలకు కారణమవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి, ప్రమాదకరమైన బుగ్గ రామేశ్వరం మలుపును వెంటనే సురక్షితంగా మార్చి, మరిన్ని ప్రాణ నష్టాలను నివారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

# కింగ్ మేకర్ గా విజయ్...



చెన్నై, ఫిబ్రవరి2, (న్యూస్ పల్స్) తమిళనాడులో మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాంతీయ పార్టీలతోపాటు బీజేపీ కూడా తమిళనాడులో అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నాయి. ఈమేరకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించాయి. ఇక ఈసారి ఎన్నికల్లో సినీ స్టార్ విజయ్ పార్టీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇప్పటికే చివరి సినిమా విడుదల విషయంలో ఇబ్బందులు పడుతుండగా, తాజాగా వచ్చిన సర్వే ఫలితాలు విజయ్ పార్టీకి పెద్ద ఊరటనిచ్చాయి. ఇండియా టుడే, సీ ఓటర్ సర్వే ఫలితాలు వెల్లడయ్యాయి.తాజా సర్వేలో ఇండీ+ కూటమి 45% ఓటర్ల మద్దతు సాధించగా, ఎన్డీఏకు 33% లభించింది. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన టీవీకే 15% ఓటర్లను ఆకర్షించింది. మిగిలిన 7% ఇతర పార్టీలకు విభజించబడింది. ఈ శాతం టీవీకేను గణనీయ శక్తిగా నిలబెట్టింది.విజయ్ మాస్ అప్పీల్, క్లీన్ ఇమేజ్ వల్ల పార్టీ పాపులారిటీ పెరిగింది. పట్టణ, యువత ప్రాంతాల్లో టీవీకే బలం కనిపిస్తోంది. ఇది సంప్రదాయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా యువత ఎంపిక చేసుకుంటున్నట్టు సూచిస్తోందితాజా సర్వే ఫలితాలు టీవీకే క్యాడర్‌కు ఎనర్జీ ఇస్తాయి. ప్రస్తుత ట్రెండ్ కొనసాగితే, కూటములు, ప్రభుత్వ ఏర్పాటులో టీవీకే కీలక పాత్ర పోషిస్తుంది. రాజకీయ విశ్లేషకులు టీవీకేను అతీతంగా చూస్తున్నారు. తమిళనాడు రాజకీయాల్లో కొత్త ఆకాంక్షకు టీవీకే సిద్ధమవుతోంది.

# భారీగా పెరిగి... తర్వాత తగ్గి...



ముంబై, ఫిబ్రవరి 2, ఏడాదిగా భారీగా పెరుగుతూ వచ్చిన బంగారం, వెండి ధరలు రెండు రోజులుగా రికార్డు స్థాయిలో పతనం అవుతున్నాయి. 2025 ప్రారంభంలో 10 గ్రాముల బంగారం రూ.లక్ష లోపు ఉండగా, ఇప్పుడు రూ.1.50 లక్షలు దాటింది. ఈ జనవరిలో 26 శాతం పెరిగింది. ఇక వెండి ధర గత జనవరిలో కిలో రూ.70 వేలు ఉండగా ఈ జనవరిలో 56 శాతం పెరిగి రూ.3.50 లక్షలకు చేరింది. అయితే సడెన్‌గా ధరల పతనం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.2025లో భారత్‌లో ఈ లోహాలు గణనీయ రైజ్ చూపాయి. గరిష్ట స్థాయికి చేరిన తర్వాత కొనుగోళ్లు ఆగిపోయాయి. పెట్టుబడిదారులు దూరమయ్యారు. ఇప్పటికే కొన్నవారు లాభాలు లాక్ చేసుకోవడానికి అమ్మకాలు మొదలుపెట్టారు. డాలర్ విలువ 0.4% పెరగడం ఈ ట్రెండ్‌ను మరింత ఊర్చిందిధరల పతనానికి మూల కారణం అమెరికాలో రాజకీయ టెన్షన్స్. ట్రంప్, ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ మధ్య దీర్ఘకాల విభేదాలు తీవ్రమయ్యాయి. ట్రంప్ వడ్డీ రేట్లు తగ్గించమని ఒత్తిడి తెచ్చాడు, కానీ పావెల్ స్వతంత్రంగా పని చేయాలని నిరసిస్తున్నారు. పావెల్ తనపై క్రిమినల్ ఇన్వెస్టిగేషన్‌కు ఆదేశించారని, డాలర్ బలోపేత చర్యలు చేపట్టానని ప్రకటించారు. ట్రంప్ పావెల్‌ను నియమించినా, మేలో పదవి ముగియనుంది. కానీ, ట్రంప్ ఆరు నెలల ముందే పావెల్ వారసుడుగా కెవిన్ వార్ష్‌ను ప్రకటించడం గందరగోళాన్ని మేల్కొల్పింది.

ట్రంప్ విధానాల వల్ల అమెరికా స్టాక్ మార్కెట్లు క్రాష్ అయ్యాయి. ఈ అస్థిరత ప్రపంచ పెట్టుబడిదారులను భయపెట్టింది. బంగారం, వెండి వంటి సేఫ్ హేవెన్ ఆస్తులు కూడా అమ్మకాలకు గురయ్యాయి. భారత్‌లో డిమాండ్ తగ్గడంతో ధరలు మరింత పడిపోయాయి.బంగారం, వెండి ధరల పతనం అవకాశాలను అందిస్తోంది ? తక్కువ ధరల్లో కొనుగోలు చేయవచ్చు. కానీ ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ మార్పులు, ఫెడ్ పాలసీలు దృష్టిలో ఉంచుకోవాలి. షార్ట్?టర్మ్ వోలటాలిటీ ఉంటుంది, లాంగ్?టర్మ్ ఇన్వెస్టర్లు ఓపిక పాటించాలి.

# ఆదానీ గ్రూప్ కు టోకరా...

హైదరాబాద్, ఫిబ్రవరి 2, వైట్‌కాలర్ నేరాలు రోజురోజుకూ సరికొత్త పుంతలు తొక్కుతున్నాయి. సామాన్యులను ముంచే చిన్నపాటి చీటింగ్‌ల నుంచి ఏకంగా అగ్రశ్రేణి కార్పొరేట్ సంస్థలనే బురిడీ కొట్టించే స్థాయికి నేరగాళ్లు ఎదిగారు. తాజాగా ఆదానీ గ్రూప్‌కు చెందిన ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థ ఏసీసీ లిమిడెట్‌ను టార్గెట్ చేస్తూ జరిగిన ఒక భారీ మోసం వెలుగులోకి వచ్చింది. కేవలం నకిలీ పత్రాలతో ఒక సినిమా లెవల్‌లో ప్లాన్ చేసి, సుమారు రెండు కోట్ల విలువైన సిమెంట్‌ను కాజేసిన ఈ ఘటన ఇప్పుడు పారిశ్రామిక వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది.లక్కీ భాస్కర్ సినిమాలో బ్యాంకింగ్ లొసుగులను వాడుకుని ఎలా మోసాలు పాల్పడతారో చూశాం. సరిగా అదే తరహాలో బ్యాంక్ గ్యారంటీ అనే ఆయుధాన్ని వాడుకొని నిందితులు అదానీ గ్రూప్‌కు భారీ కుచ్చు టోపీ వేశారు.హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన వివరాల ప్రకారం జేపీ ఇన్‌ఫ్రా అండ్ ఇంజనీరింగ్ అనే సంస్థ యజమాని జ ప్రకాష్ ఇన్నార్తి , అతని సహచరుడు మన్మోహన్ కలిసి ఈ కుట్రకు తెరలేపారు. వీరు పంజాబ్ నేషనల్ బ్యాంకు పేరుతో ఒక నకిలీ బ్యాంకు గ్యారంటీ పత్రాన్ని సృష్టించారు. ఈ పత్రం విలువ అక్షరాల 2 కోట్లు. ఈ నకిలీ బ్యాంకు గ్యారంటీని అసలైనదిగా నమ్మించి, నిందితులు ఏసీసీ లిమిటెడ్, అంబుజా సిమెంట్స్ సంస్థలను సంప్రదించారు. భారీ ప్రాజెక్టుల పేరుతో తమకు సిమెంట్ సరఫరా చేయాలని కోరారు. సదరు బ్యాంక్ గ్యారంటీ నిజమేనని నమ్మిన కంపెనీ యాజమాన్యం, నిందితులకు వివిధ విడతల్లో సిమెంట్‌ను సరఫరా చేసింది.

దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం సరఫరా చేసిన సిమెంట్ విలువ 2,02,05,368 రూపాయలు అయితే, నిందితులు చెల్లించిన మొత్తం 5,60,000 రూపాయలు, మోసం చేసిన మిగిలిన మొత్తం 1,96,45,368 రూపాయలు. అంటే రెండు కోట్లకుపైగా విలువైన సరకును తీసుకొని కేవలం నామమాత్రపు సొమ్మును మాత్రమే చెల్లించి, మిగిలిన రూ.1.96 కోట్లను నిందితులు ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టారు. నిందితుల నుంచి బకాయిలు రాకపోవడంతో ఏసీసీ సంస్థ ఆందోళన చెందింది. చివరికి తమ వద్ద ఉన్న రెండు కోట్ల బ్యాంక్ గ్యారంటీని నగదుగా మార్చుకోవాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ఏసీసీ ప్రతినిధులు పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను సంప్రదించగా, అక్కడ వారికి పెద్ద షాక్ తగిలింది.

నిందితులు సంప్రదించగా అక్కడ వారికి పెద్ద షాక్ తగిలింది.

నిందితులు సమర్పించిన ఆ బ్యాంక్ గ్యారంటీ పత్రం తమ బ్యాంక్ నుంచి జారీ కాలేదని, అది పూర్తిగా ఫోర్జరీ చేసిన నకిలీ పత్రమని బ్యాంక్ అధికారులు స్పష్టం చేశారు.

దీంతో తాము నిలువునా మోసపోయామని గ్రహించిన అదానీ గ్రూ? ప్రతినిధులు పోలీసులను ఆశ్రయించారు. ఏసీసీ లిమిటెడ్ రీజినల్ సేల్స్ మేనేజర్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ ఫిర్యాదును అత్యంత సీరియస్‌గా తీసుకున్న పంజాగుట్ట పోలీసులు, జనవరి 24న కేసు నమోదు చేశారు. జయప్రకాష్ ఇన్నార్తి, మన్మోహన్, ఇతరులపై బీఎన్ఎస్‌లోని సెక్షన్ 406, 420 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నట్టు సమాచారం.

# నిజాం నగలు తరలింపుపై ప్రతిష్టంబన

హైదరాబాద్, ఫిబ్రవరి 2, హైదరాబాద్ రాజ్య చరిత్ర అంటేనే అంతులేని వైభవం. ఆ వైభవానికి తలమానికం 'నిజాం ఆభరణాలు'. ఈ నగలు కేవలం రాచరికపు అలంకరణలు మాత్రమే కావు, అవి దక్కన్ సంస్కృతికి, మొఘలాయిల కాలపు కళా చాతుర్యానికి, గోల్కొండ వజ్రాల స్వచ్ఛతకు నిదర్శనాలు. తాజాగా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనతో ఈ నిధికి సంబంధించిన లోతైన విషయాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి.ఏడో నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ కాలంలో ఈ నగలు అత్యున్నత దశకు చేరుకున్నాయి. 1948లో హైదరాబాద్ విలీనం తర్వాత, తన వారసుల ఆర్థిక భద్రత కోసం నిజాం రెండు ప్రధాన ట్రస్టులను ఏర్పాటు చేశారు. ఒకటి 1951లో ఏర్పాటు చేసిన నిజాం జ్యువెలరీ ట్రస్ట్ కాగా రెండోది 1952లో ఏర్పాటు చేసిన నిజాం సప్లిమెంటరీ జ్యువెలరీ ట్రస్ట్. ఈ ట్రస్టులలోని 173 ఆభరణాలను విక్రయించకుండా, కేవలం నిజాం కుటుంబ వారసుల హక్కులను కాపాడేలా నిబంధనలు రూపొందించారు. అయితే, కాలక్రమేణా వారసుల మధ్య తలెత్తిన వివాదాలు, పన్ను సమస్యల వల్ల ఈ నిధిని విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.1970వ దశకంలో నిజాం వారసులు ఈ నగల వేలానికి ప్రయత్నించగా, భారత ప్రభుత్వం జోక్యం చేసుకుంది. "ఇవి దేశం గర్వించదగ్గ జాతీయ సంపద, వీటిని విదేశీయులకు విక్రయించకూడదు" అని కేంద్రం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుదీర్ఘ కాలం పాటు జరిగిన ఈ న్యాయపోరాటం 1995లో ముగిసింది. అప్పట్లో ఈ నగల విలువపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లో వీటి విలువ వేల కోట్లు ఉంటుందని అంచనా వేసినప్పటికీ, నిజాం వారసులతో కుదిరిన ఒప్పందం ప్రకారం రూ. 218 కోట్లకు భారత ప్రభుత్వం వీటిని దక్కించుకుంది. ఒప్పందం ప్రకారం, అప్పటి నుంచి ఈ నగలు ముంబైలోని ఆర్‌బీఐ ప్రధాన కార్యాలయంలోని అత్యంత సురక్షితమైన రహస్య గదుల్లో భద్రపరిచారు.ఈ 173 నగల సేకరణలో కొన్ని ప్రపంచ ప్రసిద్ధి గాంచినవి ఉన్నాయి. అందులో జాకబ్ డైమండ్ ఒకటి. ఇది ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద వజ్రం. ఇది 184.75 క్యారెట్ల బరువు కలిగి ఉంటుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, నిజాం తన టేబుల్‌పై దీనిని ఒక పేపర్ వెయిట్‌గా వాడేవారు. విక్టోరియా వజ్రం కంటే ఇది పెద్దది. ఇంకో ముఖ్యమైన ఆభరణం సత్లదా. ఏడు వరుసల ముత్యాల హారం ఇది. ఇందులో ఉపయోగించిన ముత్యాలు ప్రపంచంలోనే అత్యుత్తమమైన 'బస్రా' ముత్యాలు. ఇక నిజాం ఖిల్వత్ అలంకరణలు కూడా పేరెన్నికగన్నవి. రాజులు ధరించే దస్తార్ (తలపాగా)పై అలంకరించే 'సర్ పేంచ్'లు ఇవి. వీటిలో వజ్రాలు, పచ్చలు, కెంపులు అత్యంత నైపుణ్యంతో పొదగబడ్డాయి. ఇవేకాక కేవలం పురుషులకే కాకుండా, అంతఃపుర స్త్రీల కోసం రూపొందించిన భారీ కమ్మలు, పట్టీలు, ఉంగరాలు ఇందులో ఉన్నాయి. ఒక్కో ఆభరణం వెనుక నెలల తరబడి శ్రమించిన కళాకారుల ప్రతిభ కనిపిస్తుంది.హైదరాబాద్ పౌరులు, చరిత్రకారులు ఈ నగలను శాశ్వతంగా హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంలో లేదా చౌమహల్లా ప్యాలెస్‌లో ఉంచాలని కోరుతున్నారు. నిజాం నగలు ఇక్కడ ఉంటే, హైదరాబాద్ అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుంది. ఇవి హైదరాబాద్ గడ్డపై పుట్టినవి. స్థానిక ప్రజలకు తమ పూర్వీకుల సంపదను చూసుకునే హక్కు ఉందని భావిస్తారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం కూడా వీటి తరలింపుపై కేంద్రానికి లేఖలు రాశాయి.అయితే వీటి తరలింపులో అనేక చిక్కుముళ్లు ఉన్నట్టి కేంద్ర మంత్రి పార్లమెంటులో ప్రకటించారు. వీటిని తరలించడం కేవలం ఒక రాజకీయ నిర్ణయం కాదన్నారు. 1995లో రూ. 218 కోట్లకు కొన్న ఈ నిధి ప్రస్తుత మార్కెట్ విలువ రూ. 50,000 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఇంతటి విలువైన సొత్తును రోడ్డు లేదా విమాన మార్గంలో తరలించడం అత్యంత సాహసోపేతమైన ప్రక్రియ. ఈ నగలను ప్రదర్శించే మ్యూజియంకు గాలి చొరబడని బుల్లెట్ ప్రూఫ్ గ్లాసులు, లేజర్ సెక్యూరిటీ సిస్టమ్స్, ఆర్మ్డ్ ఫోర్సెస్ రక్షణ అవసరం. అంతేకాక ఆర్‌బీఐ, భారత ప్రభుత్వాల మధ్య ఉన్న పాత ఒప్పందాలను సవరించాల్సి ఉంటుంది.అయితే నిజాం నగల చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతను గుర్తిస్తున్నామని కేంద్రం చెప్పడం ఒక ముందడుగు. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా హైదరాబాద్‌కు శాశ్వతంగా తరలించలేకపోతున్నామని చెప్పడం పట్ల చరిత్రకారుల్లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది. భవిష్యత్తులో సాంకేతికత మరింత అభివృద్ధి చెంది, పటిష్టమైన భద్రతతో ఈ నిధి మళ్లీ భాగ్యనగరంలో ప్రదర్శించబడుతుందని ఆశిద్దాం.

# కేసీఆర్ భావోద్వేగం...

## అప్పుడు అస్థిత్వం... ఇప్పుడు విచారణలా.

హైదరాబాద్, ఫిబ్రవరి 2, తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా వేడెక్కింది. గత పదేళ్ల రాష్ట్రాన్ని శాసించిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నందినగర్ నివాసంలో సిట్ అధికారుల విచారణను ఎదుర్కొన్నారు. కేవలం విచారణే కాదు, అక్కడ చోటుచేసుకున్న పరిణామాలు, కేసీఆర్ వ్యక్తం చేసిన భావోద్వేగాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.విచారణ ప్రారంభానికి ముందు కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనైనట్లు తెలుస్తోంది. మధ్యాహ్న భోజన సమయంలో తన సన్నిహితుల వద్ద ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. నందినగర్‌లోని కేసీఆర్ నివాసం తెలంగాణ ఉద్యమ కాలంలో కీలక నిర్ణయాలకు వేదిక. "స్వరాష్ట్ర సాధన కోసం ఇదే గదిలో ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాను. వ్యూహాలు రచించాను. అలాంటి పవిత్రమైన చోట నేడు నేరారోపణలపై విచారణ ఎదుర్కోవాల్సి రావడం బాధాకరం" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "తెలంగాణ అస్థిత్వం కోసం పోరాడిన గదిలో.. ఇప్పుడు అదే రాష్ట్రంలో విచారణ ఎదుర్కోవడం కాలం చేసిన వింత క్రీడ." అని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయ పడుతున్నారు.ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఈ విచారణలో సిట్ అధికారులు అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు సమాచారం. సాధారణంగా విచారణ సమయంలో న్యాయవాదులను అనుమతించాలని కోరుతుంటారు, కానీ సిట్ అధికారులు ఇందుకు నిరాకరించారు. నిబంధనల ప్రకారం కేవలం కేసీఆర్‌ను మాత్రమే ప్రశ్నించారు. విచారణ మొదలవ్వగానే మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు ఇతర కీలక నేతలను అధికారులు బయటకు పంపేశారు. లోపల కేసీఆర్, సిట్ బృందం మాత్రమే ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక అధికారుల వాంగ్మూలాలు, రికార్డైన ఆధారాల ప్రాతిపదికన కేసీఆర్‌పై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలుస్తోంది.కేసీఆర్ విచారణ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉద్రిక్తత నెలకొంది. నందినగర్ నివాసం చుట్టూ భారీగా పోలీసు బలగాలను మోహరించారు. బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించారు. తమ నాయకుడిని విచారించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు అక్కడక్కడా నిరసనలకు దిగుతుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు సంకేతంగా కనిపిస్తోంది. కేసీఆర్ భావోద్వంతో కేడర్ లో సెంటిమెంట్ పెరిగే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం మాత్రం చట్టం తన పని తాను చేసుకుపోతోందని సమర్థించుకుంటోంది. అయితే బీఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్ దుమారం ఏ స్థాయిలో రచ్చకు కారణమయ్యాయో తెలుసు. కానీ ఉద్యమనేత కేసీఆర్ నే విచారించడాన్ని మాత్రం బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోంది. తెలంగాణ సాధించిన నేతగా, దశాబ్ద కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలాంటి విచారణ ఎదుర్కోవాల్సి రావడం విశేషమే.!

# మంత్రుల ఇళ్ల రిపేర్ కోసం కోటి రూపాయిలా..

## అజారుద్దీన్ ఇంటి రిపేర్ కోసం రూ. 76 లక్షలా...

హైదరాబాద్, ఫిబ్రవరి 2, తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు మంత్రి మహ్మద్ అజారుద్దీన్ అధికారిక నివాసం మరమ్మతుల వ్యవహారం సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా మారింది. ఒకవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూనే, మరోవైపు మంత్రుల నివాసాల కోసం భారీగా నిధులు వెచ్చించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి, మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్‌కు బంజారాహిల్స్ లోని క్వార్టర్ 29 ను ప్రభుత్వం కేటాయించింది. ఈ ఇంటి పునరుద్ధరణ, మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 76 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం వివాదాస్పదమవుతోంది. దీనిపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం, ఈ భవనం గత 15 ఏళ్లుగా నిరుపయోగంగా ఉంది. దీనివల్ల పైకప్పులు కారడం, ఫ్లోరింగ్ దెబ్బతినడం, విద్యుత్ వైరింగ్ పాడైపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. వీటిని చక్కదిద్దడానికి వాటర్ ప్రూఫింగ్, టైల్స్ మార్పు, యూపీవీసీ కిటికీలు, ఆధునిక మాడ్యులర్ కిచెన్, పెయింటింగ్ వంటి పనుల కోసం ఈ భారీ మొత్తాన్ని కేటాయించారు. అయితే, ఇదే సమయంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నివాసానికి కూడా మరో రూ. 30 లక్షలు కేటాయించడంతో, గత రెండు వారాల్లో మంత్రుల క్వార్టర్ల కోసమే ప్రభుత్వం కోటి రూపాయలకు పైగా ఖర్చు చేస్తోందని స్పష్టమవుతోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సందర్భాల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని, గత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల వల్ల ఖజానా ఖాళీ అయిందని బహిరంగంగానే ప్రకటిస్తూ వస్తున్నారు. రైతు భరోసా, పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలకు నిధుల సర్దుబాటు చేయడం సవాలుగా మారిన తరుణంలో, మంత్రుల నివాసాల కోసం లక్షలాది రూపాయలు కుమ్మరించడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని సూచిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ప్రభుత్వ నిర్ణయంపై ప్రజల్లోనూ అసహనం వ్యక్తం అవుతోంది. సామాన్యుడు పన్నుల రూపంలో చెల్లించే సొమ్మును ప్రజా ప్రయోజనాల కంటే కూడా పాలకుల విలాసాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో రోడ్ల మరమ్మతులు, పాఠశాలల మౌలిక సదుపాయాల కంటే మంత్రుల కిచెన్‌లు, వార్డ్‌రోబ్‌లు ముఖ్యమా? అనే ప్రశ్న తలెత్తుతోంది. బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఈ అంశాన్ని ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరిస్తున్నారు. నిధుల కొరత సాకులు చెప్పే ప్రభుత్వం, మంత్రుల విషయంలో మాత్రం ఎందుకు ఉదారంగా వ్యవహరిస్తోందని వారు ప్రశ్నిస్తున్నారు. 15 ఏళ్లుగా ఒక భవనాన్ని గాలికి వదిలేసి, ఇప్పుడు దానిపై భారీగా వెచ్చించడం ప్రభుత్వ భవనాల నిర్వహణలోని వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది.అయితే ప్రభుత్వం ఈ విమర్శలను కొట్టిపారేస్తోంది. మంత్రులు గౌరవప్రదమైన, సురక్షితమైన నివాసాల్లో ఉండటం కనీస అవసరమని, అవి వ్యక్తిగత ఆస్తులు కావు కాబట్టి ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని నేతలు సమర్థించుకుంటున్నారు. ఎలుకల బెడద, డ్రైనేజీ సమస్యలు, శిథిలావస్థలో ఉన్న భవనాలను నివాస యోగ్యంగా మార్చడానికే ఈ నిధులు ఖర్చు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.రాజకీయం అంటేనే ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశం. ముఖ్యంగా రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు పాలకుల జీవనశైలి, ఖర్చులు మరింత పారదర్శకంగా, మితంగా ఉండాలి. ఆడంబరం కంటే అవసరానికే ప్రాధాన్యతనిచ్చినప్పుడే ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుంది. అజారుద్దీన్ ఇంటి రిపేర్ల వివాదం కేవలం ఒక ఇంటి సమస్య మాత్రమే కాదు.. అది రాష్ట్ర బడ్జెట్ ప్రాధాన్యతలపై జరుగుతున్న పెద్ద చర్చకు సంకేతం. ప్రభుత్వం ఈ విషయంలో ప్రజలకు ఆమోదయోగ్యమైన వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

# ముఖ్యమంత్రి చంద్రబాబుకు

## ముద్రగడ లేఖ

విజయవాడ కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాసారు. మీ పాలనలో ఎప్పుడూ కాపులను టార్గెట్ చేస్తున్నారు. అప్పుడు నా కుటుంబాన్ని ఇప్పుడు అంబటి కుటుంబాన్ని అవమానించారు. రాష్ట్రంలో రాక్షస పాలన దహనకాండ కొనసాగుతుందని అన్నారు. ప్రతిపక్షాన్ని అణచివేయాలని చూస్తున్నారు. దీనికన్నా రాష్ట్రంలో ఎమర్జెనీ ప్రకటించండి. మీ పదవీకాలం బలమైన ప్రతిపక్షాన్ని జైలులో పెట్టడానికి వీలుపడుతుంది. గతంలో మీరు బిసి రిజర్వేషన్ ఇస్తానని మోసం చేశారు. కాపులు మీ మీద కోపంగా ఉన్నా డిప్యూటీ సీఎం పవన్ వల్ల మీరు అధికారంలోకి వచ్చిన విషయం నిజం కదా. ఐనా మీరు ఈ కులం మీద రాగిపోతూనే ఉన్నారు. దయచేసి ఈ కులాన్ని ఈ రాష్ట్రం నుండి కట్టుబట్టలతో వేరే రాష్ట్రాలకు పంపించండని లేఖలో పేర్కొన్నారు.

# సాత్ కు బూస్టప్... కారిడార్లు...

హైదరాబాద్, ఫిబ్రవరి 2, హైదరాబాద్ నుంచి అత్యాధునిక, అత్యంత వేగవంతమైన బుల్లెట్ ట్రైన్లు అందుబాటులోకి రానున్నాయి. కొత్తగా ఏడు హైస్పీడ్ కారిడార్ ప్రాజెక్టుల్ని మంజూరు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ 2026-27లో ప్రకటించింది. ఈ హైస్పీడ్ ట్రైన్ నెట్‌వర్క్‌లో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కేంద్ర బిందువుగా మారనుంది. నగరం నుంచి పుణె, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు హైస్పీడ్ ట్రైన్లు నడవనున్నాయి. హైదరాబాద్ నుంచి పుణె, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లేవారికి గుడ్‌న్యూస్. తర్వలోనే ఈ నగరాలకు హైస్పీడ్‌గా చేరుకోనున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌లో ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లు ప్రకటించగా.. అందులో మూడు హైదరాబాద్ నుంచే ఉన్నాయి. హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, పుణె నగరాలకు ఈ ప్రాజెక్టులను చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే.. తెలుగు రాష్ట్రాల్లోని నగరాలు, పట్టణాల మధ్య కూడా రాకపోకలు వేగవంతమవుతాయి. ప్రస్తుతం నడుస్తున్న వందేభారత్ సీటింగ్ ట్రైన్ల గరిష్ఠ వేగం 150 కి.మీ. కాగా.. త్వరలో ప్రవేశపెట్టనున్న స్లీపర్ ట్రైన్‌కు ఇటీవల ట్రయల్ రన్ నిర్వహించారు. ఆ ట్రైన్ల గరిష్ఠ వేగం 180 కి.మీ. వేగం అందుకుంది. తాజాగా హైస్పీడ్ కారిడార్ ట్రైన్ ప్రాజెక్టులను 350 కి.మీ. వేగాన్ని తట్టుకునేలా డిజైన్ చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పుణె నగరాలకు ఎక్స్‌ప్రెస్ ట్రైన్లలో చేరుకునేందుకు 12-15 గంటల సమయం పడుతుండగా.. హైస్పీడ్ కారిడార్ కార్యరూపం దాలిస్తే 3 నుంచి 3.5 గంటల్లోనే ఆయా నగరాలకు చేరుకోవచ్చు. హైస్పీడ్ కారిడార్‌లో హైదరాబాద్ నుంచి ఖమ్మం, కర్నూలు వంటి నగరాలకు గంట సమయంలోనే చేరుకోవచ్చు.

ఏపీ రాజధాని అమరావతికి సుమారు 75 నిమిషాలు, అనంతపురం పట్టణానికి 90 నిమిషాల వ్యవధిలో చేరుకోవచ్చు. ఈ ప్రాజెక్టుల్లో భాగంగా.. చిన్న నగరాలు, జిల్లా కేంద్రాలు, పట్టణాల్లోనూ స్టాపేజీలను గుర్తించారు. తెలంగాణలో నార్కట్‌పల్లి, వనపర్తి రోడ్డు, శంషాబాద్ వంటి పట్టణాలతో పాటుగా.. సూర్యాపేట, మహబూబ్‌నగర్, ఖమ్మం వంటి జిల్లా కేంద్రాల్లోనూ ఈ ట్రైన్లు ఆగనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని చీరాల, కావలి, గూడూరు వంటి పట్టణాల్లోనూ ఈ ట్రైన్లకు అనుగుణంగా స్టేషన్లు నిర్మించనున్నారు. ప్రస్తుత రైల్వేలైన్లతో సంబంధం లేకుండా కేవలం వీటి కోసమే కొత్తగా ట్రైన్ లైన్లు నిర్మిస్తారు.

కీలకదశలో తుది ఎలైన్‌మెంట్

హైదరాబాద్-పుణె హైస్పీడ్ కారిడార్ జహీరాబాద్, కలబురిగి, శోలాపూర్, పంధార్‌పూర్, అక్లుజ్, దౌడ్, పుణె, స్టేషన్లలో ప్రతిపాదించారు. హైదరాబాద్-చెన్నై ఎలైన్‌మెంట్‌ను శంషాబాద్, నార్కట్‌పల్లి, సూర్యాపేట, ఖమ్మం నుంచి ఏపీలో అమరావతి మీదుగా ప్రతిపాదించింది. హైదరాబాద్-బెంగళూరు మార్గంలో శంషాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్ మీదుగా రైల్వేశాఖ ప్రతిపాదించింది. తాజా ప్రాజెక్టులతో హైదరాబాద్‌కు చెన్నై, ముంబై, బెంగళూరు వంటి మెట్రో నగరాలతోపాటు.. పుణె, ఖమ్మం, తిరుపతి, నెల్లూరు, అనంతపురం, అమరావతి, కర్నూలు, కలబురిగి, శోలాపూర్ వంటి నగరాలకు వేగవంతమైన ట్రైన్ కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుంది. అయితే భూసేకరణ చిక్కులు, రూ.లక్షల కోట్ల వ్యయం వంటి అంశాల నేపథ్యంలో ఈ ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు చాలా ఏళ్లు పట్టే అవకాశాలున్నాయి.

# రిజిస్ట్రేషన్లతో భారీగా ఆదాయం

హైదరాబాద్, ఫిబ్రవరి 2, తెలంగాణలో భూముల ధరలు భారీగా పెరిగాయి. దీంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జనవరి 15 నాటికి రూ.11,957.30 కోట్ల రాబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఒక్క డిసెంబర్ నెలలోనే రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.1,391.30 కోట్ల ఆదాయం వచ్చి చేరినట్లు అధికారులు వెల్లడించారు. తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం మరోసారి పుంజుకుంటోంది. హైదరాబాద్ పట్టణంతో పాటు శివారు ప్రాంతాలు, జిల్లాల్లోనూ ఇళ్ల స్థలాలు, ఫ్లాట్ల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఒక్క డిసెంబరు నెలలోనే రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ.1,391.30 కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పటివరకు నమోదైన రాబడిలో మే నెలలో వచ్చిన రూ.1,390 కోట్లు అధికం. తాజాగా డిసెంబరులో ఆ రికార్డును అధిగమించింది. దీంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వార్షిక రికార్డులను కూడా అధిగమించి అత్యధిక రాబడిని నమోదు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి 15 నాటికే రూ.11,957.30 కోట్ల రాబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. గతంలో అత్యధిక రాబడి 2022-23లో రూ.11,806.34 కోట్లు కాగా.. ఆ రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జనవరి 15 నాటికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పరిధిలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 13.42 లక్షల దస్తావేజులు రిజిస్ట్రేషన్ అయినట్లు అధికారులు తెలిపారు. 2022-23లో 16.12 లక్షల దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరిగినప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం వచ్చినంత రాబడి అప్పుడు రాలేదు. దానికి కారణం భూముల ధరలు తక్కువగా ఉండటం. ప్రస్తుతం భూముల ధరలు భారీగా పెరగడంతోపాటు హైదరాబాద్ శివారు, చుట్టు పక్కల జిల్లాల్లో ఖరీదైన భూముల రిజిస్ట్రేషన్లు అధికమవడమే ఆదాయం పెరగటానికి కారణమని రిజిస్ట్రేషన్ల వర్గాలు చెబుతున్నాయి. నివాస గృహాలు, విల్లాలు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లతోపాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఇటీవల జరిగిన ఖరీదైన డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల కారణంగా రాబడి గతం కంటే పెరిగి ఉండొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లోనూ రియల్ ఎస్టేట్ రంగం పుంజుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇక తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి ఆధునిక మౌలిక సదుపాయాలు, ప్రజా సౌకర్యాలతో కూడిన అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను నిర్మిస్తుంది. కొత్త సమీకృత రిజిస్ట్రేషన్ ఆఫీసు భవనాల్లో భూముల రిజిస్ట్రేషన్‌తో పాటుగా.. వివాహ రిజిస్ట్రేషన్ల కోసం మినీ మ్యారేజ్ హాల్స్, గర్భిణులు, పిల్లలు, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. త్వరలోనే అన్ని జిల్లాల్లో ఇవి అందుబాటులోకి రానున్నాయి.

# కుక్క కాటుకు గురయిన చిన్నారి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి బంధువుల అందోళన



కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో రేబిస్ ఇంజెక్షన్ వికటించి చిన్నారి మృతి చెందాడు, అందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. రమేష్?అర్చన అనే దంపతులు కామారెడ్డి జిల్లా కొటాల్పల్లి గ్రామం నుండి బతుకుదెరువు కోసం తమ ఇద్దరు పిల్లలతో కామారెడ్డి పట్టణంలో స్థిరపడ్డారు. గత నెల 25వ తేదీన ఇంటి బయట ఆడుకుంటున్న తమ కూతురు క్రితార్స(2)ను వీధి కుక్క కరవడంతో కామారెడ్డిలో బోధనాసుపత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. ఇటీవల మూడవ డోస్ వ్యాక్సిన్ తీసుకుని ఇంటికి వెళ్లాక చిన్నారి అస్వస్థతకు గురవ్వడంతో, సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ప్రైవేటు ఆసుపత్రిలో చిన్నారికి పల్స్ పడిపోయిందని చెప్పడంతో తిరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే చిన్నారి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ కూతురు మరణించిందని, ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు విధుల్లో ఉన్న వైద్యుడిపై పోలీసులు కేసు నమోదు చేసారు.

# ఘనంగా ప్రకాశం జిల్లా అవిర్భావ దినోత్సవం

ఒంగోలు జిల్లా 57వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రకాశం భవనంలో ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి మంత్రి బాల వీరంజనేయులు స్వామి, జిల్లా కలెక్టర్లు రాజబాబు ఎస్పీ హర్షవర్ధన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి డోల మాట్లాడుతూ గుంటూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాల పరిధిలోని మూడు ముక్కలతో కొత్త జిల్లా ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పునర్విభజనతో మళ్లీ మూడు ముక్కలైంది. తాజాగా ఏర్పాటైన మార్కాపురం జిల్లాతో మరింత చిక్కినా...అభివృద్ధి పరంగా ఎన్నో అడుగులు ముందుకు వేసింది. కందుకూరు తో పాటు రామాయపట్నం పోర్టు ప్రకాశంలో కలవడం తో జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అద్దంకి రెవిన్యూ డివిజన్ గా మారిందని, ఉమ్మడి ప్రకాశంలో ఉన్న వెలిగొండ ప్రాజెక్టు తో జిల్లా సస్యశ్యామలం గా మారబోతుందని తెలిపారు. చంద్రబాబు నాయుడు సారధ్యంలో జిల్లాకు అనేక పరిశ్రమలు రాబోతున్నాయి దొనకొండ పారిశ్రామిక కేంద్రం గా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

## డిమాండ్ల పరిష్కారానికి విద్యుత్ మీటర్ రీడర్ల ధర్నా

విజయవాడ విద్యుత్ మీటర్స్ రీడర్స్ తమ డిమాండ్ల కోసం అందోళన తీవ్రతరం చేసారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ధర్నాకు దిగారు. ఛలో విజయవాడకి విద్యుత్ మీటర్స్ రీడర్స్ భారీగా వచ్చారు. గత ఐదు రోజులుగా రీడర్స్ దీక్షలు చేస్తున్నారు. విద్యుత్ మీటర్ రీడర్స్ కి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# బీ ఫామ్ కోసం బలప్రదర్శనలు

అదిలాబాద్, ఫిబ్రవరి 2,మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల కార్పొరేషన్‌తో పాటు బెల్లంపల్లి, చెన్నూర్, క్యాతనపల్లి, లక్షెట్టిపేట మున్సిపాలిటీల్లో ఎన్నికల వేడి రాజుకుంటుంది. స్క్రూటినీ అనంతరం అభ్యర్థులందరు వార్డుల వారిగా ఎంత మంది బరిలో ఉన్నారు, ఆయా పార్టీల నుంచి ఎంత మంది నామినేషన్లు వేశారు, ఇందులో పార్టీ బీ ఫారంలు సమర్పించిన వారెందరు, ఇంకా ఎంత మందికి బీ ఫారంలు కావాలి, వారంతా ఇండిపెండెంట్లుగా బరిలో నిలబడితే వార్డులో ఏ కాలనీలోని ఎన్ని ఓట్లు చీల్చుతారు, వారిని తమవైపు తిప్పుకుంటే ఎన్ని ఓట్లు ప్లస్ అవుతాయని అభ్యర్థు లు అంఛనాలు వేయడంతో పాటు సొంత పార్టీలో రెబల్ లను విత్ డ్రా చేయించేందుకు వారి దగ్గరి బంధువులతో, స్నేహితుల తో మంతనాలు జరుపుతున్నారు. ఇప్పటి వరకు పెట్టిన ఖర్చుతో పాటు అదనంగా ఫలానా వరకు ఇస్తామని రాయబారాలు నడిపిస్తున్నారు.

జిల్లాలో 149 డివిజన్, వార్డులకు 1599 నామినేషన్లు రాగా స్క్రూటినీ అనంతరం 1061 మంది అభ్యర్థులకు చెందిన 1177 నామినేషన్లు ఆమోదం పొందాయి. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లకు 362 మంది అభ్యర్థుల 386 నామినేషన్లు ఆమోదం పొందగా ఇందులో కాంగ్రెస్ నుంచి 77 నామినేషన్ లు, బీఆర్ఎస్ నుం చి 98, బీజేపీ నుంచి 108, ఆప్ నుంచి 10, బీఎస్పీ నుంచి తొమ్మిది, ఏఐఎంఐఎం నుంచి రెండు, సీపీఎం నుంచి రెండు, ఇతర పార్టీల నుంచి 44, ఇండిపెండెంట్ల 36 నామినేషన్లు ఆమోదం పొందాయి. అలాగే బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 34 వార్డులకు 252 మంది అభ్యర్థుల 279 నామినేషన్లు ఆమోదం పొందాయి. ఇం దులో కాంగ్రెస్ నుంచి 123 నామినేషన్ లు, బీఆర్ఎస్ నుంచి 81, బీజేపీ నుంచి 27, బీఎస్పీ నుంచి 10, ఏఐఎంఐఎం నుంచి రెం డు, ఇతర పార్టీల నుంచి 15, ఇండిపెండెంట్ల నుంచి 21 నామినేషన్లకు ఆమోదం లభించాయి, చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులకు 154 మంది అభ్యర్థుల 171 నామినేషన్లు ఆమో దం పొందగా కాంగ్రెస్ నుంచి 56, బీఆర్ఎస్ నుంచి 36, బీజేపీ నుంచి 24, ఆప్ నుంచి ఇద్దరు, బీఎస్పీ, సీపీఎంల నుంచి ఒక్కొక్కటి, ఇతర పార్టీల నుంచి 14, ఇండిపెండెంట్లు 37 నామినేషన్లు ఆమో దం పొందాయి.

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డుల కు 193 మంది అభ్యర్థుల 241 నామినేషన్లకు ఆమో దం లభిం చగా కాంగ్రెస్ నుంచి 88, బీఆర్ఎస్ నుంచి 53, బీజేపీ నుంచి 33, బీఎస్పీ నుంచి ముగ్గు రు, సీపీఎం నుంచి రెండు, ఇతర పార్టీల నుంచి 29, ఇండిపెండెంట్లు 33 నామినేషన్లు పొం దాయి. అలాగే లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులకు 100 మంది అభ్యర్థుల నుంచి 100 నామినేషన్లు ఆమో దం పొందగా కాంగ్రెస్ నుంచి 25, బీఆర్ఎస్ నుంచి 32, బీజేపీ నుంచి 25, బీఎస్పీ నుంచి మూడు, సీపీఎం నుంచి మూడు, ఇతర పార్టీల నుంచి నాలుగు, ఇండిపెండెంట్ల 8 నామినేషన్లకు ఆమోదం లభించాయి. జిల్లాలో ఇప్పటి వరకు మంచిర్యాల ఎంమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు మా త్రమే విలేకరుల సమావేశం పెట్టి మంచిర్యాల కార్పొరేషన్‌తో పాటు లక్షెట్టిపేట మున్సిపాలిటీల కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లను వెల్లడించారు. ఈ రెండింటిలో ప్రకటించిన అభ్యర్థులు మినహా మిగితా అందరు ఇండిపెండెంటుల కిందకే రానున్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీతో పాటు చెన్నూర్, క్యాతనపల్లి మున్సిపాలిటీల అభ్యర్థులను ఆయా నియోజక వర్గ ఎంఎల్ఏలు ఇంత వరకు ప్రకటించలేదు. మరో వైపు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు సైతం అభ్యర్థుల పేర్లు ప్రకటించాల్సి ఉంది. పార్టీలన్నింటికి బీ ఫారాలు సమర్పించేందుకు ఈ నెల మూడవ తేదీ వరకు సమ యం ఉండటంతో ఆయా పార్టీలు బీ ఫారా లు అందజేసిన అనంతరం పార్టీ గుర్తులపై పోటీలో ఎంత మంది ఉంటారో, స్వతంత్ర అభ్యర్థులుగా ఎంత మంది బరిలో ఉంటా రో తేలనుంది.

పార్టీ అదిష్టానం నుంచి ఖచ్చితమైన హామీ తీసుకున్నవారు ప్రచారం చేసుకుంటుండగా ఇప్పటికీ నామినేషన్లు వేసిన చాలా మంది అభ్యర్థులు ఎంఎల్ఏల, పార్టీ పెద్దల చుట్టూ తిరుగుతున్నారు.

డివిజన్, వార్డుల్లో పోటీలో ఉంటున్న అభ్యర్థులను విత్ డ్రా చేయించేందుకు కార్పొరేటర్, కౌన్సిలర్ పదవి ఆశిస్తున్న వారు శరవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. డివిజన్, వార్డు ఆధారంగా రేట్లు మాట్లాడుకుంటున్నారు. పార్టీలో సంవత్సరాల తరబడి పని చేసినా గుర్తింపునకు నోచుకొని, పార్టీ రెబల్ అభ్యర్థులను కలిసి విత్ డ్రా చేసుకొని మద్దతు ఇవ్వాలని, ఇప్ప టి వరకు పెట్టిన ఖర్చులతో పాటు గుడ్ విల్ గా ఇన్ని లక్షలు ఇస్తామని, సహకరించాలని వేడుకుంటున్నారు. వీరిలో ఎవరు విత్ డ్రా అవుతారో వేచి చూడాల్సిందే.

# మున్సిపల్ ఎన్నికల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి మంత్రి సురేఖ

భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ ఎన్నికల ఇంచార్జ్, మంత్రి కొండా సురేఖ కొత్తగూడెంలో ముఖ్యనాయకులతో సమావేశం అయ్యారు. మంత్రి సురేఖ మాట్లాడూ కాంగ్రెస్ అధికారం లోకి వొచ్చాక సిఎం రేవంత్ తెలంగాణా ను ప్రపంచ స్థాయి కోసం విజన్ 2047 రూపొందించాం. పంచాయతీ ఫలితాల స్పూర్తి తో మున్సిపల్ ఎన్నికల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి. సంక్షేమ పథకాలు ఇంటింటికి చేరాయి. .ముగ్గురు మంత్రుల నేతృత్వం లో ఉమ్మడి జిల్లా అభివృద్ధి జరుగుతోంది. ప్రభుత్వం ఉన్నా స్థానిక సంస్థల్లో అధిపత్యం ఉంటేనే కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా వుంటుంది. బి ఫామ్ ల కేటాయింపుల్లో స్వార్థం ఉండదు, పార్టీ ఆదేశాల మేరకు, సిఎం సూచనల మేరకు సర్వే ల ద్వారా అభ్యర్థుల ఎంపిక వుంటుందని అన్నారు.

బి ఫామ్ రాని వారు అసంతృప్తి ఉండకూడదు, పార్టీ ప్రయోజనాల కోసం ఐక్యంగా ఉండాలి. ఓట్ల కోసం వెళ్లినప్పుడు ప్రభుత్వ పథకాలు, ఇంటింటికి వివరించాలి. పొత్తులు, సహకారం కోసం సానుకూలంగా ఉన్నాం, మిత్రుల తో చర్చించేందుకు సిద్ధంగా వున్నామని అన్నారు.

# బీసీలను ఓడించేందుకు ఒక్కటైనా దొరలు

- బీసీ బిడ్డపై అవిశ్వాసం... దొర బిడ్డపై మమకారం
- మున్సిపల్ ఏఐఎఫ్ బీ అభ్యర్థులను గెలిపించాలి
- మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి కొలిపాక శ్రీనివాస్ ముదిరాజ్

పెద్దపల్లి బీసీలను ఓడించేందుకు దొరలు ఒక్కటిగా మారారని బీసీ బిడ్డపై అవిశ్వాసం పెట్టిన చరిత్ర ప్రస్తుత ఎమ్మెల్యేకు దక్కిందని అలాగే పెద్దపల్లికి చెందిన మరో దొర బిడ్డపై మాత్రం మమకారం ఎందుకు కని పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి





కొలిపాక శ్రీనివాస్ ముదిరాజ్ ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఆయన 26 వార్డులకు చెందిన పలువురు అభ్యర్థులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి మున్సిపాలిటీలో పోటీచేసే సింహం గుర్తు అభ్యర్థులను గెలిపించి మార్పుకు శ్రీకారం చుట్టాలని ఏఐఎఫ్‌బీ పార్టీ చైర్మెన్ అభ్యర్థి కొలిపాక శ్రీనివాస్ పట్టణ ప్రజలను అభ్యర్థించారు. హామీలు అమలు చేయలేని కాంగ్రెస్, ప్రశ్నించలేని బీఆర్ఎస్, బీజేపీలను ఓడించి బుద్ధిచెప్పాలన్నారు. మరోసా రి మోసపోతే గోసపడుతామ ని, ప్రజల పక్షాన ప్రశ్నించే సింహం గుర్తు అభ్యర్థులను గెలిపించాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు కలిసిపోయి పట్టణ ప్రజలను మోసం చేస్తున్నాయ న్నారు. అధికార పార్టీ చేసే తప్పిదాలను ప్రశ్నించాల్సిన ప్రతిపక్ష పార్టీ అధికార పార్టీతో ములాఖాత్ విషయం ప్రజలు గుర్తించాలన్నారు. దీనికి నిదర్శనం సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మెన్ పై అవిశ్వాస తీర్మాణం పెట్టి బీసీ బిడ్డను గద్దె దించారని, కానీ పెద్దపల్లి మున్సిపాలిటీలో మాత్రం మాజీ ఎమ్మెల్యే కో డలు పై ఎందుకు అవిశ్వాసం పెట్టలేదో చెప్పాలన్నారు. వారిందరూ కలిసిపోయారు కాబట్టే ఓసీ బిడ్డపై అవిశ్వాసం పెట్టలేదన్నా విషయం పట్టణ ప్రజలు గమనించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే వైఫల్యాలతో విసుగుచెందిన ప్రజలు, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే రెండు సంవత్సరాల్లో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. మోసాలు, అబద్దాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బుద్దిచెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే నిధులు వస్తాయనుకోవద్దని, కేంద్రం, రాష్ట్రం నుంచి వచ్చే నిధులు నేరుగా మున్సిపాలిటీ కి వస్తాయన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. అ లాగే తెలంగాణ జాగృతి అధ్యక్షులు కవితతో పట్టణంలో భారీ బహిరంగ సభ నిర్వహించి తాము చేయబోయే అభివృద్ధి పనులను ప్రకటిస్తామని తెలిపారు. కాంగ్రెస్ లో మున్సిపల్ అభ్యర్థులు బీ ఆర్ ఎస్ కు చెందిన వారేనని, మళ్ళీ వారిని గెలిపిస్తే దోపిడీకి హద్దులు లేకుండా పోతాయని పేర్కొన్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, తెలంగాణ జాగృతి తరుపున పెద్దపల్లి పట్టణంలోని పలు వార్డుల అభ్యర్థులను ప్రకటించగా, 2వ వార్డు నుంచి ములుమూరి కావేరి, 3 నుంచి కుక్క మల్లేష్, 4నుంచి ఆడెపు సుధాకర్, 5నుంచి తాండ్ర మహేష్, 6నుంచి కుంభం సునీతసంతోష్, 8నుంచి కుక్క భారతి, 10నుంచి పెర్కపూజ భాస్కర్, 12నుంచి గులం ఖాజాపాష, 13 నుంచి ఎస్ తిరుమలరావు,14 నుంచి సాబీర్ ఖాన్, 15 నుంచి కొలిపాక శ్రీనివాస్, 17 నుంచి కొలిపాక చిరంజీవి, 18నుంచి కొలిపాక సంపత్, 20నుంచి గణపతి నిర్మల, 21 నుంచి బండారి సుమన్‌గౌడ్, 23 నుంచి జడల సురేందర్, 25 నుంచి కుక్క జ్యోతి, 26 కుక్క శ్రావణ్,29 నుంచి వేల్పుల రజిత, 30 నుంచి ముక్సదా బేగం, 32 మర్రిపల్లె జలజసతీష్, 33 నుంచి గంగుల సంధ్యారాణి, 34 నుంచి జమీరుద్దీన్,, 36 నుంచి రయిసా తబస్సుమ్‌లకు టికెట్ కేటాయిస్తూ చైర్మెన్ అభ్యర్థి కొలిపాక శ్రీనివాస్ ప్రకటించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభీష్టం మేరకు నిజాయితీగా ప్రజా సేవ చేస్తున్నా

## – అభివృద్ధిని చూసి ఓటేయండి

## పెద్దపల్లి శాసనసభ్యులు విజయరమణ రావు



పెద్దపల్లి ప్రజాభీష్టం మేరకు నిజాయితీ గా ప్రజా సేవ చేస్తున్నాననిఅభివృద్ధిని చూసి ఓటేయా లని పెద్దపల్లి శాసనసభ్యులు విజయరమణ రావు అన్నా రు. పెద్దపల్లి మున్సిపల్ పరిధి లోని 36 వార్డులకు గాను 33 వార్డులకు చెందిన కాంగ్రెస్ అ భ్యర్థులను ఎమ్మెల్యే విజయ రమణ రావు ప్రకటించారు. అనంతరం రంగంపల్లి 10వ వార్డు మాజీ కౌన్సిలర్ గాదె మాధవి కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే విజయరమ ణ రావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల వివరాలు పూరేళ్ళ శైలజ (1 వార్డు), లక్ష్మి పస్తం (2 వార్డు), మొలగూరి కమల్ (3 వార్డు), కొమ్ము సుధాకర్ (4 వార్డు), గుజ్జుల కుమార స్వామి (5 వార్డు), కట్ట పద్మా వతి (6 వార్డు), ఈర్ల స్వరూప (7 వార్డు), ఎరుకల కల్పన (8 వార్డు), అక్కెపల్లి సుజాత (10 వార్డు), అనూష పూదరి (11 వార్డు), దొడ్డుపల్లి జగదీష్ (12 వార్డు), పాగల శ్రీకాంత్ (13 వార్డు), మహమ్మద్ అస్లాని పర్వేజ్ (14 వార్డు), నేతెట్ల కొమురయ్య (15 వార్డు), నాంసాని శ్రీనివాస్ (16 వార్డు), తోట ఫణీందర్ (17 వార్డు), భూతగడ్డ సంపత్ (18 వార్డు), నల్లాల పద్మ (19 వార్డు), బండి రమ్యకృష్ణ (20) వార్డు), నూగిళ్ళ మల్లయ్య (21వార్డు), ఉప్పు స్వరూప (22 వార్డు), తాడూరి శ్రీమన్నారాయణ (23 వార్డు), కొట్టే స్వరూప (24 వార్డు), సూది మల్ల అమ్రేష్ (26 వార్డు), ఉను కొండ సరస్వతి (27 వార్డు), తూముల లత (28 వార్డు), ఇల్లందుల రజని (29 వార్డు), సాజిదాబాను (30 వార్డు), మంథని నర్సింగ్ (31 వార్డు), తిర్రి శ్రీలత (32 వార్డు)బూతగడ్డ స్వప్న (33 వార్డు), దేవనంది రమాదేవి (35 వార్డు), ముస్కాన్ నాజ్ నయ్యర్ (36 వార్డు) ప్రకటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలిచిన రెండేళ్ల పాలనలో రూ.40 కోట్లతో సీసీ రోడ్లు, మురికి కాలువలు, మౌళిక వసతుల కల్పన పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో పాత వాటర్ ట్యాంక్ స్థానంలో కొత్తగా వాటర్ ట్యాంక్, చందపల్లి డబుల్ బెడ్ రూం ప్రాంతంలో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేస్తున్నామ ని తెలిపారు. రూ 62.50 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామని, మరో 15 కోట్ల నిధులు మంజూరు చేయించానని తెలిపారు. వీ టిని ప్రజల అవసరాలను గుర్తించి నిధులు కేటాయిస్తాన ని పేర్కొన్నారు. పెద్దపల్లి పట్టణ అభివృద్ధికి రూ 77.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. ఇం టిగ్రేటెడ్ మార్కెట్ ఆధునీకర ణ కోసం రూ 7.5 కోట్లు కేటాయించినట్లు వివరించా రు. క్రీడల కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటు న్నానని ఇందులో భాగంగా వ్యవసా య మార్కెట్ ఆవరణలో ఇండోర్ బ్యాడ్మింటన్ షటిల్ స్టేడియం ఏర్పాటుకు డిఎం ఎఫ్ టీ నుండి రూ 2.5 కోట్లు కేటా యించి పనులు చేపట్టిన ట్లు చెప్పారు. రూ.80 కోట్లతో పెద్దపల్లి బైపాస్ రోడ్డు టెండర్లు పూర్తి చేశామని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. బైపాస్ నిర్మాణా నికి మరో 70 కోట్లు అవస రమని, నిధులు మంజూరి చేయిస్తానని తెలిపారు. ప్రభు త్వ ఆసుపత్రిని విస్తరించి ఆధునీకరించామని చెప్పారు. 50 నుండి 100 పడకల విస్తరించి ఏంఆర్ఐ, సిటీ స్కాన్ లు ఏర్పాటుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. బస్ డిపోకు 4ఎకరాల 32 గుంటలు కేటాయించి పనులు శరవేగం గా కొనసాగుతున్నా యని తెలిపారు. రాఘ వాపూర్ లో కోర్టు భవనానికి 10 ఎకరాలు కేటాయించి రూ. 80 కోట్లు మంజూరు చేశామని తెలిపా రు. పట్టణంలోని శివారు ప్రాం తాల్లో అభివృద్ధికి ప్రణాళిక ప్రకారం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అధికార పార్టీ అభ్యర్థులనే కౌన్సిలర్లుగా గెలిపిస్తే అభివృద్ధి సాధ్యమ న్నారు. అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్ అభ్యర్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ మున్సిపాలిటీ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా మంత్రి పొన్నంఎన్నికల ప్రచారం



హుస్నాబాద్ మొదటి వార్డులో ని కేవీ కాలని లోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సాగర్ కి మద్దతుగా మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం డోర్ టూ డోర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఉన్నికల ప్రచారంలో గడపగడప కి వెళ్తూ మహిళలు, చిన్నారులను , వృద్ధులను ఆత్మీయంగా పలకరిస్తూ ప్రజా పాలన ప్రభుత్వం లో చేపట్టిన సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించారు.

హుస్నాబాద్ ను రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉంచేలా అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయని.. హుస్నాబాద్ మున్సిపాలిటీ లో సీసీ రోడ్లు , డ్రైనేజీ నిర్మాణాలు , తాగునీటి, వ్యవస్థ ,ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి,కొత్త చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు, అర్బన్ ఫారెస్ట్ పార్క్ తను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ప్రభుత్వానికి అండగా ఉండాలని హుస్నాబాద్ లో ఉన్న 20 వార్డులను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే తనకి మరింత మద్దతు ఉంటుందని అన్నారు.

ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇళ్లు ,సన్న బియ్యం,రేషన్ కార్డులు పంపిణీ,ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్, సన్న వడ్లు కి 500 బోనస్ , రైతు భరోసా, రైతు రుణమాఫీ,మహిళలకు వడ్డీలేని రుణాలు, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యం తో ప్రత్యేక పథకాల అమలు ,మహిళలకు ఇందిరమ్మ చీరలు ,ఉద్యోగాల భర్తీ తదితర పథకాలను వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఇంటింట ప్రచారం నిర్వహించారు.

# సిపిఆర్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి; కాకుమాను జ్యోతి



కాచిగూడ ఫిబ్రవరి 2 ;మన ఆరోగ్యం మన చేతుల్లోనేఉన్నదని టాటా హెయిల్ మణి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు, ఫోస్టినా ఫౌండేషన్ జాతీయ చైర్ పర్సన్ కాకుమాను లూర్దు జ్యోతి అన్నారు.గాంధీ మెడికల్ కాలేజీ ఆవరణలో అలుమ్ని అసోసియేషన్, జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల ఖూ= శిక్షణ కార్యక్రమానికి ఆమె విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్తీ ఆహారం, కలుషితమైన వాతావరణం వలన కూడా వివిధ రకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు. మన ముందు జనరేషన్ వారు ఎలాంటి కల్తీ లేని ఆహారం తీసుకోవడం వలన ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని, ఎక్కువకాలం పాటు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా జీవించారని వివరించారు. ప్రస్తుతం మనం కల్తీ ఆహారం తినడం, ఆరోగ్య పరంగా తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన పలు రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నామని చెప్పారు. ప్రస్తుత కాలంలో ప్రధానంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడే వారి సంఖ్య గణనీయంగా పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు.గుండెపోటుకు గురైన వారికి తక్షణమే ఖూ= చేయడం వలన మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించే వరకు బ్రతికించే అవకాశాలు ఉంటాయని అన్నారు. ఖూ= పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఖూ= పై ఉచిత శిక్షణ నిర్వహించడం పట్ల నిర్వాహకులను ఆమె అభినందించారు.

# కూచిపూడి నృత్యం భారతీయ సంస్కృతికి చిహ్నం..

## ”ఖని “ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్యామ్ కుమార్ గౌడ్......

## నాట్య మయూరి ఉజ్వల కు సన్మానం.



గోదావరిఖని : కూచిపూడి నృత్యం భారతీయ సంస్కృతికి నిజంగా ఒక చిహ్నం లాంటిదని గోదావరిఖని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్యామ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక కోదండ రామాలయం ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమం సందర్భంగా జనవరి 26 గణతంత్ర దినోత్సవం వేడుకల్లో కూచిపూడి నృత్య ప్రదర్శన చేసిన నృత్య ఖని వ్యవస్థాపకురాలు గుమ్మడి ఉజ్వల ను గడ్డం శ్యామ్ కుమార్ సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో ప్రతి సంవత్సరం నిర్వహించే రిపబ్లిక్ డే సందర్భంగా కూచిపూడి నృత్య ప్రదర్శనకు తెలంగాణ రాష్ట్రం నుండి 30 మంది నృత్య కళాకారులు ఎంపిక చేయగా పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఉజ్వల ఆ ప్రదర్శనకు ఎంపిక కావడం, ఆ ప్రదర్శన విజయవంతమై ప్రముఖుల మన్ననలు పొందడం గర్వకారణం అన్నారు.సంప్రదాయ కళలను మరచిపోతున్న ఈరోజుల్లో కూచిపూడి నృత్యన్నీ మరింత విస్తరింపజేసేందుకు ఉజ్వల చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కూచిపూడి నృత్యంలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేసిన ఉజ్వల గడిచిన రెండు దశాబ్దాలుగా పారిశ్రామిక ప్రాంతంలో నృత్య ఖని ని పేరుతో వందలాది మందికి కూచిపూడి నృత్యం లో శిక్షణ ఇస్తున్నారని, నృత్య ప్రదర్శన లో ఉజ్వల ది అద్భుతమైన అభినయం అని అయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉజ్వల మరిన్ని ప్రదర్శనలు ఇచ్చి రాష్ట్రనికి, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని అయన ఆకాంక్షించారు. ఉజ్వలకు ఎల్లవేళల సహకారంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి పెద్దలు, నిర్మలాదేవి, తగరపు శంకర్, రమేష్ తో పాటు విద్యార్థినిలు పాల్గొన్నారు

# బూటకపు హామీలు – మోసపూరిత వాగ్దానాలు

## కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై బిజెపి చార్జ్‌షీట్ విడుదల



హైదరాబాద్ ఫిబ్రవరి 2 ;మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ఘోర వైఫల్యాలు, అమలు కాని హామీలు, విస్తరిస్తున్న అవినీతి అరాచకాలతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ పేర్కొంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ, ప్రజలకు చేసిన మోసాలను ఎండగడుతూ "బూటకపు హామీలు – మోసపూరిత వాగ్దానాలు" పేరిట భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ చార్జ్‌షీట్‌ను విడుదల చేసింది. ఈ చార్జ్‌షీట్‌ను బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు , మహారాష్ట్ర మంత్రి, తెలంగాణ మున్సిపల్ ఒ కార్పొరేషన్ ఎన్నికల ఇంచార్జ్ అశిష్ షెలార్ పార్టీ సీనియర్ నాయకుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ ఒ కార్పొరేషన్ ఎన్నికల కో-- ఇంచార్జులు అశోక్ పర్ణామి , ఎంపీ ఈటల రాజేందర్ , పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎన్. గౌతం రావు , రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ ఎన్.వి. సుభాష్ , సీనియర్ నాయకులు జి. వెంకట్ రెడ్డి , సునీత , విఠల్ , కప్పర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి తీవ్ర అన్యాయం జరిగింది: భట్టి విక్రమార్క

హైదరాబాద్ రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు శూన్యమని విమర్శ.రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు శూన్యమని విమర్శఫార్మా, ఎలక్ట్రానిక్స్, టూరిజం వంటి కీలక రంగాల్లోనూ మొండిచెయ్యి.రాష్ట్ర విజ్ఞప్తులను కేంద్రం పట్టించుకోలేదని భట్టి విక్రమార్క ఆవేదన.నిధుల కోసం ఎంపీలంతా ఏకతాటిపైకి రావాలని పిలుపుకేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి తీవ్ర అన్యాయం జరిగిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన రూ.53.47 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌లో రాష్ట్రానికి ఆశించిన కేటాయింపులు ఏవీ దక్కలేదని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎంపీలు పలుమార్లు ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రిని కలిసి రాష్ట్ర ప్రయోజనాల కోసం విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసిందని భట్టి మీడియాకు తెలిపారు. మూసీ నది ప్రక్షాళన, రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ నగర అభివృద్ధి, మెట్రో రైల్ విస్తరణ వంటి కీలక ప్రాజెక్టులకు నిధులు వస్తాయని ఆశించామని, కానీ కేంద్రం మొండిచెయ్యి చూపిందని అన్నారు.ప్రపంచవ్యాప్తంగా హైదరాబాద్ ఫార్మా హబ్‌గా గుర్తింపు పొందిందని, కరోనా సమయంలో భారత్ బయోటెక్ ప్రపంచానికే వ్యాక్సిన్లు అందించిందని గుర్తుచేశారు. అయినా ఫార్మా హబ్ కార్యక్రమాల్లో తెలంగాణకు చోటు దక్కకపోవడం దారుణమన్నారు. ఎలక్ట్రానిక్స్ రంగానికి బడ్జెట్‌లో రూ.40,000 కోట్లు కేటాయించినా, ఇప్పటికే అభివృద్ధి చెందిన హైదరాబాద్‌కు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఆడియో–వీడియో, గేమింగ్, కామిక్స్‌కు కేంద్రమైన హైదరాబాద్‌ను కాదని, 'ఆరెంజ్ ఎకానమీ' కార్యకలాపాలను ముంబైకి తరలించడం అన్యాయమని అన్నారు.అంతేకాకుండా, టూరిజం, మెడికల్ హబ్, రేర్ ఎర్త్ మినరల్స్ వంటి రంగాల్లోనూ తెలంగాణను విస్మరించారని ఆరోపించారు. సెమీకండక్టర్ యూనిట్ కోసం సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రధానిని కోరినా, ఆ ప్రాజెక్టులను ఇతర రాష్ట్రాలకు కేటాయించి తెలంగాణపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపిందని భట్టి విమర్శించారు.తమకు 4 శాతం ఆర్థిక లోటుకు అనుమతివ్వాలని కోరితే నిరాకరించిన కేంద్రం, తనకు తానుగా 4.3 శాతం ఆర్థిక లోటు నిర్దేశించుకుందని దుయ్యబట్టారు. తెలంగాణ ఈ దేశంలో అంతర్భాగం కాదా? అని ఆయన ప్రశ్నించారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ ఎంపీలందరూ పార్టీలకు అతీతంగా ఏకమై, నిధుల కేటాయింపు కోసం ప్రధాని, ఆర్థిక మంత్రిపై ఒత్తిడి తేవాలని భట్టి విజ్ఞప్తి చేశారు.

# కోదాడ మున్సిపాలిటీ పైకాంగ్రెస్ జెండా ఎగరాలి

## రికార్డు మెజారిటీ తో 31వ వార్డు కౌన్సిలర్ కుసుమ బాబు ను గెలిపించాలీ.

సూర్యాపేట కోదాడ మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండా ఎగరాలనీ కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ అన్నారు. సోమ వారం కోదాడ మున్సిపల్ పరిధిలోని 31వ వార్డు లో మాజీ సర్పంచ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎర్నేని వెంకట్ రత్నం బాబు, స్థానిక వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కుసుమ వెంకట్ రత్నం బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయం ప్రారంభించి మాట్లాడారు. జరగబోయే 35 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయ ఢంకా మోగించాలన్నారు. కార్యకర్తలు పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు.స్థానిక 31వ వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు ను రికార్డు మెజార్టీ తో గెలిపించాలన్నారు.పార్టీ అభ్యర్థుల గెలుపు కు కృషి చేసే వారందరికీ తప్పక గుర్తిస్తాం అన్నారు. మంత్రి ఉత్తమ్ గాని, తాను కానీ పార్టీ గెలుపు కోసం కృషి చేసే ప్రతి నాయకుడిని, కార్యకర్త ను అన్యాయం చేయం అన్నారు.పరస్పర సహకారం సమన్వయం తో పని చేయాలనీ సూచించారు.మంత్రి ఉత్తమ్ సహకారం తో కోదాడ ను అభివృద్ధి లో అగ్ర స్థానంలో నిలుపుతా అన్నారు. ఇప్పటికే వేల కోట్ల రూపాయల నిధులు తెచ్చా అన్నారు.కోదాడ మున్సిపాలిటీ 35 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి మంత్రి ఉత్తమ్ కు కానుకగా ఇవ్వాలన్నారు. ప్రత్యర్థులు ప్రలోభాలకు గానీ మోస పూరిత, అసత్య ప్రచారాలు తిప్పి కొట్టాలన్నారు. 31వ వార్డు లో పరిపాలన అనుభవం, కష్ట పడే మనస్తత్వం ఉన్న ఎర్నేని వెంకట్ రత్నం బాబు సతీమణి కుసుమ బాబు ను గెలిపించాలన్నారు. బరిలో ఉన్న అభ్యర్థులు వార్డు లోని నాయకులను కార్యకర్తల్ని సమన్వయం చేసుకొని ప్రతి ఓటర్ కలిసి ఓటు అభ్యర్థించాలన్నారు.ప్రతి ఓటు విలువైనదే అన్నారు. ఎన్నికల పోటీలో నిర్లక్ష్యం వహించ వద్దన్నారు. ఎన్నికల ప్రచారం లో ప్రతిఒక్కరు దూసుక వెళ్లాలన్నారు. మాజీ సర్పంచ్ యెర్నేని వెంకట్ రత్నం బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ అభ్యర్థి కుసుమ బాబు, పట్టణ నాయకులు, స్థానిక వార్డు నాయకులు, కార్య కర్తలు ప్రముకులు ఉన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కు మద్దతుగా జోగిపేటలో భారీ ర్యాలీ

### ఫోన్ టాపింగ్ కేసులో సీట్ నోటీసులు
### బిఆర్ఎస్ మాజీ మంత్రి కేటీఆర్ పిలుపుమేరకు
### చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో
### జోగిపేటలో నల్ల బ్యాడ్జీలు ధరించి బిఆర్ఎస్ శ్రేణులు బైకు ర్యాలీ



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 2 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** తెలంగాణ తొలి మాజీ మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు, ఫోన్ టాపింగ్ కేసుకు సంబంధించి సీట్ నోటీసులు జారీ చేయడంతో, బిఆర్ఎస్ పార్టీ ఆందోల్ లో అగ్రహావేషాలు వెళ్ళువేత్తయి, మాజీ మంత్రి కేటీఆర్, పిలుపుమేరకు, అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి కిరణ్, ఆధ్వర్యంలో జోగిపేటలో గౌని చౌరస్తా నుండి, సుమారు 300 మంది బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి, జోగిపేట పట్టణంలో పెద్ద ఎత్తున పట్టణ వీధుల గుండ్ల ర్యాలీ నిర్వహించారు, ప్రధాన వీధుల గుండ జరిగిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వ్యతిరేకంగా నినాదాలు చేశారు ఈ సందర్భంగా చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, కక్ష సాధింపు రాజకీయాలు చేస్తుందని మండిపడ్డారు, తెలంగాణ రాష్ట్ర సాధకుడైన కేసీఆర్ ను, విచారణ పేరుతో వేధించడం అప్రజా స్వామికమని ఖండించారు, ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి , ఇటువంటి కుట్రలకు తెర లేపిందని, వీరికి ప్రజలు



# వేములవాడ మున్సిపల్ లో 28 వార్డుల బీజేపీ అభ్యర్థుల బిబి ఫారం లు సమర్పణ.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో బిజెపి పార్టీ తరఫున మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేస్తున్న 28 వార్డుల అభ్యర్థుల బి ఫారాలను వేములవాడ పట్టణ బిజెపి అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాపరామకృష్ణ తో కలిసి వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్లకు అధికారికంగా సోమవారం రోజున అందజేశారు. ఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో అన్ని వార్డులలో బిజెపి బలంగా పోటీ చేస్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. వేములవాడ పట్టణ ప్రజల ఆశీర్వాదంతో మున్సిపల్ ఎన్నికలలో ఘనవిజయం సాధిస్తామని ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

# ఆశీర్వదించండి వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా...




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 2(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సదాశివపేట/2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని 14వ వార్డు నుంచి బిజెపి తరపున బరిలో కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఉల్లిగడ్డల ఉమారాణి నాగరాజు అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా అని ఓటర్లను విజ్ఞప్తి చేశారు,ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడుతూ అవకాశం ఇస్తే వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తాను,అంతేకాకుండా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే నా లక్ష్యం అని ఆమె తెలిపారు,ముఖ్యంగా వార్డులో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా వార్డు అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు,మున్సిపల్ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు కమలం పువ్వు గుర్తుకి వేసి తనకు మద్దతు ఇచ్చి ఆశీర్వదించాలని ఆమె కోరారు.

# చదువుకో తెలంగాణ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి దామోదర రాజనర్సింహ....



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 2(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన మిషన్ టెన్త్ క్లాస్ లో భాగంగా పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్ర,జిల్లా,తాలూకా,మండల స్థాయిల్లో విభాగాల వారీగా ఉత్తమ ప్రతిభ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 2.2 కోట్ల నగదు బహుమతి అందించేందుకుగాను నిర్వహిస్తున్న చదువుకో తెలంగాణ కార్యక్రమ వాల్ పోస్టర్ తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య శాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదివారం సాయంత్రం సంగారెడ్డిలో ఆవిష్కరించారు,ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పెద్ద మొత్తంలో ప్రోత్సాహకం అందించడం అభినందనీయమన్నారు. అంతేకాకుండా శ్రీరామ్ గ్రూప్ ఫౌండర్ త్యాగరాజన్ బలహీనవర్గాల ఆర్థిక అభివృద్ధికి ఆర్థిక రంగంలో ఎనలేని సేవలు అందించిన విలువలతో కూడిన వ్యక్తి అని అందుకు అనుగుణంగా గ్రామస్థాయిలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఆదిశగా నగదు ప్రోత్సాఖాలు అందించడం మంచి పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంగారెడ్డి రీజినల్ మేనేజర్ విజయకుమార్, నారాయణఖేడ్ యూనిట్ మేనేజర్ పూర్ణచందర్, డెవలప్మెంట్ ఆఫీసర్ వేల్పుల ప్రవీణ్, సేల్స్ ఆఫీసర్లు మతిన్,షఫీ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భాగ్యలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమంలో పాల్గొన్న మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్, సోమవారంనాడు చార్మినార్‌లోని ప్రసిద్ధ శ్రీ భాగ్యలక్ష్మీ ఆలయంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించబడింది.

ఈ పూజ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మరియు ఎమ్మెల్సీ ఎన్. రామచంద్ర రావు , అలాగే మహారాష్ట్ర ప్రభుత్వ ఐటీ శాఖ మంత్రి ఆశిష్ షెలార్ గారు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షులు టి. ఉమా మహేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ కె. సురేందర్ , జిల్లా కార్యదర్శి శ్రీ నటరాజ్ నందారి , జిల్లా కార్యదర్శి రమేష్ లాల్ యాదవ్ , బీజేవైఎం గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కునాల్ రావు తదితర నాయకులు పాల్గొన్నారు. దేశ ప్రజల శాంతి, సమృద్ధి, సంక్షేమం కోసం దేవుని ఆశీస్సులు కోరుతూ పూజలు నిర్వహించబడినట్లు నాయకులు తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు బీజేపీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



# చదువుకో తెలంగాణ పోస్టర్ ఆవిష్కరించిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం




చొప్పదండి ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేపట్టిన 'మిషన్ 10వ తరగతి' అను పోస్టర్‌ను కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన "మిషన్ 10వ తరగతి" కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని,ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు గొప్ప ప్రోత్సాహమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ.2.2 కోట్ల నగదు బహుమతులను విద్యార్థులకు అందజేయనున్నారు. మొట్ట మొదటి స్థానాన్ని పొందిన విద్యార్థికి రూ.5 లక్షలు,రెండవ స్థానానికి రూ.3 లక్షలు,ప్రతి జిల్లా టాపర్‌కు రూ.2 లక్షలు,119 అసెంబ్లీ ప్రతి నియోజకవర్గ టాపర్ కు రూ.1 లక్ష చొప్పున,అలాగే 612 మండలాలలో టాపర్లకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.ఈ పథకం తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో 2026 మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు.ప్రభుత్వంతో పాటు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి సంస్థలు విద్యారంగానికి తోడ్పడటం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ గంగాధర బ్రాంచ్ మేనేజర్ వేములవాడ అజయ్, ,సిబ్బంది పోరండ్ల భూపతి, డీవో మంత్రి మహేందర్,గోపాలరావు పేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యనారాయణ,కాంగ్రెస్ నాయకులు దోర్నాల శ్రీనివాస్ రెడ్డి,సువీన్ యాదవ్, ఆంజనేయులు,మారుతి తదితరులు పాల్గొన్నారు.

## వి.ఆర్.4 సహాయోగ్ ట్రస్టుచే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతము









**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 2 ఫిబ్రవరి 2026**మహా మాఘిగా ప్రసిద్ధి గాంచిన మాఘ మాసంలోనీ పౌర్ణమి రోజు విష్ణుమూర్తిని పూజించడం ఆనవాయితీ కాగా లోక కళ్యాణార్థం వి.ఆర్.4 సహయోగ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సామూహిక వీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రతము వేద పండితులు మండవ మధు సుధన శర్మ, మండవ భరద్వాజ్ శర్మలచే శ్రావనాణాంధకర వేద మంత్రోచ్చనాల మధ్య శాస్త్రోక్తంగా, సాంప్రదాయ బద్ధకముగా నెక్నంపూర్ మున్సిపల్ డివిజన్ అల్కాపూర్ లోని జయశంకర్ పార్కులో అనూహ్య పద్ధతిలో, అతి బ్రాహ్మాండముగా, కన్నుల పండుగగా, చూడ ముచ్చటగా జరిగినదని మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్ రావు తెలియ పరచారు. ఇట్టి శుభకర సమయములో 100 జంటలు వారి బందు మిత్రులతో పాల్గొనడం జరిగినదని, ఆధ్యాత్మిక శోభను సంతరించుకొన్న ఇట్టి పూజా కార్యక్రమంలో 300 మంది భక్తులు పాల్గొని సంపూర్ణముగా తృప్తినీ పొంది కార్య క్రమాన్ని జయప్రదం కావించారు, ఇట్టి పూజా కార్యక్రమంను వీలైతే ప్రతీ నెలా జరిపితే బాగుంటుందని చాలా మంది భక్తులు తమ అభిప్రాయంను వెళ్ళ బుచ్చారనీ, అందుకు ప్రతి స్పందిస్తూ ట్రస్టు పాలకవర్గ సమావేశములో నిర్ణయం తీసుకొంటామని కార్యక్రమములో హాజరైన సభ్యులు అందె లక్ష్మణ్ రావు, దిలీప్ కక్కడ్, ధర్మపురి సుమనళిని, హరి హరనాథ్ రెడ్డి, మోహన్ కుమార్, నరోత్తమ్ సింగ్, ఠాకూర్ ఉమేష్ సింగ్, తమ్మిశెట్టి రాజశేఖర్ తది తరులు తెలియ జేసినారు.

## సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థుల బి ఫారాలు అందజేత....



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 2(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 మున్సిపాలిటీలలో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థుల బి ఫారాలను పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,మంత్రి అజారుద్దీన్ సమక్షంలో డిసిసి అధ్యక్షురాలు టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి,జహీరాబాద్ నారాయణ్ ఖేడ్ మున్సిపాలిటీలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులకు సంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి బి ఫారాలు అందజేశారు,అభ్యర్థులు తమ బిఫారాలు సమర్పించేందుకు మంగళవారం చివరి రోజు కావడంతో సోమవారం కాంగ్రెస్ అభ్యర్థులకు బిఫారాలు పంపిణీ చేశారు,పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,మంత్రి అజారుద్దీన్ సమక్షంలో నిర్మలా జగ్గారెడ్డి నారాయణ్ ఖేడ్,జహీరాబాద్ మున్సిపాలిటీ బిఫారాలు అందజేశారు,నారాయణ్ ఖేడ్ మున్సిపాలిటీకి సంబంధించిన బిఫారాలను ఎమ్మెల్యే సంజీవ రెడ్డి,జహీరాబాద్ ఎంపి సురేష్ శెట్కార్ లకు డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి అందజేశారు,జహీరాబాద్ బి ఫారాలను నియోజవర్గ ఇంచార్జ్ చంద్రశేఖర్,సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి.లకు ఆమె అందించారు.

## సంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు

### జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

### హెల్ప్ డెస్క్ ఫోన్ నంబర్ :81253 52721



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 2(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను స్వీకరించేందుకు సంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు,మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు,సందేహాల నివృత్తి కోసం హెల్ప్ డెస్క్ ఫోన్ నంబర్

81253 52721 కు కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు,ఈ హెల్ప్ డెస్క్ మున్సిపల్ ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రభుత్వ సెలవు రోజులతో సహా 24 గంటలు, మూడు షిఫ్టులలో సిబ్బంది విధులు నిర్వహిస్తూ నిరంతరంగా పనిచేస్తుందని పేర్కొన్నారు,హెల్ప్ డెస్క్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి పరిశీలించి, ఎన్నికల నిబంధనలు మరియు మార్గదర్శకాల మేరకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు.

## 4.13 లక్షల ఇందిరమ్మ ఇళ్లకు పీఎంఏవై నిధులు

హైదరాబాద్ తెలంగాణ 4.13 లక్షల ఇందిరమ్మ ఇళ్లకు పీఎంఏవై నిధులురాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం వాటా అందనుంది. ఒక్కో ఇంటికి పట్టణాల్లో అయితే రూ.1.50 లక్షలు, గ్రామాల్లో రూ.72 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం ఈ ఇళ్ల కోసం అందించనుంది. పట్టణాలు, గ్రామాల్లో కలిపి 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 13 లక్షల ఇళ్లకు కేంద్రం వాటా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేయగా సుమారు 4.13 లక్షల ఇళ్లకు ప్రధానమంత్రి ఆవాస్ కింద నిధులు అందే అవకాశాలున్నాయి.

## అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా 27 వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి.. సురేఖ ధనురాజ్ దేశ్ పాండే..



**జహీరాబాద్ ప్రతినిధి ఫిబ్రవరి 2(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**జహీరాబాద్/మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని 27వ వార్డు సుభాష్ గంజ్ - రాచన్న పేట్ నుంచి బిజెపి బరిలో కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సురేఖ ధనురాజ్ దేశ్ పాండే కు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా అని ఓటర్లను విజ్ఞప్తి చేశారు,పట్టణ మున్సిపల్ ఎలక్షన్ లో భాగంగా ఆమె మాట్లాడుతూ, ఒక్క అవకాశం ఇస్తే వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తాను. అంతేకాకుండా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే నా లక్ష్యం అని ఆమె తెలిపారు,ముఖ్యంగా వార్డులో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చేందేలా వార్డు అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు వేసి తనకు మద్దతు ఇచ్చి ఆశీర్వదించాలని ఆమె కోరారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి గ్రీవెన్స్ డే... ఫిర్యాదులు స్వీకరించిన అదనపు ఎస్పీ:రఘునందన్ రావ్




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 2(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం అందించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అదనపు ఎస్పీ రఘునందన్ రావ్ తెలిపారు,ఈ సందర్భంగా సమస్యలతో జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు,ఫిర్యాదులకు సంబంధించిన అంశాలపై సంబంధిత ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకుని, ప్రతి కేసును నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు పూర్తి న్యాయం చేకూర్చాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు,జిల్లా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలకు పరిష్కారం లభించని సందర్భాల్లో ఎలాంటి భయాలు లేదా ఒత్తిళ్లకు లోనుకాకుండా జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు,ప్రజావాణి ద్వారా స్వీకరించిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ త్వరితగతిన పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

## అంగన్వాడీలో పూర్వబాల్య సంరక్షణ విద్య దినోత్సవం...




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 2(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సదాశివపేట/మండల పరిధిలో మేలిగిరిపేట అంగన్వాడి కేంద్రంలో సోమవారం నాడు పూర్వ బాల్య సంరక్షణ విద్యా దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ షాబుద్దీన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు,ఈ సందర్భంగా సర్పంచ్ షాబుద్దీన్ మాట్లాడుతూ పిల్లల శారీరక మానసిక,సామాజిక వికాసం పై అలాగే తల్లిదండ్రుల పాత్ర గురించి తెలియజేయడం జరిగింది,ఆరు సంవత్సరాల లోపు పిల్లల తల్లిదండ్రులు ఈ అంగన్వాడి కేంద్రాలను ఉపయోగించుకొని వారి వికాసానికి కృషి చేయాలని తెలియజేశారు,ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యాదయ్య,పంచాయతీ కార్యదర్శి రాములు,గ్రామ పెద్దలు రామ్ రెడ్డి, హనుమంత్ రెడ్డి,నరసింహారెడ్డి,సుభాన్ రెడ్డి, మల్లారెడ్డి,సంజీవరెడ్డి,మహేందర్ రెడ్డి మల్లేశం యాదుల్,శంకర్,అంగన్వాడి టీచర్,విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక..



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఫిబ్రవరి 2**రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జమ్మికుంట శాఖ సర్వసభ్య సమావేశం చైర్మన్ దాసరి రాజేశ్వర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగినది. ఇట్టి సమావేశంలో నూతన కార్యవర్గనీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు దాసరి రాజేశ్వర్ మాట్లాడుతూ జమ్మికుంట శాఖ ఎన్నో రోజులుగా ఏఐఆర్ఎఫ్ అనుబంధంగా ఉన్నది, కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ సంస్థ నుండి విడిపోయి ప్రస్తుతం ఆల్ ఇండియా రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ కు అనుబంధంగా మారుటకు అందరూ సభ్యులు ఆమోదంతో ఈ సంస్థలో చేరడం జరిగిందని తెలిపారు. అనంతరం అధ్యక్షులు దాసరి రాజేశ్వర్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గా టీ వెంకటస్వామి, వైస్ ప్రెసిడెంట్ గా ఎండి ఖాజా మొయినుద్దీన్, కార్యదర్శిగా ఎస్ మల్లేశం, సంయుక్త కార్యదర్శులుగా డి సారంగపాణి, ఎస్ రాజయ్య,కోశాధికారిగా టీ విద్యాసాగర్, ఉప కోశాధికారిగా ఎండి ఖాదర్ ఖాన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైల్వే రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కి 16 ఆర్జీలు...

## ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత నివ్వాలి:జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 2(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి/**



ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు,కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య,అడిషనల్ కలెక్టర్లు మాధురి,పాండు లతో కలిసి వినతులను స్వీకరించారు,ఈ సందర్భంగా అర్జీదారులు భూ సమస్యలు, ఆసరా పింఛన్లు,ఇందిరమ్మ ఇండ్లు,తదితర అంశాలతో పాటు పంచాయతీరాజ్

ఇంజనిరింగ్, విద్యుత్, వ్యవసాయ,విద్య, వైద్య ఆరోగ్య,ఎక్సైజ్, డిడబ్ల్యుఓ, డిసిఎస్ ఓ, పశుసంవర్ధక, శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను కలెక్టర్ కు అందజేశారు. ఆయా వినతులను పరిశీలించి త్వరిత గతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు,ప్రజావాణి లో 16 అర్జీలు అందాయని తెలిపారు,ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ఆర్జి దారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు,ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి,పాండు,వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, కలెక్టరేట్ ఏఓ,ప్రజలు పాల్గొన్నారు .

## ఆల్ ఇండియా డిమాండ్స్ డే

**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఫిబ్రవరి 2** ఆల్ ఇండియా రైల్వే మేన్ ఫెడరేషన్ -సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికిద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ పి. రవిందర్ పిలుపు మేరకు జమ్మికుంట బ్రాంచ్ చైర్మన్ వి.రాజయ్య ఆధ్వర్యంలో "డిమాండ్స్ డే"

ఎనిమిదవ వేతనం సంఘం సిఫార్సులు 1-1-2026నుండి అందరి ఉద్యోగులకు పెన్షన్ దారులకు వెంటనే అమలు చేయాలని , రైల్వే లో కాలీగా పోస్టులను భర్తిచేయాలనీ అన్ని రైల్వే యూనిట్ల వద్ద అందరూ రైల్వే ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఆఫీస్ బేరర్స్ మరియు కమిటీ మెంబెర్స్,ఉమేన్స్ కమిటీ మెంబెర్స్ పాల్గొన్నారు.



## మహాశివరాత్రి జాతర ఆహ్వాన గోడ పత్రిక ప్రారంభం.






**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం మరియు అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఫిబ్రవరి నెలలో జరిగే మహాశివరాత్రి జాతర సందర్భంగా ఆహ్వాన గోడ పత్రికను తెలంగాణ వ్యాప్తంగా అతికించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేపట్టారు.

ఫిబ్రవరి నెల 14,15,16 తేదీలలో జరగనున్న మహాశివరాత్రి జాతరకు సంబంధించి తొలి గోడ పత్రికను ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ ప్రారంభించారు.

ఈ జాతరకు తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్న నేపథ్యంలో భక్తులకు జాతర వివరాలు తెలియజేసేందుకు గోడ పత్రిక ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

## అవకాశం ఇస్తే వార్డు ప్రజలు గర్వపడేలా పనిచేస్తా

## మున్సిపల్ ఎన్నికల బరిలో మహ్మద్ మస్రత్ సానియా ఖాదిర్ హైమద్.



**జహీరాబాద్ ప్రతినిధి ఫిబ్రవరి 2(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**జహీరాబాద్/మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా భరత్ నగర్,తమ్మడుపల్లి నుంచి అభ్యర్థిగా మహ్మద్ మస్రత్ సానియా ఖాదిర్ హైమద్ బరిలో నిలుచోవడం జరిగింది,అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో జహీరాబాద్ లో నాటి మంత్రి గీతారెడ్డి ఉన్నప్పుడు మేం గీతారెడ్డి కృషితో భరత్ నగర్ లో 400 వందల మందికి ఇళ్ల స్థలాలు పట్టాలు ఇప్పించిన ఘనత ఉందని కోరుతూ ఇప్పటికి కూడా ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమ్యస్యలను ఎప్పటికప్పుడు తీరుస్తూ ముఖ్యంగా నీటి కష్టాలు,మురికి కాలువలు,స్ట్రీట్ లైట్లు,కావచ్చు రోడ్లు అధికారులతో మాట్లాడి కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా తోడ్పడడం జరిగిందని అంతేకాకుండా నీరుపేద కుటుంబాలు అయిన ఆడబిడ్డల పెండ్లిలకు తన వంతు సాయం కృషి చేస్తున్నాంమని,కావున నూతనంగా ఈ గ్రామం మున్సిపల్ లో వీలినం అయినందున మున్సిపల్ ఎన్నికల బరిలో మేం నిలబడడం జరిగిందని,కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మస్రత్ సానియా ఖాదిర్ మహ్మద్ వార్డు నెంబర్ 2 భారత్ నగర్,మహేంద్ర కాలనీ మరియు ఇతర కొన్ని వార్డులకు గల ఓటరు మహాశయులకు మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరుతున్నాం.

## వేములవాడలో బిజెపికి బిగ్ షాక్.

### 12వ వార్డు మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ లో చేరిక.

### వేములవాడ మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యం.

### కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ప్రభుత్వ విప్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** సోమవారం రోజున వేములవాడ మున్సిపల్ 12వ వార్డుకు చెందిన రామతీర్థం కృష్ణవేణిబిహరీష్ లు వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఫిబ్రవరి 11వ తేదీన వేములవాడ లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని ప్రభుత్వ విప్ సూచించారు.

గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం వేములవాడ అభివృద్ధిని విస్మరించిందన్నారు. వేములవాడ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అండగా ఉండాలని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన రామతీర్థం హరీష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ గత మున్సిపల్ పాలకవర్గంలో కూడా 12వ వార్డు నుండి మున్సిపల్ కౌన్సిలర్ గా గెలిచి ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, ప్రస్తుతం రాష్ట్రంలో, వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని, గతంలో ఆదరించిన మాదిరిగా 12వ వార్డు పట్టణ ప్రజలు మరొకసారి ఆదరించి ఆశీర్వదించి రామ తీర్థపు కృష్ణవేణి నీ గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొడ్డి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, రామతీర్థపు అంజయ్య, కాంగ్రెస్ పార్టీ వేములవాడ ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## వేములవాడలో సోమవారం రోజు నుండి ఎరువుల కొనుగోలు యాప్ అమలులోకి వచ్చింది.

**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** సోమవారం రోజు నుండి అనగా (02/02/2026) యూరియా ఎరువుల కొనుగోలు గురించి రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఎరువుల కొనుగోలు యాప్ అందుబాటులోకి వచ్చింది. ఇకపై ఎవరైనా రైతులు యూరియా కొనుగోలు చేయాలంటే కచ్చితంగా ఎరువులు యాప్ ద్వారానే తమకు కావలసిన యూరియా సంచులు ముందుగా బుకింగ్ చేసుకోవాలి. ఈ యాప్ లో జిల్లాలోని మొత్తం ప్రభుత్వ మరియు ప్రైవేటు ఫర్టిలైజర్ షాపుల డీలర్ల వద్ద ఉన్న మొత్తం యూరియా సంచులు ఎన్ని నిల్వ ఉన్నాయో తెలుస్తాయి మరియు రైతులు తమకు నచ్చిన డీలర్ వద్ద అనగా ఏదైనా మండలంలో లేక తన సొంత మండలంలో యూరియా కొనుగోలు చేయవచ్చు ఇట్టి యాప్ గురించి సంబంధిత డీలర్ లేదా ప్యాక్స్ సహకార





సొసైటీ వద్ద సలహా కేంద్రం మరియు యాప్ పైన సంబంధిత వ్యక్తిని నియమించడం జరిగింది. కావున రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

యాప్ లింకు ఇవ్వడం జరిగింది ఇది గూగుల్ ప్లే స్టోర్ లలో కూడా లభించును.

సోమవారం రోజున వేములవాడ సొసైటీలో రైతులకు యూరియా యాప్ గురించి వివరించి యాప్ ద్వారా రైతులకు యూరియా బుకింగ్ చేసి ఇవ్వడం జరిగింది అని వేములవాడ మండలం వ్యవసాయ శాఖ అధికారి సాయి కిరణ్ తెలిపారు.

## అభ్యంతరాల పరిష్కారంలో నిబంధనలు పాటించాలి

## జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 02 :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్లపై అందిన అభ్యంతరాలు,ఫిర్యాదుల పరిష్కారంలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని చెన్నూర్ మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి నామినేషన్లపై అందిన అభ్యంతరాలు,ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ మాట్లాడుతూ...చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులకు సంబంధించి ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్లపై అందిన దరఖాస్తులను ఎన్నికల నిబంధనల ప్రకారం పరిష్కరించి అర్హులైన అభ్యర్థుల జాబితా తయారు చేయాలని,3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్,12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే),13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చుని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. అనంతరం చెన్నూర్ పట్టణంలో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అమృత్ 2.0 క్రింద పట్టణంలో చేపట్టిన నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించి, వచ్చే వేసవిలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి సమస్యలు లేకుండా పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా చెన్నూర్ మండల కేంద్రంలో చేపట్టిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం చేపట్టిన మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను సన్నద్ధం చేయాలని, ఉత్తమ ఫలితాలు సాధన దిశగా ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పక్క ప్రణాళిక ప్రకారం శివరాత్రికి వసతులు కల్పించాలి.

**అధికారులు సమన్వయంతో జాతర వేడుకలు విజయవంతం చేయాలి.**

**మహాశివరాత్రి జాతర సమన్వయ సమావేశంలో జాతర కమిటీ చైర్ పర్సన్, ఇంచార్జ్ కలెక్టర్ గరీమ అగ్రవాల్.**

**వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సమన్వయ సమావేశం.**







**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతరకు పకడ్బందీగా ప్రణాళిక ప్రకారం ఆయా శాఖల అధికారులు వసతులు కల్పించాలని జాతర కమిటీ చైర్ పర్సన్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గారి ఆదేశించారు. ఈనెల 14,15,16 తేదీలలో మహాశివరాత్రి జాతర సందర్భంగా అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించగా, జాతర కమిటీ చైర్ పర్సన్, ఇన్చార్జి కలెక్టర్ గరీమ అగర్వాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే, వేములవాడ ఏ ఎస్ పి రిత్విక్ సాయి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా జాతర కమిటీ చైర్ పర్సన్, ఇన్చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్ మాట్లాడుతూ వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్ నుంచి రాజన్న ఆలయం దాకా, వేములవాడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లలో మరమ్మత్తులు, నిర్మాణాలు, హెలిప్యాడ్ వద్ద, ఇతర చోట్ల భారీ కేడింగ్ పక్కా ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఈ సంవత్సరం 600 బస్సులు ఏర్పాటు చేస్తామని, ఇంకా భక్తుల రద్దీకి అనుగుణంగా వాహనాలు అందుబాటులో పెడతామని ఆర్టిసి ఆర్ఎం తెలిపారు. జడ్పీ డిప్యూటీ సీఈవో, వేములవాడ మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి సంయుక్తంగా ఆలయ పరిసరాలు, పార్కింగ్ స్థలాలు, క్యూలైన్లు ఇతర చోట్ల మూడు షిఫ్టులలో సిబ్బంది పనిచేసేలా చూడాలని ఆదేశించారు. జాతరకు ముందు నుంచి తర్వాత మూడు రోజుల వరకు పారిశుద్ధ సేవలు అందించాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో బస్టాండ్, పార్కింగ్ స్థలాలు, ఇతర చోట్ల పూర్తి వివరాలతో హెల్ప్ డెస్కు సిబ్బంది అందుబాటులో ఉండాలని, ప్రతిచోట అన్ని వివరాలతో కూడిన సైన్ బోర్డులు పెట్టించాలని తెలిపారు. ఆలయంలోని క్యూ లైన్ ల వద్ద, పార్కింగ్ స్థలాల వద్ద, బస్టాండ్లలో త్రాగునీటి సౌకర్యం కల్పించాలని మిషన్ భగీరథ, ఆలయ అధికారులను ఆదేశించారు. భక్తులకు అల్పాహారం చక్కటి వాతావరణం లో అందించాలని సూచించారు. సెస్ అధికారులు భీమేశ్వర ఆలయం, బద్ది పోచమ్మ ఆలయం, ఇతర చోట్ల 24 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, జనరేటర్లు ఏర్పాట్లు కూడా చేసుకోవాలని అధికారులు, సిబ్బంది అలర్ట్ గా ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భీమన్న ఆలయం, ప్రసాదం కౌంటర్, పార్కింగ్ స్థలాలు ఇతర చోట్ల వైద్యులు, సిబ్బంది అంబులెన్స్ లతో సిద్ధంగా ఉండాలని, వేములవాడ ఏరియా ఆసుపత్రి, సిరిసిల్ల జిజిహెచ్ వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ అధికారులు ప్రధాన ఆలయాలలో ఫైర్ సేఫ్టీ పరికరాలు చెక్ చేయాలని, వారి సిబ్బంది గుడి ఆవరణలో జాతర సమయంలో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు భక్తులకు అందించే ప్రసాదం, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించాలని ఆదేశించారు. క్యూలైన్లు, వీఐపీలు, కళ్యాణ కట్ట, ఇతర చోట్ల రద్దీ నియంత్రణ, దర్శనం పూర్తి చేసేందుకు జిల్లా స్థాయి అధికారులను నియమించామని, వారు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు. నాంపల్లి వద్ద భక్తుల రద్దీ నియంత్రణ, ఏర్పాట్ల కల్పనకు ఇద్దరు అధికారులను నియమించమని వివరించారు. కోడెల నిర్వహణ, సంరక్షణ జిల్లా పశుసంవర్ధక శాఖ, ఆలయ అధికారులు సమన్వయంతో చూసుకోవాలని ఆదేశించారు. వేములవాడలో లాడ్జిలలో అద్దెలు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. జాతరలో ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుండా చూడాలని, క్యూలైన్ల వద్ద తాగునీటిని స్టీల్ గ్లాసులలో ఇవ్వాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులకు సహాయం కోసం వీల్ చైర్లు, వాలంటీర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతర విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి కావలసిన గదులు, ఆహారం, ఇతర సదుపాయాలు వేములవాడ ఆర్డిఓ, ఆలయ అధికారులు చూసుకోవాలని సూచించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని, జాతరకు వచ్చే భక్తులకు ఎక్కడ దర్శనం, వసతులలో ఇబ్బందులు రాకుండా చూడాలని స్పష్టం చేశారు. జాతరకు వచ్చిన భక్తులు దర్శనం, క్షేమంగా ఇంటికి వెళ్లేలా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. జాతరకు సంబంధించిన పనులన్నీ రానున్న వారం రోజులలో పూర్తిచేయాలని జాతర చైర్ పర్సన్, ఇన్చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్ ఆదేశించారు.

**ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు. ఎస్పీ మహేష్ బి గీతే.**

మహాశివరాత్రి సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే తెలిపారు. సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తూ భద్రతా చర్యలు పర్యవేక్షిస్తామని వివరించారు. తిప్పాపూర్ బస్టాండ్, ఇతర బస్టాండ్, రద్దీ ప్రదేశాలలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి ఏకాంత సేవలు, పూజలు కొనసాగుతాయని ఆలయ అర్చకుడు చంద్రగిరి శరత్ తెలిపారు. భీమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి జాతర, స్వామివారికి పట్టు వస్త్రాల సమర్పణ టిటిడి, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అందిస్తారని వెల్లడించారు.

ఈ సమావేశంలో రాజన్న ఆలయ ఈవో రమాదేవి, వేములవాడ ఆర్డీవో రాదాబాయి, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న మర్పల్లి కాంగ్రెస్ నాయకులు




**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఫిబ్రవరి 2(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** వికారాబాద్ మున్సిపాలిటీ ఎలక్షన్ లో భాగంగాతెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కూతురు గడ్డం అనన్య గెలిపే లక్ష్యంగా మర్పల్లి మండల కాంగ్రెస్ నాయకులు పసియో ద్దిన్, మాజీ ఎంపీటీసీ మహేష్ , వెంకట్ వికారాబాద్ నియోజకవర్గ శివరామ్ నగర్ కాలనీలో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయమే ధ్యేయంగా నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.




వికారాబాద్ లోని శివరామ్ నగర్ కాలనీలో నీ 31వ వార్డు అభ్యర్థి మల్లికార్జున గౌడ్,32 బాదం అనురాధఅశోక్ తరపున ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పసియోద్దీన్, మహేష్ మరియు వెంకట్ వార్డులోని ప్రతి గడపకూ వెళ్లి, కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ, “చేతి గుర్తు”కే మీ అమూల్యమైన ఓటు వేసి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గడ్డం అనన్య నాయకత్వంలో వికారాబాద్ మున్సిపాలిటీ సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించాలని వారు కోరారు.

## ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకి అప్రెంటిస్షిప్ ఎంబెడెడ్ డిగ్రీ/డిప్లొమా ప్రోగ్రామ్(ఏ ఈ డి పీ) కింద కొత్త కోర్సులు మంజూరు

**ప్రిన్సిపాల్ మహాత్మా సంతోష్**

ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 02 : తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాలలోని లక్షెట్టిపేట కళాశాలకు కొత్త కోర్సులు మంజూరు,ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకి అప్రెంటిస్షిప్ ఎంబెడెడ్ డిగ్రీ/డిప్లొమా ప్రోగ్రామ్(ఏ ఈ డి పీ) కింద కొత్త కోర్సులు మంజూరు అయినట్లు ప్రిన్సిపాల్ మహాత్మా సంతోష్ తెలిపారు.బి ఎస్.ఈ. హెల్త్ కేర్ మరియు బి.కాం. బ్యాకింగ్ ఫైనాన్సియల్ సర్వీసెస్ లో అప్రెంటిస్ ఎంబెడెడ్ డిగ్రీ కోర్సులు లక్షెట్టిపేట కాలేజీకి మంజూరు చేస్తున్నట్లు వచ్చే విద్యా సంవత్సరం నుండి వాటిలో ప్రవేశాలు తీసుకోవాలని కాలేజీ విద్యా కమీషన్ కార్యాలయం నుండి సమాచారం వచ్చిందని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులకు ఉపాధి ఆధారిత కోర్సులు గ్రామీణ ప్రాంతానికి అందుబాటులోకి తెస్తున్నట్లు వీటిని లక్షెట్టిపేట ప్రాంత యువత ఉపయోగించుకోవాలని తెలిపారు.

## మేయర్/చైర్మన్ ఎంపిక ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని**





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 02** : 2వ సాధారణ మున్సిపల్ కార్పొరేషన్ / మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా మేయర్/చైర్మన్ ఎంపిక ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణి కుముదిని అన్నారు.సోమవారం హైదరాబాద్ నుండి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ శ్రీదేవి, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్ల లతో మున్సిపల్ ఎన్నికలలో భాగంగా మేయర్ / చైర్మన్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపాలిటీ/మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో నామినేషన్లు స్వీకరించడం జరిగిందని,అభ్యంతరాలు, ఉపసంహరణల అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను తయారు చేయడం జరుగుతుందని,వెంటనే గుర్తుల కేటాయింపు చేసి బ్యాలెట్ పేపర్లను ముద్రణకు సిద్ధంగా ఉండాలని తెలిపారు.11వ తేదీన ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని,12 రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13 వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు.అనంతరం మేయర్లు / చైర్మన్ల ఎంపిక ప్రక్రియలో ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని,ఇందులో భాగంగా ఎంపిక చేయబడిన అధికారులకు ఆన్లైన్ ద్వారా కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ...జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు 4 మున్సిపాలిటీలలో ఎన్నికల నిర్వహణ అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపడుతున్నామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం మేయర్ / చైర్మన్ ఎంపిక ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు జశ్వంత్, రాజేంద్రప్రసాద్,మహేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ”నోబెల్ బైసన్ టీఎంటీ, సంగం స్టీల్ టీ ఎమ్ టి కంపెనీ ద్వారా ఉచిత మినరల్ వాటర్ పంపిణి”

గోదావరిఖని : మినీ మేడారం గా పిలువబడే సమ్మక్క సారక్క జాతర సందర్భంగా భక్తులు సౌకర్యార్థం సంఘం స్టీల్ మరియు నోబుల్ బై సన్ టీ ఎం టీ స్టీల్ సంస్థ గత నాలుగు రోజులుగా నిరంతరాయంగా ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ చేసిందని సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ వై పి అజయ్ తెలిపారు సమ్మక్క సారాలమ్మ జాతరలొ ఎర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ పంపిణీ రామగుండం శాసన సభ్యులు రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్, మాజీ ఫ్లోర్ లీడర్ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మహంకాళి స్వామి చేత ప్రారంభించారన్నారు. ఎం ఎల్ ఏ మక్కాన్ సింగ్ సంఘం స్టీల్ మరియు బైసన్ స్టీల్ సంస్థ చేస్తున సేవలను కొనియాడారన్నారు. డి జి ఎం వై పి అజయ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సంఘం స్టీల్ మరియు నోబుల్ బైసన్ టీ ఎమ్ టీ డీలర్ ల ఆదేశాల తో జాతర కు ఈ ప్రాంత నలుమూల నుండి వచ్చిన వేలాది భక్తుల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో ఈ ఉచిత మినరల్ వాటర్ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని అదేవిదంగా తెలంగాణ రాష్ట్రంలో విస్తృతంగా వ్యాపారం నిర్వహిస్తున్నా సంస్థగా సమాజంలో భాగస్వామ్యం కావడం తమ భాద్యతగా భావిస్తున్నామని భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవ కార్యక్రమాలు ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధికారులు అభిషేక్ ,సోషల్ వర్కర్ అరెంద రాజా గోపాల్, జుల శ్రీనివాస్ మరియు సహకరించిన ఆలయ ఈఓ చైర్మన్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com